మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 24.7.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4

సంపుటి (Volume): 16 సంచిక (Issue): 49
వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline


## జంతర్‌మంతర్ నుంచి తక్షణమే వెళ్లిపోండి



- విద్యార్థులకు కేంద్రం సర్కార్ హుకుం
- ఇంటర్నెట్ నిలిపివేత.. మెట్రో, దుకాణాల మూత
- అల్లర్లలో ఎవరు పాల్గొన్నా పాస్‌పోర్ట్ రద్దు!
- అరెస్టులపై ఢిల్లీ పోలీసులకు సూపర్ పవర్స్
- డ్రగ్స్ కేసు పెట్టి లోపలేస్తా: ముంబైలో బెదిరింపు

› 7



## విద్యార్థులకు మద్దతుగా బర్త్‌డే వేడుకలు రద్దు చేసుకున్న కేటీఆర్

- ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని పిలుపు
- సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచన

› 2

# ఇండియా రియాక్ట్స్ బీఆర్ఎస్ కనెక్ట్స్

## INDIA REACTS.. BRS CONNECTS



**• ఇండియా మౌనంగా ఉండదు: కేసీఆర్**

నాడు కాంగ్రెస్ అసమర్థ విధానాలతో దేశం బ్రెయిన్ డ్రెయిన్ అయిపోతే.. బీజేపీ అసమర్థ పాలనతో క్యాపిటల్ డ్రెయిన్ అవుతున్నది. నాకు సంపూర్ణ విశ్వాసం ఉన్నది. ఇండియా రియాక్ట్స్. ఇండియా ఓ తెలివైన దేశం. అవసరమైనప్పుడు కచ్చితంగా ఇండియా రియాక్ట్ అవుతుంది. ఇండియాకు రియాక్ట్ అయ్యే ఆ కెపాసిటీ ఉన్నది. మౌనంగా చూస్తూ ఈ దేశం కూర్చోదు.

**• ఈ దేశాన్ని కాపాడుకునే బాధ్యత యువకులదే: కేసీఆర్**

యువకుల్లారా! ఈ దేశం మీది. భవిష్యత్తు మీది. మీరు కాపాడుకోవాలి. దేశంలో ఉన్న ప్రతి మేధావికి, రచయితకు, కవికి, కళాకారునికి, జర్నలిస్టు లోకానికి నేను చేతులెత్తి దండం పెట్టి చెప్తున్నా. చెడుపై ఎక్కడో ఓ చోట పోరాటం మొదలు కావాలి. బీజేపీ అరాచకాలను, దుర్మార్గాలను ఇట్లనే భరిస్తూపోతే ఈ దేశం తప్పకుండా సర్వనాశనమైతది. ఎటూ కాకుండాపోతది.

(10.07.2022న కేసీఆర్ వ్యాఖ్యలు)





నాణ్యమైన విద్య, మెరుగైన పరీక్షల విధానం కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్న విద్యార్థులు

## నేడు విద్యాసంస్థల బంద్

విద్యార్థుల దేశవ్యాప్త నిరసనలు

- పిలుపునిచ్చిన లెఫ్ట్ విద్యార్థి సంఘాలు
- పరీక్షలు వాయిదా వేసిన వర్సిటీలు

› 3




### విద్యార్థులు, యువతకు బాసటగా గులాబీ పార్టీ

### బీజేపీ అణచివేత, దమనకాండపై ప్రత్యక్షపోరు

### నేడు ధర్నా.. హాజరుకానున్న వర్కింగ్ ప్రెసిడెంట్

### మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు


**రాజకీయాలకు అతీతంగా కాజ్ కోసం రణంలోకి**





హనుమకొండ, జూలై 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకొంటున్నది. నాణ్యమైన విద్య, మెరుగైన పరీక్షల విధానం కోసం గళమెత్తిన విద్యార్థులపై కేంద్ర సర్కార్ కొనసాగిస్తున్న అణచివేత, దమనకాండను వ్యతిరేకిస్తూ గులాబీ పార్టీ ప్రత్యక్ష పోరాటం చేయాలని సంచలన నిర్ణయం తీసుకున్నది. నీట్ అక్రమాలపై గళమెత్తిన విద్యార్థుల డిమాండ్‌కు మద్దతుగా దేశంలోనే ప్రత్యక్ష పోరాటానికి దిగిన ఏకైక పార్టీగా బీఆర్ఎస్ నిలుస్తున్నది. విద్యార్థులపై బీజేపీ ప్రభుత్వ దాడులు, వేధింపులకు నిరసనగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు శుక్రవారం తన పుట్టిన రోజు వేడుకలను రద్దు చేసుకుని మరీ విద్యార్థుల పోరాటానికి అండగా నిలిచే ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొనాలని నిశ్చయించుకొన్నారు. విద్యార్థులు, › 2వ పేజీలో





## కఠిన చర్యలపై క్యాబినెట్‌లో నిర్ణయం



నీట్ పేపర్ లీక్‌పై కఠిన చర్యలు ఉంటాయి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించా. శుక్రవారం కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నాం. పేపర్ లీకేజ్ ఘటనపై రెండున్నర నెలల్లో అనేక సమర్థవంతమైన చర్యలు తీసుకున్నాం. నిందితులను పట్టుకున్నాం. విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలన్న ప్రభుత్వ బాధ్యతను నెరవేర్చాం.

– గురువారం అర్ధరాత్రి వీడియో సందేశంలో ప్రధాని మోదీ

› 7

## దీక్ష విరమించిన వాంగ్‌చుక్



- దిగొచ్చిన మోదీ సర్కార్.. డిమాండ్లకు అంగీకారం
- మంత్రుల బృందంతో అర్ధరాత్రి చర్చలు సఫలం
- నాలుగో రోజూ స్తంభించిన పార్లమెంట్ › 7
- కేంద్ర విద్యా కార్యదర్శిపై ప్రభుత్వం బదిలీ వేటు

## కాంగ్రెస్ పలాయన వాదం?

- రాహుల్ గాంధీ రాజకీయం.. నిరసనల డ్రామా
- జంతర్ మంతర్‌కు తప్ప అన్ని చోట్లకూ చక్కర్లు

› 7



## కాంగ్రెస్‌కు నిజాయితీ లేదు

- విద్యార్థులు ఆందోళనకు దిగినప్పుడే ఆ పార్టీ రావాల్సింది
- వాంగ్‌చుక్ ప్రతిష్ఠను అది రాజకీయాల కోసం వాడుకుంటున్నది
- ప్రజల్ని మభ్యపెట్టడం సాధ్యం కాదు.. వాంగ్‌చుక్ భార్య గీతాంజలి

› 7

## 2024 నీట్ లీక్ కింగ్‌పిన్‌కు క్లీన్‌చిట్

- సంజీవ్ కుమార్ తప్పేమీ లేదన్న సీబీఐ
- లీక్ చేసినట్టు ఆధారాల్లేవని చెప్పిన అధికారులు

› 7

## నా చావుకు కారణం మోదీ



వంశీ ఆత్మహత్యకు నిరసనగా సిరిసిల్లలో ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ నాయకులు, పిట్ల వంశీ (ఇన్‌సెట్)

### యువకుడి ఆత్మహత్య

- సర్ ఫామ్‌పై మరణ వాంగ్మూలం
- దానిని వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్న పిట్ల వంశీ
- సిరిసిల్ల జిల్లా గొల్లపల్లిలో ఘటన

**బీఆర్ఎస్ ర్యాలీకి ఎలా అనుమతిస్తరు?**

- సిరిసిల్ల పోలీసులపై కేంద్ర మంత్రి రుసరుసలు
- ఎల్లారెడ్డిపేట ఎస్సైపై వేటు

› 8

## కేంద్రాన్ని మరచి.. కేటీఆర్‌పై చిందులు

- రేవంత్ మరో అటెన్షన్ డైవర్షన్ డ్రామా › 6
- కేంద్రాన్ని ప్రశ్నించేందుకు జంకుతున్న సీఎం
- బోడిగుండుకూ మోకాలికి ముడిపెట్టి మాటలు
- డైవర్షన్ కోసమే గ్లోబరీనా వివాదం తెరపైకి
- గ్లోబరీనా, కేటీఆర్‌కు లింకు పెడుతూ విమర్శలు
- వివాదం ఏదైనా కేటీఆర్ టార్గెట్‌గా ఆరోపణలు

## లైడిటెక్టర్ పరీక్షకు నేను రెడీ సీఎం సిద్ధమా?

- గ్లోబరీనాతో ఎలాంటి సంబంధంలేదన్న కేటీఆర్
- 48 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేదంటే పరువునష్టం దావా..రేవంత్‌కు లీగల్ నోటీసులు

వరంగల్/హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): గ్లోబరీనా తన బినామీ సంస్థ అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తీవ్రంగా ఖండించారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి పూర్తిగా అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలపై తాను ఇప్పటికే ఆయనకు లీగల్ నోటీసు పంపినట్టు తెలిపారు. '48 గంటల్లో › 2వ పేజీలో

# హైడ్రాపై మిలిటరీ యాక్షన్ తప్పదు

- కోర్టు ధిక్కరణ కేసులో ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు
- ఆర్మీ జోన్‌లోని స్థలం రక్షణకు సైనికులను నియమిస్తాం
- అక్కడికొచ్చే హైడ్రా అధికారులను అదుపులోకి తీసుకొని, ఆర్మీ బ్యారక్‌లలో ఉంచేలా ఆదేశాలు ఇవ్వగలం
- సైన్యానికి ఉత్తర్వులు ఇవ్వకూడదని మాకు తెలుసు.. కానీ రాష్ట్ర ప్రభుత్వంపై కోర్టుకు విశ్వాసం సన్నగిల్లింది
- హైడ్రాను విడిచిపెడితే రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తది
- న్యాయవ్యవస్థ శక్తి ఏమిటో హైడ్రాకు తెలిసేలా చేస్తాం
- ప్రభుత్వ అండ ఉన్నంత మాత్రాన ప్రైవేట్ ఆస్తుల్లోకి వెళ్తరా?
- అసాధారణ స్థాయిలో స్పందించిన జస్టిస్ అనిల్‌కుమార్
- పలుమార్లు హెచ్చరించినా రంగనాథ్ మారలేదని నిప్పులు
- అడ్వొకేట్ జనరల్ ప్రత్యేక వినతితో ఉత్తర్వుల నిలుపుదల
- పిటిషన్‌పై విచారణను నేటికి వాయిదా వేసిన ధర్మాసనం



జస్టిస్ అనిల్ కుమార్

## హైకోర్టు సంచలన వ్యాఖ్యలు.. ఏజీ వినతితో ఆర్డర్ నిలిపివేత

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): న్యాయస్థానం ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘిస్తున్న హైడ్రాపై మిలిటరీ యాక్షన్‌కు ఆదేశిస్తామని రాష్ట్ర హైకోర్టు హెచ్చరించింది. ఆర్మీజోన్‌లో ఉన్న వివాదాస్పద స్థలం రక్షణకు అవసరమైతే సైన్యాన్ని రంగంలోకి దింపుతామని పేర్కొన్నది. తమ ఆదేశాలను కాదని ఎవరైనా వస్తే అదుపులోకి తీసుకొని ఆర్మీ బ్యారక్స్‌లో పడేయాలని, కోర్టులో హాజరుపరుచాలని సైన్యాన్ని కోరుతామని వ్యాఖ్యానించింది. హైడ్రాను ఇలాగే వదిలేస్తే రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అది జరుగనివ్వబోమని స్పష్టంచేసింది. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వెంటనే సీనియర్ బ్రిగేడియర్‌ను సంప్రదించి, 10 మంది ఆర్మీ సిబ్బందిని నియమించేలా కోరాలని ఆదేశించింది. రాష్ట్ర యంత్రాంగంపై విశ్వాసం సన్నగిల్లడంతో న్యాయపాలన రక్షణలో భాగంగా ఆర్మీని పిలిపించక తప్పడం లేదని స్పష్టంచేసింది. సచివాలయంలో కూర్చొన్న వాళ్లకు రాష్ట్రంలో ఏం జరుగుతున్నదో తెలియాల్సిన అవసరం ఉన్నదని వ్యాఖ్యానించింది. తమ ఆదేశాలను ఉల్లంఘించి ఆ భూమిలో ఎవరు అడుగుపెట్టినా అదుపులోకి తీసుకోవాలని సైన్యానికి సూచిస్తామన్నది. అయితే చివరి నిమిషంలో అడ్వొకేట్ జనరల్ విజ్ఞప్తి మేరకు ఉత్తర్వుల జారీని నిలిపివేసింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

### ఆర్మీని రంగంలోకి దించండి

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట గ్రామం సర్వేనంబర్ 1, 2లోని 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. దీనిని సవాల్ చేస్తూ శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అత్యవసరంగా సోమవారం › 8వ పేజీలో



స్వయంగా అడ్వొకేట్ జనరల్ రెండు రోజుల క్రితం ఇచ్చిన హామీకి విరుద్ధంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారంటే ఏమనుకోవాలి. మళ్లీ అలానే వ్యవహరిస్తే ఆర్మీని పిలిచి హైడ్రా అధికారులను బ్యారక్‌లో ఉంచాలని ఆదేశించగలం. వివాదాస్పద ప్రైవేట్ స్థలం రక్షణ కోసం పది మంది ఆర్మీ సిబ్బందిని సిద్ధం చేయాలి. స్థలంలోకి వచ్చే హైడ్రా సహా వారికి మద్దతుగా ఎవరైనా ప్రవేశించినా ఆర్మీ సిబ్బంది అదుపులోకి తీసుకుని బ్యారక్స్‌కు తరలించాలి. వాహనాలను కూడా సీజ్ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం లేకపోవడంతో ఆర్మీకి ఆదేశాలు ఇవ్వాల్సి వచ్చింది. రాష్ట్రం బయట ఏం జరుగుతున్నదో సచివాలయంలో కూర్చున్నవారికి కూడా తెలియాల్సిన అవసరం ఉన్నది.

–హైకోర్టు



## ఎకరాలను గజాల్లోకి మార్చి.. ప్రజలను బకరాలను చేసి!

అసైన్డ్ భూమిని కాజేసిన అధికార పార్టీ ఎమ్మెల్యే తన సంస్థ ద్వారా ఓవర్‌ల్యాపింగ్ భూమి కొనుగోలు

- సర్వే నంబర్ మార్చి, వెంచర్ వేసి, విల్లాల నిర్మాణం
- సామాన్యులకు అమ్మి సొమ్ము చేసుకున్న ప్రజాప్రతినిధి
- రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం
- చివర్లో మేల్కొని సర్వేచేసి, ఆక్రమణలని తేల్చిన అధికారులు
- నిషేధిత జాబితాలో చేర్చడంతో రోడ్డున పడ్డ కొనుగోలుదారులు

› 5



## బాలికల గురుకులంలో ఫుడ్ పాయిజన్

- బెల్లంపల్లిలో 30 మందికి అస్వస్థత
- ఏడుగురి పరిస్థితి విషమం

› 8

## ఎమ్మెల్యే కవ్వంపల్లి పీఏ వేధింపులతో యువకుడి ఆత్మహత్య!



- కాంగ్రెస్ అరాచకాలపై ప్రశ్నిస్తున్నాడని కక్ష
- అక్రమంగా కేసులు పెట్టడంతో మనస్తాపం
- ఇటీవల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట నిప్పంటించుకున్న రాజేందర్‌రెడ్డి

› 8

**రోడ్డు వెడల్పులో ఇల్లు పోతున్నదని మహిళకు గుండెపోటు** › 8



## మక్కల కొనుగోళ్లపై విచారణ షురూ

బాదేపల్లి పీఏసీఎస్‌లో అధికారుల తనిఖీలు

› 3

# మోదీ అంటే కేడీకి భయం

## పాత కేసులు.. సొంత పనుల కోసమే రేవంత్ రాజీ: కేటీఆర్

- పగలు కాంగ్రెస్ రాజకీయం.. రాత్రి బీజేపీతో అంటకాగే నైజం
- మోదీపై కాంగ్రెస్ ఢిల్లీలో నిరసన చేస్తే కొడంగల్‌లో రేవంత్ నిరసన
- రాహుల్‌కు ఒక మూట.. మోదీకి 2 మూటలు.. అదే రేవంత్ తీరు
- ఎన్‌డీఎస్‌ఏ వివరణతో అడ్డంగా దొరికిన కాంగ్రెస్ పాలకులు
- ఎవరితోనూ పొత్తులు ఉండవు
- త్వరలో చేవెళ్లలో దళిత సదస్సు
- విద్యార్థుల పోరాటానికి మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద బీఆర్ఎస్ ధర్నా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



వరంగల్, జూలై 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రధాని మోదీ అంటే ఇక్కడి కేడీకి భయమని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఒకవైపు పాత కేసుల భయం, మరోవైపు అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసమే ఆయన కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మోదీ పేరును ప్రస్తావించడానికే సీఎం భయపడుతున్నారని ఆరోపించారు. సింగరేణిలో కుంభకోణాలపై తాము ఫిర్యాదులు చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడానికి కూడా ఇదే కారణమని పేర్కొన్నారు. హనుమకొండ పర్యటనలో ఉన్న కేటీఆర్ గురువారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా యువత మునుపెన్నడూ లేనంత ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. నీట్ అవకతవకలపై అందరికన్నా ముందు తామే స్పందించామని, సోనమ్ వాంగుచుక్‌కూ తామే మొదట సంఘీభావం ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. విద్యార్థుల పోరాటానికి అండగా ఉండేందుకు శుక్రవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం ఈ ముఖ్యమంత్రికి లేదని విమర్శించారు. నీట్ పరీక్షలో జరిగిన లోపాలకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యతని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థులు దేశవ్యాప్తంగా డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని మోదీ పేరును ప్రస్తావించలేదని పేర్కొన్నారు.

> పగలు కాంగ్రెస్‌తో ఉండి, రాత్రి బీజేపీతో అంటకాగడమే రేవంత్‌రెడ్డి రాజకీయమని ఢిల్లీలో అందరికీ తెలుసు. బీజేపీ నేతలతో వారి కార్యాలయాల్లోనే రహస్య సమావేశాలు నిర్వహించడం అందరికీ తెలిసిన విషయమే. కాంగ్రెస్, బీజేపీది రహస్య ఒప్పందం ఉన్నది. ఆ రహస్య అవగాహనతో పనిచేస్తున్నారు. కానీ, బీఆర్ఎస్‌కు అర్ధరాత్రి ఒప్పందాలు, రహస్య రాజకీయాలు లేవు.
>
> -కేటీఆర్

### రాహుల్ ఒక మూట.. మోదీకి రెండు మూటలు

రాహుల్‌గాంధీకి ఒక మూట పంపితే, మోదీకి రెండు మూటలు పంపుతూ సీఎం రేవంత్‌రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. తన పదవికి ప్రమాదం రాకుండా, అడ్డగోలు సంపాదనకు ఏ అడ్డంకి లేకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దాన్నే పరిపాలన అని రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జరుగుతున్న పరిణామాలు వాటినే రుజువు చేస్తున్నాయని స్పష్టంచేశారు.

### ఎన్‌డీఎస్‌ఏ వివరణతో అడ్డంగా దొరికిన కాంగ్రెస్

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చేస్తున్నది అసత్య ఆరోపణలు, అక్కసేనని తేలిపోయిందని కేటీఆర్ స్పష్టంచేశారు. గోదావరిలో నీళ్లుండీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవ్వడం లేదని, మేడిగడ్డ బరాజ్‌పై రేవంత్‌రెడ్డి అండ్ టీమ్ ఇంతకాలం చేస్తున్నవి కేవలం అసత్య ఆరోపణలేనని ఎన్‌డీఎస్‌ఏ వివరణతో తేలిపోయిందని కేటీఆర్ ఉదహరించారు. 'బరాజ్‌ల భద్రత, నిర్మాణ పటిష్టత వరకే మా పరిధి. కాళేశ్వరం ప్రాజెక్టు విస్తృత ప్రయోజనాల రీత్యా రైతులకు నీళ్లివ్వాలా? వద్దా? అనే విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే' అని ఎన్‌డీఎస్‌ఏ తేల్చిచెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ఉటంకించారు.

### ఎవరితోనూ పొత్తులుండవు

వచ్చే ఎన్నికల్లో తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని కేటీఆర్ స్పష్టంచేశారు. 2014, 2018 ఎన్నికల్లో తాము ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోలేదని, ఇప్పుడూ పెట్టుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశాలు ఉన్నాయని, అవి రాష్ట్ర విభజన బిల్లులో పేర్కొన్నట్టు ఉంటాయా? లేదా కేంద్ర ప్రభుత్వం యోచనతో డీలిమిటేషన్ విధానంలో ఉంటుందా? అనేది చూడాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ఏ రకంగా చూసినా నియోజకవర్గాలు పెరుగుతాయనేది ఖాయంగా తేలిపోయిందని చెప్పారు. వచ్చే సంవత్సరం తాను పాదయాత్ర చేస్తానని, ఎక్కడి నుంచి అనేది త్వరలో వెల్లడిస్తానని కేటీఆర్ పునరుద్ఘాటించారు. దసరా తర్వాత పార్టీ సంస్థాగత నిర్మాణం చేపడుతామని చెప్పారు.

> ప్రధాని మోదీ అంటే రేవంత్‌రెడ్డికి భయం. లేకుంటే కేంద్రం తీరుపై ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ నిరసన కార్యక్రమాల్లో కేరళ, కర్ణాటక సీఎంలు పాల్గొంటే, రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ఎందుకు నిరసన తెలిపారు? పీసీసీ అధ్యక్షుడు, ఇతర కాంగ్రెస్ నేతలు రాజ్‌భవన్ వద్ద ఆందోళన చేస్తే.. సీఎం ఎందుకు కొడంగల్‌కే పరిమితమయ్యారు.? రాజ్‌భవన్ ముందో? లేదంటే? ఢిల్లీలో ఎందుకు నిరసనలో పాల్గొనలేదు?
>
> -కేటీఆర్

### మేం చెప్పేదాకా ప్రభుత్వానికి సోయిలేదు

గోదావరిలో నీళ్లున్నాయనే విషయం తాము చెప్పేదాకా రాష్ట్ర ప్రభుత్వానికి సోయిలేదని కేటీఆర్ మండిపడ్డారు. తాము కన్నెపల్లి పంప్‌హౌస్‌కు (ఈ నెల 5న) వెళ్లి గోదావరిలో నీళ్లున్నాయని, రైతులకు నీళ్లిచ్చేందుకు ప్రభుత్వానికే మనసు రావడం లేదని అసలు బండారం బయటపెట్టిన తర్వాత ఆగమాగం అవుతున్నారని పేర్కొన్నారు. తాము బాధ్యతాయుత ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి కండ్లు తెరిపించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. గడిచిన రెండున్నరేండ్లుగా బీఆర్ఎస్ చేసిన పోరాటాలను వివరించారు. కాళేశ్వరం విషయంలోనే కాదు.. దేవాదుల విషయంలోనూ సర్కార్ వైఫల్యాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు బయటపెట్టిన విషయాన్ని ఆయన ఉదహరించారు. 'మాది తెలంగాణ తెచ్చిన జాతి.. నీలాగా గురువులకు భయపడేజాతి కాదు. తెలంగాణ కోసం సుదీర్ఘకాలం పోరాటాలు చేసిన ఫైటర్ల జాతి మాది. చీటర్ల జాతి నీది. అనేక బలిదానాలు, త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఉనికినే లేకుండా చంద్రబాబుతో జతకలిసిన జాతి నీది. మాది తెలంగాణ బాగుకోరే జాతి.. వచ్చిన తెలంగాణను ఉండకుండా చేసేందుకు జరిగిన ద్రోహంలో బ్యాగులు మోసిన జాతి నీది.. నీలాగా మాది గురువులకు భయపడే జాతి కాదు' అని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డ జై తెలంగాణ అంటే పులకించిపోతారని, దురదృష్టవశాత్తు రేవంత్‌రెడ్డి ఇంతవరకు జై తెలంగాణ అని ఎన్నడూ అనలేదని ఆయన గుర్తుచేశారు.

### సీఎం పదవి వారసత్వ హక్కు కాదు

ముఖ్యమంత్రి పదవి అనేది వారసత్వ హక్కు కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'ఈసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మీరు సీఎం అవుతారా?' అన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నకు కేటీఆర్‌పై విధంగా సమాధానమిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నాయకుడు, రాష్ట్ర సాధకుడైన కేసీఆర్ కుమారుడిగా, ఈ తెలంగాణ బిడ్డగా రాష్ట్ర సాధన పోరాటంలో మమేకం అయినందుకు గర్వపడుతున్నానని భావోద్వేగంతో చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యమకాలం నాటి అనుభవాలను నెమరేసుకొన్నారు. సగటు తెలంగాణ పౌరుడిగా తాను ఆశించిన దానికన్నా ఎక్కువే అయ్యానని, పదేండ్లు మంత్రిగా పనిచేశానని, తెలంగాణ తనకు సముచిత స్థానం, గౌరవాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. అంతిమంగా పదవులు ప్రజల అభీష్టం మేరకు వస్తాయని, ప్రజలు ఏది కోరుకుంటే అదే అవుతుందని తెలిపారు.

### చేవెళ్లలో త్వరలో దళిత సంగ్రామ సదస్సు

గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించిన చేవెళ్లలో త్వరలో తమ పార్టీ ఆధ్వర్యంలో దళిత సంగ్రామ సదస్సు నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వరంగల్‌లో రైతు సంగ్రామ సదస్సు, సరూర్‌నగర్‌లో యువసంగ్రామ సదస్సు నిర్వహించామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయించడమే ప్రతిపక్ష పార్టీగా తమ విధి అని స్పష్టం చేశారు. యువత, మహిళలు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామని చెప్పారు.

### బీఆర్ఎస్‌దే అధికారం.. కేసీఆరే సీఎం

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. అన్నివర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ధ్వజమెత్తారు. కష్టపడి సాధించుకొన్న తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో.. రేవంత్‌రెడ్డి వ్యవహారశైలితో ధ్వంసమైపోయిందనే అభిప్రాయానికి అన్నివర్గాల ప్రజలు వచ్చారని చెప్పారు. తమ తపన అధికారం కోసమో, పదవుల కోసమో కాదని కేసీఆర్ వంటి మహోన్నత నాయకుడి మార్గదర్శనంలోనే తాము పనిచేస్తామని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రాటుదేలిన సైనికులుగా తాము ప్రజల కోసం పనిచేస్తామని చెప్పారు. వ్యక్తికన్నా పార్టీయే ముఖ్యమని స్పష్టంచేశారు. మాజీ ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ఆరోపణలపై ఆయన స్పందిస్తూ 'వ్యక్తి కన్నా వ్యవస్థ ముఖ్యమని, కొడుకు, బిడ్డ, అల్లుడు.. ఎవరైనా సరే తాము కూర్చొన్న చెట్టుకొమ్మనే నరుక్కుంటారా?' అని ఆయన ప్రశ్నించారు. తాను పుట్టింది బీఆర్ఎస్‌లోనే, తను చావూ బీఆర్ఎస్‌తోనే అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పటికీ వందలసార్లు చెప్పినా వారిపై అనేక పార్టీలు మారిన రేవంత్‌రెడ్డి ఆరోపించడం సిగ్గుచేటు అని కేటీఆర్ దుయ్యబట్టారు.

> కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంగా దొరికిపోయింది. ఇంతకాలం ఎన్‌డీఎస్‌ఏ నివేదికను బూచిగా చూపిన ప్రభుత్వం.. ఎన్‌డీఎస్‌ఏ తాజా వివరణతో ఇప్పుడేం సమాధానం చెప్తుంది. మేడిగడ్డ బరాజ్ విషయంలో, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రేవంత్‌రెడ్డి అత్యంత దుర్మార్గంగా వ్యవహరించారని రాష్ట్ర రైతాంగానికి అర్థమైపోయింది.
>
> -కేటీఆర్

## లోకం పోకడ




కనీస వసతుల్లేవు.. పైగా ఫుడ్ పాయిజన్.. మా బడికి కూడా ఒక టూర్ వేయండి సార్!

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 34.0°c | 24.0°c |
| ఆదిలాబాద్ | 32.0°c | 21.2°c |
| మహబూబ్‌నగర్ | 32.0°c | 25.0°c |
| హైదరాబాద్ | 32.0°c | 23.0°c |
| నల్లగొండ | 31.5°c | 22.6°c |
| కరీంనగర్ | 31.0°c | 26.0°c |
| వరంగల్ | 31.0°c | 24.0°c |
| నిజామాబాద్ | 28.5°c | 22.1°c |
| మెదక్ | 27.8°c | 21.3°c |
| రంగారెడ్డి | 27.7°c | 20.7°c |

# ఆపదలో ఉన్నవారిని ఆదుకోండి

- నా బర్త్‌డే వేడుకలు నిర్వహించొద్దు
- పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు
- రాష్ట్రంలో రైతాంగం, ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి సంఘీభావంగా నిర్ణయం
- నేడు బీఆర్ఎస్వీ నిరసనకు హాజరు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతాంగం పడుతున్న ఇబ్బందులు, ఢిల్లీలో విద్యార్థులు, యువత చేస్తున్న పోరాటం నేపథ్యంలో తన బర్త్‌డే వేడుకలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు ఆయన తన బర్త్‌డే వేడుకలకు అనవసర ఖర్చు వద్దంటూ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వీలైతే ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని, సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన పోరాటానికి సంఘీభావంగా శుక్రవారం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొననున్నట్టు కేటీఆర్ వెల్లడించారు. తన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు కేక్ కటింగ్‌లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, పూల బొకేలు, పత్రికా ప్రకటనలు వంటి వాటిపై అనవసర ఖర్చు చేయొద్దని పార్టీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు ఆయన విజ్ఞప్తి చేశారు. దేశం, రాష్ట్రంలో నెలకొన్న గంభీరమైన పరిస్థితుల నేపథ్యంలో పుట్టినరోజు సందర్భంగా సాధారణంగా గడుపాలని కేటీఆర్ నిర్ణయించుకున్నారు.

# లైడిటెక్టర్ పరీక్షకు నేను రెడీ సీఎం సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి...



ఆ ఆరోపణలను రుజువు చేయాలి. లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవు' అని హెచ్చరించారు. హనుమకొండ పర్యటనకు గురువారం వచ్చిన కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'గ్లోబరీనా నిజంగానే నా బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుంది? ఇప్పుడు అది నా బినామీ సంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వం నడుపుతున్న ముఖ్యమంత్రికి కనీస సోయి లేదా?' అని ప్రశ్నించారు. సీసీఎస్‌లో ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారని, అందుకు తాము కూడా పూర్తిస్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. 'విచారణ జరిగితే వాస్తవాలన్నీ బయటకు వస్తాయి. అవసరమైతే నేను కూడా ఫిర్యాదు చేస్తాను. అదే సమయంలో సృజన్‌రెడ్డి వ్యవహారం, సింగరేణి కుంభకోణం వంటి అంశాలపై కూడా విచారణ జరుపడానికి ప్రభుత్వం సిద్ధమేనా? ఈ అంశంలో సిట్, సీఐడీ విచారణకు సిద్ధమా?' అని ప్రశ్నించారు. గ్లోబరీనా వ్యవహారంపై ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. 'ముఖ్యమంత్రి హోంమంత్రిగా నిజాయితీగా వ్యవహరించాలని కోరుతున్నాను. వెంటనే విచారణ ప్రారంభించండి. సీఐడీతో చేస్తారా, సీబీఐతో చేస్తారా, ఏ సంస్థతో చేయాలనుకున్నా చేయండి. పూర్తి సహకారం అందిస్తాను. వాస్తవాలు ప్రజల ముందుకు రావాలి' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో అవసరమైతే లైడిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమని ప్రకటించారు. 'నన్ను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కపక్కన కూర్చోబెట్టి, ప్రత్యక్ష ప్రసారంలో లైడిటెక్టర్ పరీక్ష నిర్వహించండి. గ్లోబరీనా సంస్థతో నాకు ఎలాంటి సంబంధం లేదు. అదే సమయంలో సింగరేణి, అమృత్ కాంట్రాక్టుల్లో జరిగిన ఆరోపణలపై కూడా ప్రజల ముందే నిజానిజాలు తేల్చుకుందాం. ఏది నిజమో ప్రజలే నిర్ణయిస్తారు' అని సవాల్ విసిరారు. 'ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వ్యక్తి నిరాధార ఆరోపణలు చేయడం వెనుక ఉన్న కారణాన్ని ప్రజలకు చెప్పాలి. మోదీ పేరును ప్రస్తావించడానికే ఎందుకు భయపడుతున్నారో కూడా సమాధానం చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### గ్లోబరీనాతో ఎలాంటి సంబంధంలేదు..

గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు ఎలాంటి ఆర్థిక సంబంధాలు, దానిపై యాజమాన్య హక్కులు లేవని కేటీఆర్ స్పష్టంచేశారు. గ్లోబరీనా తన బినామీ కంపెనీ అని, సీబీఎస్‌ఈ కాంట్రాక్టులు ఇప్పించానని అనడం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. ముఖ్యమంత్రి వంటి అత్యున్నతమైన రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా దిగజారి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ తన రాజకీయ ప్రయోజనాల కోసం దురుద్దేశపూర్వకంగా ఆరోపణలు చేశారని మండిపడ్డారు. తన ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. పలుమార్లు ఇదేవిధంగా అనుచితంగా మాట్లాడినా రాజకీయ విమర్శలుగా భావించి సహనం ప్రదర్శించానని పేర్కొన్నారు. కానీ రోజురోజుకూ శ్రుతి మించుతుండటంతో చట్టపరమైన చర్యలకు ఉపక్రమించానని స్పష్టంచేశారు.

### సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటా

తనపై, తన కుటుంబంపై ఎటువంటి ఆధారాల్లేకుండా ఆరోపణలు చేస్తూ తమ పరువుప్రతిష్ఠలకు భంగం కలిగిస్తున్నారని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ గురువారం లీగల్ నోటీసులు పంపించారు. రాజకీయంగా తన ప్రతిష్టను దెబ్బతీసేలా, ప్రజలకు తనపై ఉన్న నమ్మకం కోల్పోయేలా ఉన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా పరిగణించారు. బాధ్యాతాయుతమైన హోదాలో ఉన్న వ్యక్తి తనకు, గ్లోబరీనా టెక్నాలజీ కంపెనీకి సంబంధాన్ని అంటగడుతూ ఎలాంటి ఆధారాల్లేకుండా ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు. నోటీసు అందిన 48 గంటల్లోగా బేషరతుగా, బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గడువులోగా క్షమాపణ చెప్పకుంటే సివిల్, క్రిమినల్ చర్యలతోపాటు పరువునష్టం దావా దాఖలు చేస్తానని హెచ్చరించారు.

# ఇండియా రియాక్ట్స్.. బీఆర్ఎస్ కనెక్ట్స్

మొదటిపేజీ తరువాయి...

యువతకు అభిమాన నాయకుడిగా పేరొందిన కేటీఆర్ అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ విద్యార్థుల తరుపున ప్రత్యక్షంగా ఉద్యమించేందుకు తన పుట్టిన రోజును సరైన సమయంగా ఎంచుకున్నారు. విద్యార్థుల పోరాటంలో కలిసి నడిచే కార్యక్రమానికి బీఆర్ఎస్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నది.



### ప్రధాన పార్టీలు దూరం

దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన నీట్ పరీక్ష పత్రం లీక్ ఉదంతం దేశ వ్యాప్తంగా కలకలం సృష్టించింది. పరీక్షల నిర్వహణ సంస్థ నుంచే ఈ పేపర్ లీక్ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసనలతో కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేయాల్సి వచ్చింది. రాసిన పరీక్ష రద్దు రావడంతో దేశ వ్యాప్తంగా పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నీట్ పరీక్షను రెండోసారి నిర్వహించినప్పటికీ.. తమ వైఫల్యంతో లక్షల మంది విద్యార్థులకు ఆవేదన, ఆందోళన కలిగించిన కేంద్రంపై విద్యార్థి లోకం భగ్గుమన్నది. పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్లు దేశం నలుచెరుగులా వెల్లువెత్తాయి. రెండు నెలలుగా ఈ డిమాండ్లతో నిరసనలు జరుగుతున్నాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ కేంద్రంగా గత నెల 20 నుంచి విద్యార్థులు భారీ ఉద్యమం చేపట్టారు. దేశంలోనే అతి పెద్ద ఉద్యమంగా నిలుస్తున్న ఈ ఉదంతంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ విద్యార్థులకు దూరంగా ఉంటూ వచ్చాయి. చేసిన తప్పునకు బాధ్యత వహించాల్సిన బీజేపీ.. పోలీసు దాడులతో సమాధానం ఇచ్చింది. దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా చెప్పుకొంటున్న కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల గోడు అసలే పట్టించుకోలేదు.

### రాహుల్ కోసమే కాంగ్రెస్ పోరు

ఢిల్లీలో పోరాడుతున్న విద్యార్థులకు మద్దతుగా కోట్లాదిమంది ప్రజలు ముఖ్యంగా జెన్‌జీలు అండగా నిలుస్తున్నారు. దేశంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ముందుండి పోరాడాల్సిన కాంగ్రెస్ పార్టీ తొలుత పట్టించుకోలేదు. విద్యార్థుల పోరాటం తీవ్రమై నెత్తురు చిమ్మడంతో రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రం ఆరాటపడింది. ఉద్యమం చేస్తున్న విద్యార్థులను కలవకుండా, వారికి అండగా నిలిచి మనోధైర్యం కల్పించకుండా... తనకు అలవాటైన ఓట్ల రాజకీయం కోసం ప్రయత్నించింది. కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ జంతర్ మంతర్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థులను కాదని ప్రధానమంత్రి నివాసం ముందు ధర్నాకు ప్రయత్నించారు. ముందుగా ఒప్పందం జరిగిందా? అన్నట్టు విద్యార్థుల ఉద్యమాన్ని కాకుండా... రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ నిరసన ముఖ్యమైనది అన్నట్లుగా బీజేపీ ప్రభుత్వం కూడా వ్యవహరించింది. హడావుడి చేసి వారిని అరెస్టు చేసి విద్యార్థుల ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీకి అప్పగించినట్టు బీజేపీ నడుచుకొంది. విద్యార్థుల కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా అటు అధికారంలోని బీజేపీ, ప్రతిపక్షంలోని కాంగ్రెస్ కలిసి ఆడిన ఈ నాటకంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇక రాహుల్ అరెస్టుకు కొనసాగింపుగా కాంగ్రెస్ దేశవ్యాప్తంగా సొంత కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల ఉద్యమంతో, వారి డిమాండ్లతో సంబంధం లేకుండా... రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ అరెస్టును మాత్రమే నిరసిస్తూ అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ధర్నాలు చేపట్టింది. తెలంగాణలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ అరెస్టుపైనే నిరసన వ్యక్తం చేశారు తప్ప ఎక్కడా విద్యార్థుల డిమాండ్లనుగానీ, వారిపై బీజేపీ ప్రభుత్వ దమనకాండను గానీ ప్రస్తావించలేదు.

### మొదట నుంచీ యువతవెంటే బీఆర్ఎస్

మొదట నుంచీ యువతకు బీఆర్ఎస్ అండగా నిలుస్తున్నది. హెచ్‌సీయూ విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా నిలిచి విలువైన వర్సిటీ భూములను కాపాడింది. పోలీస్ ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్నవారికి అండగా నిలిచింది. న్యాయస్థానంలోనూ, బయటా నిరుద్యోగుల సాగించిన పోరాటానికి వెన్నుదన్నుగా నిలబడ్డది బీఆర్ఎస్సే. విషాహారంతో గురుకుల మరణాల ఘటనలపైనా పోరాటం చేస్తున్నది బీఆర్ఎస్సే. మొన్నటికిమొన్న సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు నిర్వహించి యువతకు భరోసా నిచ్చింది బీఆర్ఎస్సే!

> **జెన్‌జీని విస్మరిస్తే ఉద్యమాలే!**
>
> యువత ఆకాంక్షలను ప్రభుత్వాలు పట్టించుకోవాలి. జెన్‌జీని విస్మరిస్తే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వస్తాయ్. నేపాల్, శ్రీలంక తరహాలో ఇండియాలోనూ జెన్‌జీ ఉద్యమాలు రాబోవని చెప్పలేం. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్ చుట్టూనే తిరుగుతున్నాయ్.
>
> - ఎన్డీటీవీ యువ కాంక్లేవ్‌లో మాజీమంత్రి కేటీఆర్ (20.09.2025)

### ఉద్యమమే బీఆర్ఎస్ ఊపిరి

బీఆర్ఎస్ తెలంగాణ ఆకాంక్ష సాధన కోసమే పుట్టింది. విద్యార్థుల ఉద్యమాలతో కలిసినడిచింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అగ్రభాగాన నడిచింది. ఆవిర్భావం నుంచి అన్ని రకాల సహేతుకమైన ఉద్యమాలలో ఎప్పటికప్పుడు భాగస్వామి అవుతున్నది. 13 ఏండ్లు ఉద్యమ పార్టీగా విద్యార్థుల ఆకాంక్షల కోసం పోరాటం చేసింది. అధికార పార్టీగా విద్యార్థులు, యువత ప్రయోజనాల కోసం పరిపాలన సాగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి విద్య, ఉద్యోగాలలో యువతకు చేస్తున్న అన్యాయంపై బీఆర్ఎస్ నిరంతరం విద్యార్థులతో కలిసి పోరాడుతున్నది. రాష్ట్రంలోని విద్యార్థులు, యువత తమ ఆలోచనలు, ఆవేదనలను పంచుకునే ఏకైక పార్టీగా బీఆర్ఎస్ ఉంటున్నది. ఇదే స్ఫూర్తితో విద్యార్థుల ఉద్యమంలో కూడా ఇప్పుడు ప్రత్యక్షంగా భాగస్వామి అవుతున్నారు. దక్షిణాది నుంచి ప్రత్యక్ష కార్యాచరణ తీసుకున్న ఒకే ఒక్క పార్టీ బీఆర్ఎస్సే!

### దాడితో రాజకీయం

ఈ దశలో పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో విద్యార్థులు ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేశారు. అయితే, బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల నిరసనను సహించలేకపోయింది. ఈ క్రమంలో విద్యార్థులపై దమనకాండకు తెగబడింది. పోలీసులతో ఇష్టారాజ్యంగా విద్యార్థులపై దాడులు చేయించింది. విద్యార్థులపై పోలీసుల లాఠీలు విరిగాయి. భాష్పవాయు గోళాలు విరుచుకుపడ్డాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ప్రతిరోజూ ఇష్టం వచ్చినట్టుగా విద్యార్థులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ, విద్యార్థులపై జరుగుతున్న ఈ అణచివేతను ప్రధాన రాజకీయ పార్టీలు రాజకీయంగా వాడుకుంటున్నాయి తప్ప పట్టించుకోలేదు. ఈ దశలో బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే ముందుకు వచ్చింది. విద్యార్థుల ఉద్యమానికి కలిసి నడువాలని సంచలన నిర్ణయం తీసుకున్నది. ఇంతవరకు ఢిల్లీలోనే ఉంటున్న ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ నాయకురాలు సుప్రియాసూలే విద్యార్థులను కలిసి మద్దతు తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఢిల్లీ విద్యార్థుల ఉద్యమానికి మీడియా ద్వారా సంఘీభావం తెలిపారు. ఇతర ఏ రాజకీయ పార్టీలు విద్యార్థులతో భుజం కలుపలేదు. విద్యార్థుల పోరాటంలో ప్రత్యక్షంగా భాగస్వామి అవుతూ ఉద్యమిస్తున్న ఏకైక పార్టీగా బీఆర్ఎస్ మాత్రమే నిలిచింది.

# రాష్ట్రంలో బ్రేక్ మాన్‌సూన్!

- 25 తర్వాతే భారీ వర్షాలు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): రుతుపవన ద్రోణి సముద్ర మట్టం నుంచి జైసల్మేర్, కోట, గుణ, దామోహ్, డాల్టన్‌గంజ్, కాంటాయ్ మీదుగా ఆగ్నేయ దిశగా ఈశాన్య బంగాళాఖాతం వైపు కొనసాగుతున్నదని, ఇది సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తువరకు విస్తరించి, ఎత్తుకు వెళ్లేకొద్దీ దక్షిణ దిశగా వంగి ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే రెండు మూడు రోజుల పాటు రాష్ట్రంలో బ్రేక్ మాన్‌సూన్ పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ నిపుణులు తెలంగాణ వెదర్‌మ్యాన్ వెల్లడించారు. ఈ విరామ సమయంలో వాతావరణం పూర్తిగా పొడిగా మారదని, హైదరాబాద్ నగరం సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు. ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30–40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నదని చెప్పారు. జూలై 25 లేదా 26వ తేదీ తర్వాత రాష్ట్రంలో వర్షాల తీవ్రత మళ్లీ పెరిగే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. జూన్ 1 నుంచి జూలై 22 వరకు లెక్కలను పరిశీలిస్తే.. రాష్ట్ర సగటు వర్షపాతం సాధారణం కంటే –25 శాతం తక్కువగా నమోదైంది. జిల్లాలవారీగా చూసినట్టయితే అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 60 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. బుధవారం రాత్రి ఈ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు రాబోయే రోజుల్లో పడే వానల వల్ల ఈ లోటు కొంతవరకు తగ్గుతుందని వాతావరణ శాఖ భావిస్తున్నది.

# ఎన్‌హెచ్‌ఎంలో క్యాడర్ ఫిక్సేషన్ చేయాలి

### వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం డిమాండ్

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద పనిచేస్తున్న అందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేయాలని తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం(హెచ్1 ఐఎన్టీయూసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, కార్యదర్శి ఎన్ సందీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. నిరుడు జూలైలో రాష్ట్ర ప్రభుత్వం జీవో 1195 విడుదల చేసిందని, అయితే ఆ జీవోను అమలు చేయకుండా శ్రమ దోపిడీ చేస్తున్నదని మండిపడ్డారు.



ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు ప్రభాకర్, మాణిక్‌రావు

# జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ రావాలి

- హైదరాబాద్-ముంబై లైన్‌లో చేర్చాలి
- జహీరాబాద్ స్టేషన్‌లో రైలు ఆపాలి
- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు బీఆర్‌ఎస్ ఎంపీ, ఎమ్మెల్యేల విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ): ప్రతిపాదిత హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు(బుల్లెట్ ట్రైన్) మార్గంలో జహీరాబాద్ స్టేషన్‌ను చేర్చడంతోపాటు, బుల్లెట్ ట్రైన్ స్టాప్ మంజూరు చేయాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను బీఆర్‌ఎస్ పార్టీ కోరింది. పార్లమెంట్ ప్రాంగణంలోని మంత్రి చాంబర్‌లో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కే మాణిక్‌రావు, మెదక్ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎం శివకుమార్ గురువారం రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వద్దిరాజు రవిచంద్ర మీడియాతో మాట్లాడారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రాంతాల్లో జహీరాబాద్ ఒకటిగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ ప్రాంతంలో 12,656 ఎకరాల విస్తీర్ణంలో నిమ్జ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలుపగా, ఇప్పటికే 8వేల ఎకరాల భూసేకరణ పూర్తయిందని వివరించారు. ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ, డ్రైపోర్ట్, హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ వంటి మహత్తర ప్రాజెక్టులు జహీరాబాద్‌లో రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. ఇక్కడ మహీంద్రా, హ్యుందాయ్ మోటార్స్, అల్లానా, పిరమల్ వంటి ప్రముఖ సంస్థల పరిశ్రమలు నడుస్తున్నాయని తెలిపారు.

### రైతుల త్యాగాలకు గుర్తింపు

జాతీయ ప్రయోజనాల కోసం ఈ ప్రాంతంలోని వేలాది మంది రైతులు తమ వ్యవసాయ భూములను స్వచ్ఛందంగా త్యాగం చేశారని, వారి త్యాగానికి ప్రతిఫలంగా ప్రపంచస్థాయి రవాణా సదుపాయాలు కల్పించాలని రైల్వేమంత్రిని కోరామని వద్దిరాజు రవిచంద్ర, జహీరాబాద్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కే మాణిక్ రావు, ఎం శివకుమార్ తెలిపారు. జహీరాబాద్‌లో హైస్పీడ్ రైల్ స్టాప్ ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణతో పాటు కర్ణాటకలోని బీదర్, హుమ్నాబాద్, మహారాష్ట్రలోని ఉద్గీర్, లాతూర్ సరిహద్దు జిల్లాల ప్రజలకు, ఇతర పారిశ్రామిక వర్గాలకు సులభతర ప్రయాణ సౌకర్యం కల్గుతుందని పేర్కొన్నారు. ఈ పారిశ్రామిక ప్రాజెక్టుల ద్వారా భవిష్యత్తులో మూడు లక్షలకుపైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని, ముంబైతో బలమైన లాజిస్టిక్స్ అనుసంధానం ఏర్పడుతుందని వివరించారు.

## పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు అందుబాటులో ఉండేలా చూడాలి


**పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో బీఆర్‌ఎస్ నేత వద్దిరాజు**

హైదరాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ): క్రూడాయిల్, పెట్రోలియం, సహజవాయువు ఉత్పత్తులు, వాటి ధరలు వినియోగదారులకు మరింత అందుబాటులో ఉండేలా కేంద్రప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం గురువారం ఢిల్లీలో చైర్మన్ తట్కారే సునీల్ దత్తాత్రే అధ్యక్షతన సమావేశమైంది. సమావేశానికి ఎంపీ రవిచంద్ర హాజరై కీలక సూచనలు చేశారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, సంబంధిత ఉత్పత్తుల సరఫరాలో అంతరాయం కలుగకుండా చూసేందుకు పటిష్టమైన చర్యలు ఉండాలని వద్దిరాజు అన్నారు. వీటి ధరలు తరచూ పెరుగడం వల్ల నిత్యావసరాల ధరలపై ప్రభావం పడుతున్నదని, సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితి తలెత్తుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.




బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని గురువారం తెలంగాణ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌టీయూ నాయకులు. చిత్రంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య, నాయకులు నారాయణ తదితరులున్నారు.

# అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు




కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా మెల్‌బోర్న్‌లో వంద కార్లతో ర్యాలీ తీసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన బీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా బృందం

## అట్లాంటాలో వేడుకకు మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, డెన్మార్క్ తదితర దేశాల్లో ఘనంగా నిర్వహించారు. అమెరికాలోని అట్లాంటాలో యూఎస్ టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఈ మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మెల్‌బోర్న్ నగరంలో నిర్వహించిన భారీ కార్ల ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా తరపున 50 మంది పేద విద్యార్థుల ఏడాది విద్యా ఖర్చులను భరించనున్నట్టు కాసర్ల నాగేందర్ రెడ్డి ప్రకటించారు. ఎన్నారై బీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా ఆధ్వర్యంలో అనిల్ బైరెడ్డి నాయకత్వంలో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మెల్‌బోర్న్‌లో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేటీఆర్ జన్మదిన వేడుకలను డెన్మార్క్‌లో ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీ శ్యామ్ బాబు ఆకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ శ్రేణులు, తెలంగాణ ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యూకే వ్యాప్తంగా ఎన్నారై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.'గిఫ్ట్ ఏ స్మైల్' లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఎన్నారై బీఆర్‌ఎస్ లెస్టర్ ఇన్‌చార్జి సాకేత్‌రావు కాచవరపు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎన్నారై బీఆర్‌ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్ బర్త్‌డే వేడుకలను బీఆర్‌ఎస్ ఎన్నారై సౌత్ ఆఫ్రికా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకుడు నాగరాజు గుర్రాల ఆధ్వర్యంలో గౌటెంగ్ (జోహన్నెస్‌బర్గ్), వెస్టర్న్‌కేప్ (కేప్‌టౌన్), క్వాజులు-నటాల్ (పియెటర్ మారిట్జ్ బర్గ్) రాష్ట్రాల్లో ఒకే రోజు, ఒకే సమయంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నాయిని అనురాగ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన 'గిఫ్ట్ ఏ స్మైల్-బియాండ్ బౌండరీస్' సేవా కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల్లో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మరోవైపు కేటీఆర్‌కు మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, తెలంగాణ పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు విద్యాసంస్థల బంద్

**లెఫ్ట్ విద్యార్థి సంఘాల పిలుపు.. పరీక్షలు వాయిదా వేసిన వర్సిటీలు**

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై నిరంకుశదాడికి నిరసనగా, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఆత్మహత్య చేసుకున్న 21మంది విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలనే డిమాండ్‌తో లెఫ్ట్ విద్యార్థి సంఘాలు శుక్రవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐపీఎస్‌యూ, ఏఐఎస్‌బీల ఆధ్వర్యంలో జరిగే బంద్‌లో భాగంగా ఉదయం 11గంటలకు నారాయణగూడ చౌరస్తా నుంచి వై జంక్షన్ వరకు ర్యాలీ ఉంటుందని విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. బంద్ నేపథ్యంలో పీజీ సెమిస్టర్ పరీక్షలను ఓయూ, మహాత్మాగాంధీ, శాతవాహన, టీయూ, జేఎన్టీయూ, కాళోజీ యూనివర్సిటీల్లో పరీక్షలను వాయిదా వేశారు.



# ఇందిరమ్మ ఇల్లుకు ఆరు లక్షలు ఎందుకు?

- పేదవాళ్లకు ఉచితంగా నిర్మించి ఇవ్వాల్సిందే
- లక్ష డబుల్ బెడ్రూమ్‌లు నిర్మించిన ఘనత కేసీఆర్‌దే
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్




మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని. చిత్రంలో వివేకానంద, దాసోజు, శంభీపూర్ రాజు, సురభి వాణీదేవి, తదితరులు

హైదరాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ): అధికారంలోకి రాగానే పేదలందరికీ ఉచితంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ లీడర్ తలసాని శ్రీనివాస్‌యాదవ్ మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్మించనున్న సింగిల్ బెడ్రూమ్ ఇండ్లకు లబ్ధిదారుల నుంచి రూ.6లక్షలు వసూలు చేస్తున్నదని ఆరోపించారు. లబ్ధిదారుల నుంచి పైసలు వసూలు చేస్తే బీఆర్‌ఎస్ ఊరుకోబోదని హెచ్చరించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, సురభి వాణీదేవి, దాసోజు శ్రవణ్‌కుమార్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్‌తో కలిసి గురువారం మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో గ్రేటర్ హైదరాబాద్‌లో అత్యంత విలువైన స్థలాల్లో లక్ష డబుల్ బెడ్రూమ్ ఇండ్లు నిర్మించారని గుర్తుచేశారు. సెక్రటేరియట్ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ నిరుపేదలకు ఇండ్లు కట్టించి ఇచ్చారని స్పష్టంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినా జీహెచ్‌ఎంసీలో ఒక్క ఇల్లు కూడా కట్టకుండానే హడావుడి చేస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇందిరాగాంధీ గరీబీ హఠావో నినాదాలకే పరిమితమైందని తలసాని దెప్పిపొడిచారు. ఇందిరమ్మ స్కీమ్ ద్వారా ప్రభుత్వం రూ. 5లక్షలు వెచ్చిస్తే, రూ.6లక్షలు లబ్ధిదారులు భరించాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

### సీఎంకు ప్యాలెస్.. పేదలకు మొండిచేయి


సకల హంగులతో ప్యాలెస్‌లు కట్టుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి.. పేదవాళ్లకు ఇండ్లు ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతున్నారని తలసాని విరుచుకుపడ్డారు. రేవంత్ సర్కార్ కేసీఆర్‌పై కక్షతో 39వేల డబుల్ బెడ్రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా డబుల్ బెడ్రూమ్ ఇండ్లను అర్హులకు అందజేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే మరో లక్ష ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఉన్నసిటీని గాలికొదిలి ఫోర్త్‌సిటీ అంటూ ఊదరగొట్టడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

### అసెంబ్లీ సిబ్బంది తీరుపై ఆగ్రహం

ప్రెస్‌మీట్ పెట్టేందుకు అనుమతిలేదని నిరాకరించిన అసెంబ్లీ సిబ్బందిపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొద్దిసేపు మీడియా పాయింట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. సీఎం వస్తున్నారనే కారణంతో అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేశారు. ఇది ఎమ్మెల్యేల ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమేనని, ఇలాంటి సంప్రదాయాన్ని ఏనాడూ చూడలేదని మండిపడ్డారు. ఒక్కరోజు ముందే స్పీకర్ నుంచి అనుమతి తీసుకున్నామని పేర్కొన్నారు. కొద్దిసేపటికి అనుమతించడంతో నిరసన విరమించారు.

## అడ్మినిస్ట్రేషన్‌పై రేవంత్‌కు పట్టులేదు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ



హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): 'సర్' ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడూ శ్రద్ధ పెట్టలేదని, కనీస సమీక్షలు నిర్వహించలేదని, ఆయనకు అడ్మినిస్ట్రేషన్‌పై పట్టులేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ ఎద్దేవా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సర్'పై సీఎం ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో డబుల్ ఓట్లు ఒక్కటీ ఉండకూడదనేది బీఆర్‌ఎస్ ఉద్దేశమని స్పష్టంచేశారు. బీఎల్‌వోలను ఉద్దేశించి సీఎం బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కొడంగల్‌లో 60వేల అనుమానాస్పద ఓట్లను ఈసీ గుర్తించిందంటే ఏస్థాయిలో అక్రమాలు జరిగాయో అర్థమవుతున్నదని పేర్కొన్నారు. సమావేశంలో సుమిత్రానంద్, బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకులు ముజీబుద్దీన్ పాల్గొన్నారు.

# మక్కల కొనుగోళ్లపై విచారణ షురూ

- బాదేపల్లి పీఏసీఎస్‌లో అధికారుల తనిఖీలు




బాదేపల్లి పీఏసీఎస్‌లో విచారణ జరుపుతున్న అధికారులు

మహబూబ్‌నగర్, జూలై 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బాదేపల్లి పీఏసీఎస్‌లో గత యాసంగిలో జరిగిన మక్కజొన్న కొనుగోళ్ల అవకతవకలపై అధికారులు విచారణ ప్రారంభించారు. 'నమస్తే తెలంగాణ'లో వస్తున్న వరుస కథనాలకు ఉన్నతాధికారులు స్పందించి గురువారం బాదేపల్లి పీఏసీఎస్‌లో విచారణ జరిపారు. రైతులు పండించిన పంటను పీఏసీసీఎస్ చైర్మన్ తన గోదాముకు తరలించి భారీ ఎత్తున రైతులకు టోపీ పెట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. రైతులు ఆందోళనకు దిగినా అధికారులు స్పందించలేదు. దీంతో 'నమస్తే తెలంగాణ'లో 'మక్కలు బుక్కిన కాంగ్రెస్ నేత' అనే శీర్షిక వచ్చిన కథనం సంచలనం సృష్టించింది. కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. జిల్లా సహకార సంఘం అధికారి కృష్ణ, సివిల్ సరఫరా అధికారి గణప శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డీఎం తహ్మీనాతో పాటు హార్టికల్చర్‌శాఖ ఆఫీసర్లు గురువారం కార్యాలయానికి వచ్చి మధ్యాహ్నం వరకు విచారణ జరిపారు. కాగా విచారణ సమయంలో పీఏసీఎస్ చైర్మన్ అక్కడే ఉండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కాగా బాదేపల్లి పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరుపాలని ఏకంగా సీఈవో యాదగిరి జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం గమనార్హం. గోదాములకు తరలించాల్సిన బస్తాలను నిబంధనలకు విరుద్ధంగా చైర్మన్ తన సొంత గోదాముకు 53,976 బస్తాలను తీసుకువెళ్లారని తెలిపారు. తీరా 53,119 బస్తాలు మాత్రమే రావడంతో 857బస్తాలు పక్కదారి పట్టినట్టు సీఈవో తన ఫిర్యాదులో ఆరోపించారు.

### మార్క్‌ఫెడ్ డీఎం సస్పెన్షన్

మక్కజొన్న కొనుగోళ్లలో బాదేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌కు సహకరించిన మహబూబ్‌నగర్ మార్క్‌ఫెడ్ డీఎం తహ్మీనాను గురువారం సాయంత్రం అధికారులు సస్పెండ్ చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మక్కజొన్నల్లో అవకతవకలకు పాల్పడినట్టు రుజువు కావడంతో ఆ శాఖ ఎండీ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేశారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

# ఎత్తిపోతలపై ఎన్నెన్ని కుట్రలు!

**కాళేశ్వరం** తెలంగాణకు జల ప్రాణేశ్వరం. కానీ దాని మీద కేసీఆర్ సంతకం ఉన్నది. కనుక ప్రాజెక్టును పండబెట్టాలి. తెలంగాణ పొలాలను ఎండబెట్టాలి. మన నీళ్లు పొరుగుకు పారాలి. మన పొలాలు బీడుగా మారాలి. అటు బడేభాయ్‌ని ఖుషీ చేయాలి. ఇటు గురువుకు దక్షిణ చెల్లించుకోవాలి. ఇదీ కూలేశ్వరుల వారి కుట్ర. ఇప్పుడా కుట్ర బట్టబయలైంది. నీళ్లు ఎత్తి పోయాలని అడిగితే ఎన్నెన్ని కహానీలు చెప్పారు? అన్ని అబద్ధాలూ అయిపోయిన తర్వాత, నెపం జాతీయ ఆనకట్ట భద్రతా ప్రాధికార సంస్థ (ఎన్డీఎస్‌ఏ) మీదికి నెట్టారు. మొన్నటికిమొన్న కాంగ్రెస్ సర్కార్ ఏం చెప్పింది? ఎన్డీఎస్‌ఏ వద్దన్నది కనుక నీళ్లు ఎత్తిపోయడం లేదని నంగనాచి కబుర్లతో ప్రజలను మోసం చేసింది. ఇప్పుడు కాళేశ్వరుని సాక్షిగా బండారం బద్దలైంది. కుట్రలు కుప్పకూలాయి. ఇన్నాళ్లూ ఎన్డీఎస్‌ఏ నివేదిక ముసుగులో ఆడిన నాటకాల ముసుగు తొలగిపోయింది. నీళ్లు ఎత్తిపోయడం నిర్ణయం రాష్ట్ర సర్కార్‌దేనని ఎన్డీఎస్‌ఏ తేల్చిచెప్పింది. కరువులో ఆ పని భేషుగ్గా చేసుకోవచ్చని స్పష్టంచేసింది. అంటే 'రైతులకు నీళ్లు ఇవ్వాలంటే బరాజ్‌లు నింపుకోనూ వచ్చు, ఎత్తిపోసుకోనూవచ్చు' దీనిపై అంతిమ నిర్ణయం సర్కార్‌దే అని దీని సారాంశం. 'నిద్రపోయే వాళ్లను మేల్కొల్పవచ్చు కానీ, నటించేవాళ్లను మేల్కొల్పలేము' కదా! నీళ్లను ఎత్తిపోసే ఉద్దేశం లేని కాంగ్రెస్ పాలకులు అడ్డగోలు కహానీలు వినిపించారు.

అసలు కాళేశ్వరం ఆలోచన పుట్టిందే కరువును తరిమికొట్టేందుకు. గడ్డురోజుల్లో ఆదుకునే వరదాయిని ఈ కాళేశ్వరం. ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో వర్షాభావంతో ఇపుడు గడ్డు పరిస్థితులు తలెత్తాయి. నీళ్ల తడి లేక పొలాలు ఎండిపోతున్నాయి. మంచినీటికి కటకట మొదలైంది. ఈ కష్టాలన్నిటికీ పరిష్కారం కాళేశ్వరమేనని ఎంత మొత్తుకున్నా కాంగ్రెస్ సర్కార్ వినలేదు. శ్రీరాంసాగర్ తదితర ఎగువ ప్రాజెక్టుల వద్ద నీటి జాడలేదు. దిగువ గోదావరిలో మేడిగడ్డ, సమ్మక్క బరాజ్‌లలో తప్ప మరెక్కడా ప్రవాహాలు లేవు. గేట్లు ఎత్తకుండానే కనీసం వరద నీటిని ఎత్తిపోసేందుకైనా కన్నెపల్లి పంపులు ఆన్‌చేయాలని రైతులు కోరినా, బీఆర్‌ఎస్ పోరినా పాలక ప్రభుత్వం కదల్లేదు. పంపులకు పని చెప్పలేదు. దాంతో గోదావరి జలాలు దిగువకు సముద్రంలోకి, కాదు కాదు ఏపీలోకి పారుతున్నాయి. ఆ నీటిని ఒడిసిపట్టి ఏపీ సర్కార్ గోదావరి, కృష్ణా డెల్టాలకు మళ్లిస్తున్నది. ఆ ధీమాతో అక్కడి రైతులు నాట్లు వేస్తున్నారు. మరి మన రైతులు చేసిన పాపమేంది? తెలంగాణ సోయిలేని, సాగుమీద ధ్యాసలేని కాంగ్రెస్ సర్కార్‌ను ఎన్నుకోవడమేనా?

కాళేశ్వరంపై నేతలు పేలిన అవాకులూ, చవాకులూ ఇన్నీఅన్నీ కావు. తామే కావాలని పడావు పెట్టిన ప్రాజెక్టు నుంచి నీళ్లెత్తితే అది తెలంగాణ లైఫ్‌లైన్ అని చాటిచెప్పినట్టు అవుతుంది. ఆ కీర్తి అంతా కేసీఆర్ ఖాతాలోకే వెళ్తుంది. అందుకే రాజకీయ కక్కుర్తితో ప్రజాప్రయోజనాన్ని బలిపెట్టారు. నీటిహక్కులకు సమాధి కట్టేందుకు సిద్ధమయ్యారు. ఇన్నాళ్లూ పడావు పెట్టి ఇప్పుడు ఉన్నపళంగా నీళ్లిస్తే తాము ప్రచారం చేసిన అబద్ధాలకు తామే లెంపలు వేసుకున్నట్టు అవుతుందని నీళ్లు ఎత్తలేదు. ఇప్పుడు రాష్ట్రం వేగంగా దుర్భిక్షం వైపు అడుగులు వేస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి తీరు చూస్తుంటే నవ్వాలో ఏడవాలో తెలియని పరిస్థితి. విపక్ష బీఆర్‌ఎస్‌పై, విశేషించి కేసీఆర్‌పై అక్కసుతో ప్రజలను బలిపెట్టే తిక్కరాజకీయాలకు పాల్పడుతున్నారు. కాళేశ్వరం పేరెత్తితేనే తిట్ల దండకంలో తారస్థాయిని అందుకుంటున్నారు. కాళేశ్వరం నీళ్లు కావాలని అడిగితే బీఆర్‌ఎస్ నేతల రక్తాన్ని పొలాల్లో చల్లుకోవాలనేదాకా ఈ అడ్డూఅదుపు లేని ఉన్మాద ధోరణి పోయింది. సమయం మించిపోతున్నది. టీఎంసీలకొద్దీ నీరు దిగువకు పరుగులు తీస్తున్నది. ఇప్పటికైనా సీఎం తన తీరుమార్చుకుని కాళేశ్వరం పంపులను నడిపించడంపై దృష్టి పెట్టాలి. లేకపోతే ప్రజలే తిరగబడి పంపులను నడిపించి నీళ్లు ఎత్తిపోసుకుంటరు.

# యువత ఆశలకు వెలుగు కేటీఆర్

ప్రతి తరమూ తన కాలాన్ని నిర్వచించే కొంతమంది వ్యక్తులను చూస్తుంది. వారు కేవలం పదవుల్లో ఉన్న నాయకులు మాత్రమే కాదు, ఒక ఆలోచనకు రూపం ఇచ్చినవారు, ఒక సమాజం కలలకు దిశ చూపినవారు, భవిష్యత్తును నిర్మించేందుకు కృషి చేసినవారు. అలాంటి నాయకత్వం రాజకీయాల పరిమితులను దాటి, యువత మనసుల్లో ఒక స్ఫూర్తిగా నిలుస్తుంది. తెలంగాణలో అలాంటి నాయకత్వానికి ప్రతీకగా నిలిచే పేరు కల్వకుంట్ల తారకరామారావు. నేటి రాజకీయాల్లో ఆధునికత, సాంకేతికత, పరిపాలనా సామర్థ్యం, మానవతా విలువలు కలగలిపిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయం అంటే ఎన్నికలు గెలువడం, సభల్లో ప్రసంగించడం మాత్రమే కాదని, ప్రపంచంతో పోటీపడే నగరాలను నిర్మించడం, యువతకు అవకాశాలు కల్పించడం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విధానాలు రూపొందించడం అని గత ప్రభుత్వంలో మంత్రిగా తన పనితీరుతో నిరూపించారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



మహేందర్ తోటకురి




తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలంటే సంప్రదాయ అభివృద్ధి సరిపోదని, నాలుగో పారిశ్రామిక విప్లవానికి అనుగుణంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఆ ఆలోచనలకు ప్రతిరూపంగా నెలకొల్పిందే ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్లలో ఒకటైన టీ-హబ్. వేలాది మంది యువ పారిశ్రామికవేత్తలకు ఇది ఒక ప్రయోగశాలగా, కలల వేదికగా మారింది. గ్రామీణ, పట్టణ, పేద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా ఎవరైనా తమ ఆలోచనను ప్రపంచ స్థాయి వ్యాపారంగా మార్చుకొనే అవకాశాన్ని టీ-హబ్ కల్పిస్తున్నది. ప్రపంచ స్థాయి మెంటార్లు, పెట్టుబడిదారులు, పరిశ్రమలతో అనుసంధానం, అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశించే అవకాశాలను కూడా ఈ వేదిక అందిస్తున్నది. కేటీఆర్ మరో ఆలోచన టీ-వర్క్స్. టీ-వర్క్స్ ద్వారా హార్డ్‌వేర్ ఇన్నోవేషన్‌కు కొత్త దిశ చూపించారు. ఒక ఆలోచనను కాగితం మీద నుంచి ఉత్పత్తిగా మార్చడానికి అవసరమైన యంత్రాలు, ప్రయోగశాలలు, ప్రోటోటైపింగ్ సదుపాయాలు అందుబాటులోకి రావడం వల్ల అనేక మంది ఇంజినీర్లు, మేకర్లు, పరిశోధకులు తమ కలలను ఆచరణలోకి తీసుకురాగలిగారు. హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ రంగంలో మరింత బలంగా నిలబెట్టడంలో కేటీఆర్ పాత్ర విశేషమైనది.

ప్రపంచ ప్రఖ్యాత సంస్థలను తెలంగాణకు తీసుకురావడానికి ఆయన నిరంతరం కృషి చేశారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సమావేశాలు, విదేశీ పర్యటనలు, పరిశ్రమలకు అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ ద్వారా పెట్టుబడులకు హైదరాబాద్ ఆకర్షణీయమైన నగరంగా మారింది. లక్షలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. తెలంగాణలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వడం కేటీఆర్ పరిపాలనా దూరదృష్టికి నిదర్శనం.

ఫార్ములా—ఈ రేస్ వంటి అంతర్జాతీయ కార్యక్రమాలు కేవలం వినోదం కోసం కాదు, ప్రపంచ దృష్టిని తెలంగాణ వైపు మళ్లించేందుకు, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు, నగరాన్ని గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టేందుకు ఉపయోగపడే వేదికలుగా ఆయన భావించారు. రాజకీయాల్లో మానవత్వాన్ని తన ముఖ్యమైన విలువగా నిలబెట్టేందుకు ప్రయత్నించారు. రైతులు, మహిళలు, యువత, వృద్ధులు, పట్టణ ప్రజలు, గ్రామీణ ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పలు వేదికలపై పిలుపునిచ్చారు.

ప్రజలు సమస్యలను నేరుగా తెలియజేయడానికి, యువత తమ ఆలోచనలను పంచుకోవడానికి, ప్రభుత్వంతో సంభాషించడానికి సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించారు కేటీఆర్. అధికారంలో ఉన్నా, లేకపోయినా ఆయన ప్రజలతో నేరుగా మాట్లాడటం, వారి సమస్యలను వినడం, స్పందించడంతో యువతలో కేటీఆర్ పట్ల విశ్వాసం మరింత పెరిగింది. అందుకే ఆయన 'యూత్ కనెక్ట్' ఉన్న లీడర్‌గా గుర్తింపు పొందారు. ఒక నాయకుడి గొప్పతనం ఆయన అధికారంలో ఎంతకాలం ఉన్నారనేదానిలో ఉండదు. ఆ నాయకత్వంలో ఎంతమంది తమ జీవితాలను మార్చుకొనే అవకాశం పొందారనే దానిలో ఉంటుంది. యువత ఉద్యోగం పొందినప్పుడు, స్టార్టప్ ప్రారంభించినప్పుడు, తన ఆవిష్కరణను ప్రపంచానికి పరిచయం చేసినప్పుడు, ఒక విద్యార్థి తన కలను నిజం చేసుకునే ధైర్యం పొందినప్పుడు అక్కడ నాయకత్వం తన అసలు అర్థాన్ని సంతరించుకుంటుంది. అలాంటి మార్పులను లక్ష్యంగా పెట్టుకున్న నాయకత్వం సమాజంపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుంది. అలాంటి ప్రభావం చూపిన, చూపుతున్న నాయకుడు కేటీఆర్.

యువత చేతిలో ప్రతిభ ఉంటే, దానికి దిశ చూపే నాయకత్వం కూడా ఉండాలి. అలాంటి నాయకత్వానికి ఉదాహరణ కేటీఆర్. ఇంకా రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పోవాలి, యువత తమ ప్రతిభను ప్రపంచానికి చాటాలి. అందుకు ఆ నాయకత్వం మళ్లీ అధికారంలోకి రావాలి. తెలంగాణ బ్రాండ్ గ్లోబల్ వేదికపై సత్తా చాటాలి. యువత ఆశలకు వెలుగై, తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో తనదైన ముద్ర వేసిన కేటీఆర్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.



సృష్టి మనకు అందించిన అవకాశాలను అందిపుచ్చుకొని నలుగురికి సహాయపడటమే జీవిత పరమార్థం. అలాంటిది రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఉండేవారికి ఇతరులకు సహాయపడే అవకాశాలు ఎక్కువగా వస్తాయి. వాటిని నేతలు ఎలా సద్వినియోగం చేసుకొంటున్నారనే దాన్ని బట్టే సాధారణ రాజకీయ నాయకుడికి, అసాధారణ ప్రజా నాయకుడికి మధ్య తేడా తెలుస్తుంది. ఆ రెండో కోవలో మొదటి వరుసలో ఉండే నాయకుడే కేటీఆర్. ప్రజాజీవితంలో మార్పు కోసం కృషి చేసిన, తపిస్తున్న నాయకుడు రామన్న.

# మాస్ లీడర్.. క్లాస్ పొలిటీషియన్

విభిన్న శైలి, విలక్షణ నాయకత్వం, విశిష్ట విలువలు వెరసి పన్నెండేండ్ల క్రితం 'బ్రాండ్ కేటీఆర్' సాక్షాత్కారమైంది. రాజకీయాలు మూస పద్ధతిలో సాగుతున్న తరుణంలో కేటీఆర్ ఒక టార్చ్ బేరర్ అయ్యారు. సరికొత్త పంథాతో రాజకీయాలను, ప్రజా సేవను ఒక గేమ్‌లా కాకుండా, ఒక టాస్క్‌లా తీసుకొని చరిత్ర పుటల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన పేజీని సంపాదించారు. తెలంగాణ పోరాటంలో ఉద్యమ సారథి కేసీఆర్‌కు వెన్నంటి ఉండటానికి సౌకర్యవంతమైన జీవితాన్ని, మంచి ఉద్యోగాన్ని త్యజించారు. ఉద్యమ జెండాను ఎత్తారు. రెండు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో ప్రజల జీవితాలను మెరుగుపర్చడానికి కంకణబద్ధులయ్యారు.

అది సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభోత్సవమైనా, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహమైనా, ప్రజా పోరాటమైనా, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నా, బ్రాండ్ అంబాసిడర్‌లా తెలంగాణను ప్రమోట్ చేయాలన్నా కేటీఆర్‌ది ప్రత్యేక శైలి. పెట్టుబడులు తేవాలన్నా, ప్రజా సమస్యలపై గళమెత్తాలన్నా కేటీఆర్ తన మార్క్ చూపిస్తారు. తొమ్మిదిన్నరేండ్ల పాటు మంత్రిగా తెలంగాణ ఖ్యాతిని పెంచేందుకు అహర్నిశలు శ్రమించారు. కేటీఆర్ డైనమిజాన్ని ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కేంద్ర మంత్రులు కూడా కొనియాడారు. ఇక దిగ్గజ పారిశ్రామికవేత్తలైతే తెలంగాణ పురోగతి పట్ల కేటీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి చూసి మంత్రముగ్ధులయ్యారు. ఫాక్స్‌కాన్, కిటెక్స్ లాంటి పేరుగాంచిన పరిశ్రమలు తెలంగాణకు రావడం వెనుక కేటీఆర్ కృషి అసామాన్యం... అనితర సాధ్యం.

కరోనా సమయంలో గానీ, కష్టకాలంలో గానీ ఒక ట్వీట్ చేస్తేచాలు.. తమ సమస్యకు పరిష్కారం చూపుతారనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించిన నాయకుడు కేటీఆర్. 'గిఫ్ట్ ఏ స్మైల్' అనే కార్యక్రమం ద్వారా ఎంతోమంది జీవితాల్లో వెలుగులునింపిన గొప్ప మనసున్న నేత కేటీఆర్.

ఐటీ మంత్రిగా కేటీఆర్ ఉన్నప్పుడు.. ఇలాంటి ఐటీ మంత్రి మాకు కూడా ఉంటే బాగుండును అని ఇతర రాష్ట్రాల వాళ్లు కితాబిచ్చారంటేనే ఆయన ఎంత బలమైన ముద్ర వేశారో అర్థం చేసుకోవచ్చు. ఇక వ్యక్తిత్వంలోనూ కేటీఆర్ మనసున్న నాయకుడు. రాజకీయ నాయకుల్లో ఉండే అత్యంత అరుదైన లక్షణం ముక్కుసూటితనం. అదే ఆయన ప్రత్యేకత. నిక్కచ్చిగా మాట్లాడే మాస్టర్ ఆరేటర్ కేటీఆర్. భావాన్ని బలంగా వ్యక్తీకరించే సత్తా, విషయం ఏదైనా.. సులభతరంగా వివరించగలిగే పరిజ్ఞానం... మాస్ అయినా.. క్లాస్ అయినా అదే ఊపు ఆయన సొంతం.

పండ్లున్న చెట్టుకే దెబ్బలు అన్నట్టు, దశాబ్ద కాలంగా కేటీఆర్ అంటే గిట్టనివాళ్లు ఆయనపై చేయని దుష్ప్రచారాలు లేవు. ఆయన స్థాయిని అందుకోలేక, కేటీఆర్ ధాటిని తట్టుకోలేక ప్రత్యర్థులు అభాండాలు వేసినా ధైర్యంగా ఎదుర్కొంటున్నారు.. దీటుగా తిప్పికొడుతున్నారు కేటీఆర్. దుమ్మెత్తిపోసేవాళ్లకు కేటీఆర్ స్టైల్‌లో దమ్మున్న సమాధానం చెప్పాలంటే 'తెలంగాణోళ్లం కదా, కడుపులో కత్తులు పెట్టుకొని పెదాల మీద నవ్వులు పెట్టుకునే రకం కాదు. ఏదైనా మొఖం మీదనే చెప్తం'. తెలంగాణ రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిన కేసీఆర్ దళంలో సైనికుడు, మాస్ లీడర్, క్లాస్ పొలిటీషియన్ కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు.



మైత్రేయ కొడకండ్ల

# తెలంగాణలో తొత్తు మీడియాకు అదో హెచ్చరిక!

దేశ రాజధాని ఢిల్లీ వేదికగా నేడు ఒక నూతన పోరాటం మొదలైనట్టు అక్కడి పరిస్థితి చూస్తే అర్థవుతున్నది. ఈ పోరాటం కేవలం పాలకులపై మాత్రమే కాదు, పాలకులకు భజన చేస్తూ ప్రజల గొంతును తొక్కిపెడుతున్న 'గోదీ మీడియా' వైఖరిపై కూడా! అని తేటతెల్లం అవుతున్నది. హక్కుల కోసం, న్యాయం కోసం వీధిలోకి వచ్చిన విద్యార్థులు, డిజిటల్ యుగంలో పెరిగిన 'జెన్ జీ' యువత నేడు మైకులు, కెమెరాలతో కవరేజీ ఇస్తున్న జర్నలిస్టులను నేరుగా నిలదీస్తున్నారు. 'గోదీ మీడియా గో బ్యాక్' అంటూ నినాదాలతో హోరెత్తిస్తున్నారు. జర్నలిజం ముసుగులో జరుగుతున్న వికృత ప్రచారాన్ని నిరసిస్తూ కెమెరాలు, మైకులను తరిమికొడుతున్నారు.



క్రాంతి కిరణ్

నిజాన్ని దాచేకొద్దీ అది నిప్పులా ప్రకాశిస్తుందనేది జగమెరిగిన సత్యం. స్వాతంత్య్ర పోరాటానికి ముందు నుంచే మన దేశంలో పత్రికలు ప్రజల వైపే నిలిచాయి. ఆనాడు బ్రిటిష్ పాలకులు ఎంత ఒత్తిడి తెచ్చినా, హింసకు పాల్పడినా వెరవకుండా స్వాతంత్య్ర సమరయోధులు పత్రికలను ప్రజల చైతన్యం కోసం, న్యాయం కోసం నడిపారు. కానీ, నేడు ఆ పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత రూటు మార్చిన పత్రికలు, మీడియా రంగం ఇటీవలి కాలంలో మరీ ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వ హయాంలో తమ స్వతంత్రతను పూర్తిగా తాకట్టు పెట్టాయి. ప్రభుత్వాలు విసిరే ప్రలోభాలు, ఎరలకు లొంగిపోయిన ప్రధాన స్రవంతి మీడియా ప్రజా సమస్యలను గాలికొదిలేసి పాలకుల పాదసేవకే పరిమితమవుతున్నది. కార్పొరేట్ శక్తులు డబ్బులిచ్చి మీడియాతో చిలుకపలుకులు పలికిస్తుంటే, నిజాన్ని బతికించాల్సిన జర్నలిజం చచ్చిపోతున్నది.

గతంలో ఈశాన్య రాష్ట్రాలు, కశ్మీర్‌లో జరిగిన పోరాటాలపై తప్పుడు కథనాలు అల్లినట్టే.. తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ మీడియా తీవ్ర వివక్ష చూపింది. ఎంతోమంది బలిదానాల అనంతరం ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ నాయకత్వంలో ఒక రాజకీయపార్టీని మొదలుపెడితే అంతంతమాత్రంగానే వార్తల కవరేజీ ఇచ్చేవారు. నాడు ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా విద్యార్థులు, తెలంగాణ వ్యాప్తంగా ఉవ్వెత్తున ప్రజల ఉద్యమం రగులుతుంటే, మీడియా మాత్రం కేసీఆర్ వార్తలు, ఉద్యమ కవరేజీని కావాలనే కుదించింది. అనేక రకాల తప్పుడు వార్తలను ప్రసారం చేసి కేసీఆర్ పట్ల, ఉద్యమం పట్ల ప్రజల్లో తప్పుడు అభిప్రాయం ఏర్పడేలా చేసింది. స్వరాష్ట్రం కోసం పోరాడుతున్న తెలంగాణ బిడ్డలు, ఉద్యమకారులకు 'వేర్పాటువాదులు' అని రంగు పూసి వికృత కథనాలు అల్లింది. ప్రజల సత్యమైన ఆకాంక్షను తొక్కేసి హేళన చేసిన మీడియా వైఖరిపై ఆనాడు ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు. ఫలితంగా ఓబీ వ్యాన్లను తగులబెట్టారు, ప్రసారాలను అడ్డుకున్నారు, దాడులకు దిగారు. చివరకు సీమాంధ్ర మీడియాలో పని చేసే తెలంగాణ ప్రాంత జర్నలిస్టులు సైతం సామాన్య ప్రజల్లోకి వెళ్లే ధైర్యం చేయలేక, పోలీసుల రక్షణలో ఉండి వార్తలను రిపోర్ట్ చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఆ తర్వాతకాలంలో జెన్ జీ యువత చైతన్యవంతమై సోషల్ మీడియా వేదికగా నిజానిజాలను వెలికి తీయడం ప్రారంభించాక కూడా మీడియా తన తీరును మార్చుకోకపోవడం మరింత అసహనాన్ని పెంచింది. ఢిల్లీ సరిహద్దుల్లో సాగిన రైతుల సుదీర్ఘ నిరసనలో అన్నదాతలను 'దేశద్రోహులు'గా చిత్రీకరించడం, ఆపరేషన్ కగార్ వంటి మిలిటరీ చర్యల సందర్భాల్లో మహిళల పట్ల ప్రవర్తించిన తీరుపై కథనాలను తొక్కిపెట్టింది.


ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లోని విలువైన అటవీ సంపదను అదానీ లాంటి వారికి కట్టబెడుతుంటే భూసేకరణకు వ్యతిరేకంగా వేలాదిమంది రోడ్ల మీదికి వచ్చి నిరసన తెలిపారు. కానీ సదరు మీడియా కనీసం దానిని కవర్ చేయకుండా బ్లాకౌట్ చేయడం లాంటి ఘటనలు ప్రజల్లో తీవ్ర ఆక్రోశాన్ని నింపాయి. దేశ ఆర్థిక పురోగతి క్షీణించడానికి, ప్రజాధనం లూటీ కావడానికి కారణమైన బడా వ్యాపారవేత్తలు, ఆర్థిక నేరగాళ్లను మీడియా కావాలనే వదిలేస్తూ, వారి తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నం చేయడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

వైద్య కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలంటూ విద్యార్థులు నిరసన చేపట్టిన తర్వాత ఢిల్లీలో పరిస్థితి మరీ దిగజారింది. టీవీ డిబేట్లు, ఇంటర్వ్యూల పేరిట ప్రజలను, విద్యార్థులను రెచ్చగొట్టడం, హక్కుల కోసం పోరాడుతున్న వారిని టీవీ స్టూడియోల్లో 'మీరే దేశద్రోహులు' అని నిలదీయడం నిత్యకృత్యమైంది. ఇదంతా స్వతంత్రంగా జరుగుతున్న జర్నలిజం కాదని, వారి వెనుక ఉండి ప్రభుత్వం ఆడించే కుట్రపూరిత క్రీడ అని విద్యార్థులు బలంగా భావిస్తున్నారు. అందుకే ఈ వికృత క్రీడను నిరసిస్తూ, పక్షపాత జర్నలిజానికి అలవాటుపడిన, దిగజారిన మీడియాను విద్యార్థులు నేడు నడిబజారులో నిలబెట్టి ప్రశ్నిస్తున్నారు.



ఢిల్లీలో ప్రస్తుతం నెలకొన్న క్షేత్రస్థాయి పరిస్థితులు మీడియా దిగజారుడుతనానికి అద్దం పడుతున్నాయి. లైవ్ ఇస్తున్న ఒక ఆంగ్ల చానల్ రిపోర్టర్ తమ ఉద్యమాన్ని కించపరుస్తున్నాడని గ్రహించిన విద్యార్థులు అతన్ని చుట్టుముట్టి దాడులకు సైతం వెనుకాడలేదు. 'మీరంతా దేశద్రోహులంట కదా?' అని హేళనగా అడిగిన ఒక మహిళా రిపోర్టర్‌పై మహిళా విద్యార్థులే విరుచుకుపడి తరిమికొట్టారు. విద్యార్థుల ఆగ్రహాన్ని గమనించిన మరో రిపోర్టర్ ఏకంగా పోలీస్ జీపు వెనుక దాక్కుని కవరేజీ చేయడానికి ప్రయత్నించే గతిమాలిన పరిస్థితి దాపురించింది. మెయిన్‌స్ట్రీమ్ మీడియా ప్రతినిధి కనిపించగానే విద్యార్థులు 'గోడీ మీడియా హై హై' అంటూ ర్యాగింగ్ తరహాలో అవమానిస్తూ వెంటబడుతున్నారు. అయితే ఈ భయానక వాతావరణానికి కారణం క్షేత్రస్థాయిలో కష్టపడే సాధారణ జర్నలిస్టులు కాదు, ప్రభుత్వాలతో కుమ్మక్కై, సొంత లాభాల కోసం జర్నలిజం విలువలను తాకట్టు పెట్టిన మీడియా యాజమాన్యాల తీరే నేడు జర్నలిజాన్ని బోనులో నిలబెట్టింది. పాలకుల మెప్పుకోసం పదే పదే అబద్ధాలు ప్రచారం చేయడం అలవాటుగా మారినపుడు, భవిష్యత్తులో మీడియా ఏదైనా నిజం చెప్పినా కూడా ప్రజలు నమ్మే పరిస్థితి ఉండదని మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టులు ముందుగా గ్రహించాలి. జర్నలిజంలో అత్యంత విలువైనది విశ్వసనీయత. ఒకసారి ఆ విశ్వసనీయతను కోల్పోతే, ఆ తర్వాత ఎన్ని రకాల ప్రకటనలు చేసినా సమాజంలో ఆ మీడియాకు ఉనికి లేకుండా పోతుంది. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఫోర్త్ ఎస్టేట్ పాలకుల భజన బృందంగా మారితే, అది మీడియాకు ఆత్మహత్యతో సమానం.

నేడు ఢిల్లీ వీధుల్లో రగులుతున్న ఆగ్రహం, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న డిజిటల్ యుద్ధం మొత్తం మీడియా రంగానికి ఒక గట్టి హెచ్చరిక. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేవలం అధికార పీఠాన్ని సంతృప్తిపరచడమే ధ్యేయంగా పెట్టుకుంటే ప్రధాన స్రవంతి మీడియాను ప్రజలే పూర్తిగా తిరస్కరిస్తారు. ఇప్పటికైనా 'గోడీ మీడియా' తన వైఖరిని మార్చుకుని, ప్రభుత్వం దారితప్పకుండా ప్రశ్నించే నిజమైన 'ఫోర్త్ ఎస్టేట్'గా నిలబడాలి. లేకపోతే, రాబోయే చరిత్ర మిమ్మల్ని సమాజానికి మేలు చేసిన జర్నలిస్టులుగా కాకుండా 'ప్రజాస్వామ్య ద్రోహులు'గానే గుర్తుంచుకుంటుంది.




ఢిల్లీలో జరిగిన సీజేపీ 'చలో పార్లమెంట్' కార్యక్రమంపై కేంద్రం చేపట్టిన నిర్బంధం మరోసారి దేశంలోని స్థితిగతులపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలంటూ విద్యార్థులు, యువకులు డిమాండ్ చేస్తే, చర్చలకు ఆహ్వానించాల్సిన ప్రభుత్వం.. అరెస్టులు, నిర్బంధాలకు పాల్పడింది. విద్యార్థుల వీరోచిత పోరాటానికి చలో పార్లమెంట్ వేదికగా నిలిచింది, నిర్బంధాలకు వెనుతిరగలేదు, న్యాయమైన డిమాండ్లను సాధించేవరకు పోరాటం చేస్తామని ప్రకటించారు

# నిర్బంధాలతో గొంతు నొక్కలేరు



దేవీప్రసాద్

నీట్ పరీక్షలో జరిగిన తప్పుల కారణంగా 23 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. లక్షలాది విద్యార్థులు నష్ట పోయారు. కోట్లాది కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్తు కోసం సంవత్సరాల తరబడి కష్టపడుతుంటే, ఒక పరీక్షలో జరిగిన అవకతవకతో వారి కలలు ఛిన్నాభిన్నమయ్యాయి. ఇది కేవలం ఒక పరీక్షలో జరిగిన తప్పిదం కాదు. దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతపై పడిన మచ్చ. నైతిక బాధ్యతతో వ్యవహరించి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోట్లాది మంది ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రధాన మంత్రి స్పందించకపోవడం దారుణం. దీంతో విద్యార్థులు, యువతీ యువకులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు చలో పార్లమెంట్ నిర్వహించారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఎప్పటిలానే అణచివేతనే అస్త్రంగా ఎంచుకున్నది. కొన్నేండ్లుగా రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు ఎవరు నిరసన తెలిపినా ముందుగా ఎదురయ్యేది పోలీసులు, బారికేడ్లు, అరెస్టులే. విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగాలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ప్రజల ప్రశ్నలకు బారికేడ్లు సమాధానం కావు. విద్యార్థుల భవిష్యత్తుకు మౌనం పరిష్కారం కాదు. పాలకులు నిర్బంధ రాజకీయాలను విడనాడాలి.

2011లో రాంలీలా మైదానంలో యూపీఏ ప్రభుత్వం చేస్తున్న అవినీతిపై సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే చేసిన దీక్షకు అప్పటి ప్రతిపక్ష బీజేపీ మద్దతు తెలిపింది. కానీ నేడు పాలకపక్షమైన బీజేపీ వైఖరి మారింది. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చినప్పుడు రైతులు చేసిన సుదీర్ఘ పోరాటాన్ని బీజేపీ ప్రభుత్వం అణచివేయాలని చూసింది. రైతులను దేశద్రోహులుగా చిత్రీకరించేందుకు బీజేపీ అనుకూలవర్గం కుట్ర చేసింది. విద్యార్థుల ఉద్యమాన్ని కూడా అదే విధంగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నది. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న వాళ్లపై బీజేపీ నేతలు బురద చల్లే ప్రకటనలు చేస్తున్నారు.

ప్రజా ఉద్యమాలను అణచివేయడంలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో రెండు పార్టీలు, విఫలమయ్యాయి. ఢిల్లీలో, గల్లీలో దొందూ దొందే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ శక్తి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. అందుకే సీజేపీ ఇచ్చిన పిలుపులకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తున్నది. ఆధిపత్య రాజకీయ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు వస్తున్నాయి. విద్యార్థులపై కేంద్రం అణచివేతను నిరసిస్తూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు, శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేయడం విడ్డూరం. హామీలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో జరుగుతున్న పోరాటాలను నిర్బంధాలతో అణచివేసే ప్రయత్నం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. విద్యార్థులను రెచ్చగొట్టే విధంగా వారిపై దుర్భాషలు, దుష్ప్రచారం చేయిస్తున్నది. సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయని కాంగ్రెస్ నిరసన నవ్వులపాలు కాక తప్పదు. చివరకు సభలకు అనుమతి ఇవ్వకుండా, కనీసం నిరసన తెలిపే హక్కును హరించి వేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతనే ఢిల్లీ ఘటనపై మాట్లాడాలి. ప్రజల, విద్యార్థుల ఉద్యమంగా ప్రారంభమైన పోరాటాన్ని ఇప్పుడు రాహుల్ గాంధీ హైజాక్ చేయడానికి ఎత్తుగడలు వేస్తున్నట్టు కనిపిస్తున్నది.

ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమం లక్ష్యం ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమైన అధికార పక్షం, ప్రతిపక్షం రెండింటినీ ప్రజల ముందు జవాబుదారులుగా నిలబెట్టడమే. అయితే మొన్నటి పరిణామాల తర్వాత ప్రజల సమస్యలు, ప్రజా జవాబుదారీతనం వంటి అసలు అంశాల కంటే రాజకీయ ప్రదర్శనలు, పరస్పర విమర్శలే ప్రధాన చర్చగా మారాయి. ప్రజల ఉద్యమాన్ని పార్టీల మధ్య రాజకీయ పోటీగా కుదించడానికి కారణమైనందుకు ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇద్దరిపైనా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల నేతృత్వంలోని ఉద్యమాలు శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో బలమైన రాజకీయ వ్యవస్థలను సైతం కుదిపేశాయి. అలాంటి ప్రజా ఉద్యమాల శక్తే అధికార పక్షానికైనా, ప్రధాన ప్రతిపక్షానికైనా ఆందోళన కలిగించే అంశమై ఉండవచ్చు కానీ చరిత్రను గమనించి ముందుకు సాగకుంటే జవాబు చరిత్రే చెప్తుంది. మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు 'కొంత మంది యువకులు ముందుయుగం దూతలు, పావన నవజీవన బృందావన నిర్మాతలు' అని జంతర్‌మంతర్‌లో జనగానం మార్మోగుతున్నది. కేంద్రంలోని బీజేపీ సర్కార్, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ప్రజాగ్రహం పెల్లుబుకుతున్నది. నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను అణచివేయలేరు, ప్రజల గొంతు నొక్కలేరు.

**(వ్యాసకర్త: రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్)**



యాదాద్రి జిల్లా గుండాల మండలం సుద్దాలలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

## నాణ్యమైన కరెంటు కోసం సబ్‌స్టేషన్ ముట్టడి

**యాదాద్రి జిల్లా సుద్దాలలో రైతుల ఆందోళన**

గుండాల, జూలై 23: కరెంటు సమస్యలపై యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల రైతులు కన్నెర్ర చేశారు. 18 గంటలపాటు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం సుద్దాలలోని సబ్‌స్టేషన్ ఎదుట ఆలేరు-మోత్కూర్ రహదారిపై సుద్దాల, అనంతారం గ్రామాల రైతులు బైఠాయించారు. అనంతరం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. నాటు వేసే సమయంలో కేవలం 12 గంటల కరెంటు ఇవ్వడం వల్ల పొలాలు పారకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నాటు వేసిన వరి ఎండిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 18 గంటలపాటు నాణ్యమైన కరెంటు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 12 గంటలే కరెంటు ఇస్తున్నారని మండిపడ్డారు. అన్నంపెట్టే రైతులకు రేవంత్‌రెడ్డి సున్నం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు, కరెంటు ఇవ్వకుండా, పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తుందని ధ్వజమెత్తారు. రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసిన అనంతరం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. మోత్కూర్ ఏడీ బాలు నాయక్, ఏఈ అంబాల నర్సింహులు గౌడ్, మోటకొండూర్ ఎస్సై అశోక్, గుండాల ఏఎస్సై ప్రకాశ్ వచ్చి రైతులకు సర్దిచెప్పారు. ఆందోళనలో సుద్దాల సర్పంచ్ గడ్డమీది మహేశ్, అనంతారం సర్పంచ్ వినోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట నుంచి ఇసుక తరలింపునొద్దని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

## ఇసుక తరలింపును అడ్డుకున్న పోచన్నపేటవాసులు

- ఇసుక మాఫియా ఆగడాలు పెరిగాయంటూ ఆందోళన
- పంచాయతీ తీర్మానం చేయాలని రైతుల డిమాండ్

బచ్చన్నపేట, జూలై 23 : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేటలోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించొద్దని గురువారం గ్రామస్తులు, రైతులు ఆందోళనకు దిగారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకొని వెనక్కి పంపించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామం నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నదని, అందరం ఐక్యంగా ముందుకొస్తేనే ఇసుక అక్రమరవాణాకు బ్రేక్ వేయవచ్చని సూచించారు. ఈ విషయమై సర్పంచ్ ఫిరోజ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యేక తీర్మానం చేయాలని కోరారు. ఆందోళనలో మాజీ సర్పంచ్ మామిడి మల్లయ్య, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

# వట్టి మాటల భట్టి!

**ఒకవైపు నిరంతర సరఫరా అంటూ ప్రకటనలు**
**మరోవైపు కరెంట్ కోతలు**

- పొదుపుగా వాడుకోవాలని ఉచిత సలహాలు
- నీటి నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ విఫలం
- సాగుకు కరెంటు సరఫరాలోనూ అదే తీరు
- ప్రస్తుత డిమాండు 14 వేల మెగావాట్లు
- సరఫరా చేస్తున్నది 12 వేల మెగావాట్లు
- అధిక లోడు పేరిట ఇష్టారాజ్యంగా కరెంటు కోతలు
- విద్యుత్తు ఉత్పత్తిపై ప్రణాళికాలోపమే కారణం
- బొగ్గు సరఫరాపై దృష్టి పెట్టని భట్టి విక్రమార్క

హనుమకొండ, జూలై 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):

**'వర్షాభావంతో ప్రాజెక్టులకు జలకళ లేదు. రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీరే కాకుండా కరెంటు సరఫరా కూడా కష్టమవుతుంది. మొత్తం థర్మల్ విద్యుత్తుపైనే ఆధారపడితే బొగ్గు సమకూర్చుకోవడం కూడా కష్టమే. కాబట్టి, నీళ్లతోపాటు కరెంటును పొదుపుగా వాడుకోవాలి.'**

*- జూలై 20న హైదరాబాద్‌లో జరిగిన ఓ సదస్సులో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క*

**'రాష్ట్రంలో పవర్ కట్ లేనేలేదు. వర్షాలు, ఈదురుగాలులు వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడే తాత్కాలికంగా అంతరాయం కలుగుతున్నది. వీటిని ప్రజలు పవర్ కట్‌గా భావించవద్దు.'**

*-జూలై 22న వరంగల్‌లో జరిగిన టీజీఎన్‌పీడీసీఎల్ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.*

వానలు లేక ప్రాజెక్టుల్లోకి నీళ్లు రావడంలేదని, నీళ్లు, కరెంటు పొదుపుగా వాడుకోవాలని ఒకవైపు చెప్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. మరోవైపు, వానలు రావడం వల్లే కరెంటు కోతలు ఉంటున్నాయని అంటున్నారు. కరెంటు సరఫరా, నిర్వహణపై పూర్తిగా విరుద్ధమైన ప్రకటలు చేస్తుండటం గమనార్హం. సాగునీరు ఇవ్వకపోవడం, కరెంటు నిర్వహణలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇప్పుడు నీరు, కరెంటు పొదుపుపై ఉచిత సలహాలు ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా, ముందస్తు జాగ్రత్తలు, నీటి నిర్వహణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పంటలకు సాగునీటి సరఫరాలో ఘోరంగా విఫలమైంది. సాగునీటి నిర్వహణలో ప్రభుత్వ ప్రణాళిక లేమితో గోదావరిలో నీళ్లు ఉన్నా పంటలకు అందడం లేదు. కరువు పరిస్థితుల్లో బోర్ల కింద పంటలు సాగు చేసుకొనే రైతులకు నాణ్యమైన కరెంటు సరఫరా చేయాల్సిన ప్రభుత్వం... ఇంధన శాఖ నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీరుతో పూర్తిగా విఫలమైంది. కరెంటు సరఫరాపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసే ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన కుదరడంలేదు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు కరెంటు కోసం ప్రతిరోజూ ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అవేమీ కనిపించనట్టుగా ఉపముఖ్యమంత్రి తీరు ఉంటున్నది. కరువు పరిస్థితుల్లో కరెంటు డిమాండు, సరఫరా, ఉత్పత్తి విషయాలను పట్టించుకోవడం లేదు. ప్రకృతే అంతా సర్దుబాటు చేస్తుందనే ఉద్దేశంతో కరెంటు సరఫరా పరంగా కరువును ఎదుర్కొనేందుకు కనీస చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు గరిష్ఠ డిమాండు అనే ప్రకటనలు చేసి చేతులు దులుపుకొంటున్నారు.

### సాగునీరు ఇవ్వక...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషితో పదేండ్లు రాష్ట్రంలో ఎక్కడా కరువు పరిస్థితులు రాలేదు. కాళేశ్వరంతోపాటు ఇతర ప్రాజెక్టులతో రాష్ట్రవ్యాప్తంగా రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందింది. తెలంగాణలో గరిష్ఠంగా బోర్ల కిందనే పంటల సాగు ఉంటుంది. సాగునీటి ప్రాజెక్టులు, కాలువలతో ప్రతి చెరువు, కుంటలకు నిరంతరంగా నీటి సరఫరా ఉండటంతో ప్రతి ప్రాంతంలోనూ బోర్లలో పంటలకు సరిపడా నీటి వనరులు ఉండేవి. పంటల సాగుకు రైతులు ఎక్కడా ఇబ్బందులు పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో పంటల సాగు రైతులకు ఆందోళనకరంగా తయారైంది. నీటి వనరులు ఉన్నా ప్రణాళిక ప్రకారం సద్వినియోగం చేసుకొనే పరిస్థితి లేకపోవడంతో పంటలు ఏ సీజన్‌లో పండుతాయో, ఎప్పుడు ఎండుతాయో తెలియని పరిస్థితి నెలకొన్నది.



సింగరేణి అధికారులతో కలిసి గురువారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి జేవీఆర్ ఓసీ-2 బొగ్గు గనిని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రస్తుత కరువు పరిస్థితుల్లోనూ ప్రాణహిత నదిలో ప్రవాహంతో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసే అవకాశం ఉన్నది. బీఆర్‌ఎస్‌కు పేరు వస్తుందనే ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సాగునీటిని సరఫరా చేయడంలేదు. దీంతో పంటల సాగు పూర్తిగా సంక్షోభంలో పడింది.

### ఉత్పత్తిపై ఉత్తుత్తి ప్రణాళికలు

కరువు పరిస్థితులకు తగినట్టుగా కరెంటు ఉత్పత్తి, సరఫరాలో ఇందన శాఖ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది. సాగునీటి సరఫరాపై రైతుల్లో నమ్మకం లేకపోవడంతో బావులు, బోర్ల ఆధారంగానే నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కరెంటు డిమాండు 13,300 మెగావాట్ల నుంచి 14 వేల మెగావాట్ల వరకు ఉంటున్నది. సగటున 12,400 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతున్నది. డిమాండుకు తగినట్టు సరఫరా లేకపోవడంతో లోడ్ రిలీజ్ (ఎల్‌ఆర్) పేరిట కోతలు పెడుతున్నారు. కరెంటు కోతలతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు ప్రతిరోజూ నిరసనలకు దిగుతున్నారు. కరెంటు సరఫరా చేయాలని సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారు. వానకాలం పంటల సాగు మొదలయ్యే సమయంలోనే డిమాండుకు సరిపడా కరెంటు ఉత్పత్తి చేయకపోవడం కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమేనని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వానలు లేకపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, పోచంపాడులోని జల విద్యుత్తు కేంద్రాల్లో ఉత్పత్తి నామమాత్రంగానే ఉన్నది. కొత్తగూడెం, మణుగూరు, భూపాలపల్లి, మిర్యాలగూడలోని విద్యుత్తు కేంద్రాల్లో బొగ్గు సరఫరా లేక తక్కువగా ఉత్పత్తి జరుగుతున్నది. కరువు పరిస్థితుల నేపథ్యంలో అసరమైన మేరకు కరెంటు ఉత్పత్తి కోసం బొగ్గును నిల్వ చేసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఆరు నెలల ముందు నుంచి ఉన్న కరువు హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుంటే బొగ్గుతో అయినా సరిపడా కరెంటు ఉత్పత్తి చేసుకొనే అవకాశం ఉండేదని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులు పునరావృతం అవుతున్నాయని విద్యుత్తురంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### కొనే ప్రణాళిక లేదు

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే వ్యవసాయ రంగానికి కేసీఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. పదేండ్లపాటు ప్రతి సీజన్‌లోనూ పంటలకు పుష్కలంగా నీటిని సరఫరా చేసింది. బావులు, బోర్లకు నిరంతరం నాణ్యమైన కరెంటు ఇచ్చింది. తెలంగాణ ఏర్పాటైన కొత్తలో అవసరమైన కరెంటు లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి సాగుకు ఉచితంగా సరఫరా చేసింది. పంటల సాగుకు ఎప్పుడూ ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. పంటల సాగులో అతి ముఖ్యమైన సాగునీరు, కరెంటు సరఫరాలో అంశాలను పట్టించుకోవడంలేదు. కరువు పరిస్థితుల్లో జల విద్యుత్తు ఉండదు. బొగ్గు నిల్వలు లేకపోవడంతో థర్మల్ విద్యుత్తు తక్కువగానే ఉంటున్నది. ప్రత్యామ్నాయంగా ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి కరెంటు సరఫరా చేయాల్సిన ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తు ఏర్పాట్లు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు నిర్ణయించుకున్నా కరెంటు దొరికే పరిస్థితి లేదని నిపుణులు చెప్తున్నారు. వాతావరణ, వ్యవసాయ సీజన్ల తేడా కారణంగా ఉత్తరాది రాష్ట్రాల్లో కరెంటు డిమాండు తక్కువగా ఉన్నప్పుడు తెలంగాణకు ఎక్కువ అవసరం ఉండేది. మన రాష్ట్రంలో వరి కోతల సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండు ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితులకు తగినట్టుగా తెలంగాణకు అవసరమైన కరెంటును కొనుగోలు చేసే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కరువు పరిస్థితి దేశవ్యాప్తంగా ఉన్నది. అన్ని రాష్ట్రాల్లోనూ కరెంటు సరఫరాలో జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసుకోలేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి మనకు కరెంటు వచ్చే పరిస్థితి కనిపించడంలేదని, తప్పనిసరి పరిస్థితుల్లో కొనాలంటే అత్యధిక ధర చెల్లించాల్సి రావచ్చని విద్యుత్తురంగ నిపుణులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక, పర్యవేక్షణ లోపం కారణంగా పంటల సాగు కోసం రైతులు తీవ్రమైన కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తున్నది.

### నారుమడులకు కరెంటు లేదు

ఎల్ నినో కరువు పరిస్థితులు ఉంటాయని వాతావరణ పరిశోధనా సంస్థలు ఆరు నెలల నుంచే హెచ్చరిస్తున్నాయి. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఇంధన శాఖ కరువును ఎదుర్కొనేందుకు అవసమైన కనీస ఏర్పాట్లు చేయలేదు. ప్రస్తుతం నారుమడులకు నీటి సరఫరా చేసేందుకే అరకొర కరెంటు సరఫరా చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే నాట్లు వేసిన తర్వాత డిమాండుకు తగినట్టుగా ప్రభుత్వం కరెంటు సరఫరా చేస్తుందా? అని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రాజెక్టులు, కాలువలతో నీళ్లు వస్తాయనే ఆశలు వదలుకొని, ఉమ్మడి రాష్ట్రంలో తరహాలో పూర్తిగా బావులు, బోర్లను నమ్ముకొని వరి నాట్లకు సిద్ధమవుతున్నారు. పంటల విస్తీర్ణాన్ని సగానికి సగం తగ్గించుకుంటున్నారు. రాష్ట్రం లో దాదాపు 30 లక్షల వ్యవసాయ కరెంటు కనెక్షన్లు ఉన్నాయి. ప్రాజెక్టులు, కాలువల ద్వారా చెరువులకు నీటి సరఫరా లేకపోవడంతో బావులు, బోర్లలో నీటి లభ్యత అడుగంటుతున్నది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయానికి నాణ్యమైన, మెరుగైన కరెంటు సరఫరా చేయాల్సిన ప్రభుత్వం కోతలతో రైతులను ఇబ్బందులు పెడుతున్నది. నీటి మట్టాలు లోపలికి వెళ్తుండటంతో సాధారణం కంటే కరెంటు ఎక్కువ అవసరమవుతున్నది. ప్రభుత్వం మాత్రం అవసరానికి భిన్నం గా తక్కువగా సరఫరా చేస్తున్నది. దీంతో నారు మడులను రక్షించుకోవడానికే రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

# ఎకరాలను గజాల్లోకి మార్చి.. ప్రజలను బకరాలను చేసి!

**అసైన్డ్ భూమిని కాజేసిన అధికార పార్టీ ఎమ్మెల్యే**

- తన సంస్థ ద్వారా ఓవర్ ల్యాపింగ్ భూమి కొనుగోలు
- సర్వే నంబర్ మార్చి, వెంచర్ వేసి, విల్లాల నిర్మాణం
- సామాన్యులకు అమ్మి సొమ్ము చేసుకున్న ప్రజాప్రతినిధి
- రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం
- చివర్లో మేల్కొని సర్వేచేసి, ఆక్రమణలని తేల్చిన అధికారులు

రంగారెడ్డి, జూలై 23 (నమస్తే తెలంగాణ)/ ఇబ్రహీంపట్నం: 'ఎకరాల్లో భూములు కొని, గజాల్లోకి మార్చి.. బకరాలకు కట్టబెడుతున్నారు' - సొంత పార్టీ ఎమ్మెల్యేను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఇది. ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు అటు ప్రభుత్వంలో, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. అయితే.. సీఎం ఆ మాటలను యథాలాపంగా అనలేదని, సదరు ప్రజాప్రతినిధి వందల మంది సామాన్యులను బకరాలను చేశారనే విషయం తెలిసే ఇలా పరోక్షంగా దెప్పిపొడిచి ఉంటారని స్థానికులు చెప్తున్నారు. ఇందుకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఘటనే సాక్ష్యం. రేవంత్‌రెడ్డి అన్నట్టుగానే సదరు ఎమ్మెల్యే ప్రభుత్వ భూమిని ఎకరాలుగా కొని, గజాలుగా మార్చి.. వందల మందికి కట్టబెట్టి బకరాలుగా మార్చారు. 33 ఎకరాల ఓవర్‌ల్యాపింగ్ భూమిని తన రియల్ ఎస్టేట్ సంస్థ ద్వారా కొనుగోలు చేసి, వెంచర్లు వేసి ఆ ప్లాట్లను విక్రయించారు. తీరా ఇప్పుడు అది ప్రభుత్వ భూ మిగా తేలడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు.

### ఇదీ 33 ఎకరాల కథ

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని ఖానాపూర్ సమీపంలో ఉన్న సాగర్-హైదరాబాద్ రహదారికి ఆనుకొని సర్వే నెంబర్ 67లో 33 ఎకరాలకుపైగా ఓవర్‌ల్యాపింగ్ భూమి ఉన్నది. 1954లో కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ భూమిని సుమారు 30మంది భూముల్లేని రైతులకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పున కేటాయించింది. అసైన్డ్ పట్టాలు, పాస్ పుస్తకాలు అందజేసింది. మరోవైపు గతంలో ఖానాపూర్ గ్రామానికే చెందిన 15మంది పైరవీకారులు 67 సర్వే నంబర్‌లోని భూములను పక్కనే ఉన్న సర్వేనెంబర్ 80 కింద చూపిస్తూ.. మంచాల తాహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టాలు పొందారు. ఇలా ఈ 33 ఎకరాలపై కొందరికి అసైన్డ్ పట్టాలు, మరికొందరికి సొంత పట్టాలు వచ్చాయి. దీంతో వివాదం కొనసాగుతున్నది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ.100 కోట్లకుపైగా ఉంటుందని స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెప్తున్నారు.




ఖానాపూర్ సమీపంలోని గ్యాబ్ ఏరియాలో ప్రభుత్వ భూమిగా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

### రైతుల నుంచి రియల్ ఎస్టేట్ సంస్థ చేతికి..

వివాదాస్పద 33 ఎకరాలను సొంతం చేసుకునేందుకు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఒక బడా ఎస్టేట్ సంస్థ రంగంలోకి దిగింది. స్థానికంగా ఉన్న ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ముందుగా ఈ భూములను తీసుకున్నారు. భూమికి రెండు రకాల యజమానులు ఉండటంతో, ఎటువైపు నుంచీ ఇబ్బంది రాకుండా జాగ్రత్త పడ్డారు. సర్వే నంబర్ 67లో ఉన్న అసైన్డ్ పట్టాదారుల నుంచి 99 సంవత్సరాలకు లీజ్ అగ్రిమెంట్ చేసుకున్నారు. అక్రమంగా సర్వే నంబర్ 80లో చూపి పట్టాలు పొందినవారి దగ్గరి నుంచి నేరుగా కొనుగోలు చేశారు. ఇలా ఓవర్‌ల్యాపింగ్ భూమి 33 ఎకరాలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లింది. అక్కడినుంచి ఈ భూమి జేబీ అనే రియల్ ఎస్టేట్ సంస్థకు 27 ఎకరాలు, గురునానక్ విద్యాసంస్థలకు 6 ఎకరాలు చేరింది. రియల్ ఎస్టేట్ సంస్థ ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేదని చెప్తున్నారు. గురునానక్ విద్యాసంస్థలు ఈ భూమిలో పలు భవనాలు నిర్మించింది. జేబీ రియల్ ఎస్టేట్ సంస్థ కొంత భూమిని నేరుగా అమ్మినట్టు చెప్తున్నారు. మిగతా భూమిని ప్లాట్లుగా విక్రయించింది. ఇది ప్రభుత్వ భూమి అని తెలిసినా అధికారులు రిజిస్ట్రేషన్లు చేసేశారు.

### స్థానికుల ఫిర్యాదుతో వెలుగులోకి..

ఇటీవల ఖానాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది 33 ఎకరాల ఓవర్‌ల్యాపింగ్ భూమిని అక్రమార్కులు కాజేస్తున్నారంటూ ఫిర్యాదు చేయటంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సైతం ఇది ప్రభుత్వ భూమి అని, కొంతమంది సర్వేనెంబర్లు మార్చి క్రయవిక్రయాలు జరిపారని, ప్లాట్లుగా మార్చి విక్రయించారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ఈ భూమిని సర్వే చేయాలని ఆదేశించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు వచ్చి సర్వే చేశారు. ఇబ్రహీంపట్నం ఖానాపూర్ గ్రామాల మధ్య సర్వేనెంబర్ 67లో 33ఎకరాల ఓవర్‌ల్యాపింగ్ భూమి ఉన్నదని నిర్ధారించారు. ఈ భూమిని గతంలో సర్వేనెంబర్ 80కింద మార్చుతూ అక్రమంగా పట్టాలు పొంది విక్రయించారని తేల్చారు. దీంతో 33 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి, ఎలాంటి క్రయవిక్రయాలు జరుపవద్దని ఆదేశించింది.

### 300 నుంచి 500 మంది..

జేబీ సంస్థ వెంచర్ నుంచి 300 నుంచి 500 మంది వరకు ప్లాట్లను కొన్నట్టు సమాచారం. ప్రభుత్వం వీటిని నిషేధిత జాబితాలో చేర్చడంతో కొనుగోలు చేసిన వారు అవస్థలు పడుతున్నారు. తమను నమ్మించి మోసం చేసిన కంపెనీ ఇప్పుడు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. తామంతా రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని లబోదిబోమంటున్నారు.

### బోర్డులు మాయమైనా చర్యల్లేవు

రెవెన్యూ అధికారులు సర్వే అనంతరం ఈ భూమికి హద్దురాళ్లను ఏర్పాటుచేసి 'ఈ భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నది' అంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన వారు ఆ బోర్డులను తొలగించినట్టు స్థానికులు చెప్తున్నారు. ఏర్పాటుచేసిన మూడు రోజులకే బోర్డులు మాయమైనా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదని స్థానికులు చెప్తున్నారు.

## మక్కల కొనుగోళ్లలో అక్రమాలపై విచారణ చేపట్టాలి

- పీఏసీఎస్ చైర్మన్, సీఈవోపై వెంటనే చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్‌కు స్థానిక రైతులు, బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు



మహబూబ్‌నగర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

జడ్చర్లటౌన్, జూలై 23 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని పత్తిమార్కెట్ యార్డులో బాదేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి అన్నదాతలకు న్యాయం చేయాలని కోరుతూ రైతులతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు గురువారం కలెక్టర్ కుష్బూగుప్తాను కలిసి ఫిర్యాదు చేశారు. జడ్చర్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మక్కజొన్న రైతుల వద్ద బాదేపల్లి పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ సంయుక్తంగా మక్కలు కొనుగోలు చేశారని, ఈ క్రమంలో రైతుల నుంచి ప్రతి 50 కిలోల బస్తాకూ 52 కిలోల తూకం వేశారని పేర్కొన్నారు. అదే విధంగా రైతుల నుంచే గోనె సంచులను కొనుగోలు చేయించినట్టు తెలిపారు. అంతేగాక ట్రాన్స్‌పోర్ట్, హమాలీల డబ్బుల భారాన్ని రైతులపైనే వేశారని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు నెలల తర్వాత మక్కల డబ్బుల చెల్లింపులో కోత విధించారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులు అమ్మిన మక్కలకు మార్క్‌ఫెడ్ చెల్లించిన డబ్బులకు వ్యత్యాసం ఉన్నదని, దీనిపై పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ అధికారులు ఎలాంటి సమాధానం ఇవ్వకుండా రైతులపైనే దురుసుగా మాట్లాడుతున్నారని తెలిపారు. మక్కజొన్న కొనుగోలులో అక్రమాలపై మహబూబ్‌నగర్ ఆర్డీవో, జడ్చర్ల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడిన పీఏసీఎస్ చైర్మన్, సీఈవోలపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## సీఎం వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

**ధన్వాడలో బీఎల్‌వోల నిరసన**

ధన్వాడ/హైదరాబాద్, జూలై 23: బీఎల్‌వోలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఎల్‌వోలు డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా ధన్వాడలో గురువారం బీఎల్‌వోలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. 'సర్' ప్రక్రియలో చిత్తశుద్ధితో పనిచేస్తుంటే తమను పని దొంగలంటూ విమర్శించడం తగదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నరహరి, బీఎల్‌వోలు రాణి, శారద, శ్రీలక్ష్మి, అర్చన, భూదేవి, శాంత, అనిత, సంతోష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగులపై సీఎం వ్యాఖ్యలు దుర్మార్గం

కిందిస్థాయి ఉద్యోగులైన బీఎల్‌వోలు నిద్రపోతున్నారు.. ఉచితంగా జీతాలు తీసుకుంటున్నారు అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి ఖండించారు. బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న వ్యక్తి అనుచితంగా మాట్లాడటం దుర్మార్గమని గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. భత్యం ఇవ్వకున్నా అనేక ఇక్కట్ల మధ్య 'సర్' విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్ల శ్రమను గుర్తించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎల్‌వోలు




## నీరులేక గోదావరి వెలవెల

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం కమ్మునూర్ శివారులోని గోదావరి నీరు లేక వెలవెలబోతున్నది. ఏటా జూలై చివరి వారంలో కమ్మునూర్ గోదావరి తీరం వరద ప్రవాహంతో కళకళలాడుతుండేది. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక.. పైనుంచి వరద రాక గోదావరి తీరం నీరు లేక బోసిపోయి కనిపిస్తున్నది. *- సారంగాపూర్*




# కేంద్రాన్ని మరచి.. కేటీఆర్‌పై చిందులు

- సీఎం రేవంత్ మరో అటెన్షన్ డైవర్షన్ డ్రామా
- కేంద్రాన్ని ప్రశ్నించేందుకు జంకుతున్న ముఖ్యమంత్రి
- బోడిగుండుకూ మోకాలికి ముడిపెట్టేలా వ్యాఖ్యలు
- టాపిక్ డైవర్షన్ కోసమే గ్లోబరీనా వివాదం తెరపైకి
- గ్లోబరీనాకు, కేటీఆర్‌కు లింకు పెడుతూ విమర్శలు
- వివాదం ఏదైనా కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): అబద్ధాలను సైతం అందంగా చెప్పి, నమ్మించడంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరితేరారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివాదం ఏదైనా దాన్ని తన రాజకీయ అవసరాలకు వాడుకోవడం ఆయనకు పరిపాటిగా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇందుకు రెండు రోజులుగా గ్లోబరీనా సంస్థపై, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చేస్తున్న విమర్శలను ఉదాహరణగా చూపుతున్నారు. కొడంగల్‌లో బుధవారం నిర్వహించిన ధర్నాలో గ్లోబరీనాకు కేటీఆర్‌కు లింకు పెడుతూ సీఎం తీవ్ర ఆరోపణలు చేశారు. అసెంబ్లీలో గురువారం నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లోనూ అవే ఆరోపణలు చేశారు. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థులు ఢిల్లీలో ఉద్యమిస్తుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ కొడంగల్ గల్లీలో గ్లోబరీనా సంస్థపై విమర్శలు చేశారు. సంబంధంలేని అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. గ్లోబరీనాకు, మాజీ మంత్రి కేటీఆర్‌కు లంకె పెడుతూ సంకుచిత వ్యాఖ్యలు చేశారు. నీట్ పేపర్ లీకేజీకి, గ్లోబరీనాకు, కేటీఆర్‌కు ఒకదానితో మరొకదానికి ఎలాంటి సంబంధం లేదు. అయినప్పటికీ సీఎం వ్యాఖ్యలు.. కేటీఆర్‌పై బురదజల్లాలి, ప్రజల్లో అసత్యాలను ప్రచారం చేయాలి అనే సంకుచిత రాజకీయాలకు నిదర్శనమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### బదనాం చేయాలనే బురదచల్లుడు

సీఎం రేవంత్‌రెడ్డి .. తన స్థాయిని మరచి టార్గెట్ కేటీఆర్‌గా పనిచేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేటీఆర్‌ను బదనాం చేయడమే లక్ష్యంగా సత్యాలు, అసత్యాలతో సంబంధం లేకుండా విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వివాదం ఏదైనా, ఎక్కడ జరిగినా దాన్ని అటు, ఇటు తిప్పి కేటీఆర్‌కు లింకు పెడుతున్నారని, బట్ట కాల్చి మీదేసే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కేటీఆర్ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఇది సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం మింగుడుపడటం లేదు. అందుకే కేటీఆర్‌ను టార్గెట్ చేస్తున్నారని, ఆయన మనోధైర్యాన్ని దెబ్బతీసేలా, ప్రజల్లో ఆయన పరువుకు భంగం కలిగే చర్యలకు పాల్పడుతున్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగానే బోడిగుండుకూ మోకాలికి ముడి పెట్టినట్టు నీట్ పేపర్ లీకేజీకి, గ్లోబరీనాకు, కేటీఆర్‌కు లింకు పెట్టారని విమర్శిస్తున్నారు. ప్రజల్లోకి తప్పుడు సమాచారాన్ని పంపి కేటీఆర్‌పై వ్యతిరేకత పెరిగేలా కుయుక్తులకు పాల్పడుతున్నారని అంటున్నారు. ఈ విధంగా కేటీఆర్‌ను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు.



### విద్యార్థుల డిమాండ్‌కు విరుద్ధంగా..

నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థులు ఢిల్లీలో ఆందోళన చేస్తున్నారు. వారికి సంఘీభావంగా కొడంగల్‌లో గురువారం ధర్నా చేసిన సీఎం రేవంత్‌రెడ్డి అసలు విషయం మాట్లాడకుండా ఈ వివాదాన్ని తన రాజకీయ అవసరాలకు వాడుకున్నాడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడా డిమాండ్ చేయలేదు. కేంద్ర ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట కూడా అనలేదు. కానీ కేటీఆర్‌ను టార్గెట్‌గా చేసుకొని వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడో జరిగిన వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చి గ్లోబరీనాకు కేటీఆర్‌కు లింకు పెట్టారు.

### కేంద్రంపై మాట్లాడేందుకు భయమా?

విద్యార్థులకు మద్దతుగా ధర్నా చేసిన కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ప్రధాని నివాసం ఎదుట ధర్నా చేశారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై మాట్లాడేందుకు జంకుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన పల్లెత్తు మాట కూడా అనడంలేదని, అసలు పేపర్ లీకేజీపై తీవ్రంగా స్పందించడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కొడంగల్‌లో బుధవారం చేసిన ధర్నా కూడా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీల అరెస్ట్‌కు వ్యతిరేకంగా చేశారే తప్ప.. కేంద్రానికి వ్యతిరేకంగా కాదని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి జంకుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే బీజేపీతో సీఎం సత్సంబంధాలను నెరపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎప్పటికైనా ఆయన బీజేపీలోకి వెళ్లేవారే అనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన కేంద్ర ప్రభుత్వంపై, బీజేపీపై ఎక్కువగా విమర్శలు చేయడంలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## ఢిల్లీలో అణచివేత చర్యలు గర్హనీయం

- నిర్బంధాల ద్వారా కాకుండా సంభాషణలు, చర్చల ద్వారానే డెమోక్రసీ బలోపేతం
- ఢిల్లీ కన్నాట్ ప్లేస్‌లో దుకాణాల బంద్, ఆంక్షలపై ఎక్స్‌లో హరీశ్‌రావు ఆగ్రహం



హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో నిరసనలు తెలుపుతున్న విద్యార్థుల డిమాండ్లను, వారి ఆవేదనను పాలకులు వినాలని, అణచివేత చర్యలతో వారి గొంతు నొక్కే ప్రయత్నాలు గర్హనీయమని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు హితవుపలికారు. విద్యార్థుల నిరసన ప్రదర్శనను అణచివేసేందుకు ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ వ్యాపార సముదాయాలను మూసివేయించడం, భారీగా బలగాలను మోహరించి భయానక వాతావరణాన్ని సృష్టించడం సరికాదని పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసుల, అధికారుల ఆంక్షలపై గురువారం ఎక్స్ వేదికగా ఆయన నిరసన వ్యక్తంచేశారు. 'ప్రజాస్వామ్యం అనేది నిర్బంధాలు, బారికేడ్ల ద్వారా కాకుండా నిరంతరం జరిగే చర్చలు, సంభాషణల ద్వారానే బలోపేతమవుతుంది. ఒక నిరసనను అడ్డుకోవడానికి భయాందోళనలు సృష్టించడం సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తుంది' అని ఆయన స్పష్టంచేశారు. సాయంత్రం 6:30 గంటలకల్లా కన్నాట్ ప్లేస్‌లోని దుకాణాలు, ఆఫీసులు, రెస్టారెంట్లను మూసివేయాలని, ఎటువంటి ఆస్తినష్టం, వినాశనం జరుగకుండా నివారించేందుకు యజమానులు సహకరించాలని కోరుతూ న్యూఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్డీటీఏ) అధ్యక్షుడు అతుల్ భార్గవ జారీచేసిన అత్యవసర సర్క్యులర్‌ను తన ట్వీట్‌కు జతచేశారు.

## ఉద్యమాన్ని అణచివేస్తే విస్ఫోటమే

- ఏం చేసినా చెల్లుతుందనే అహంకారం వద్దు
- విద్యార్థి ఉద్యమానికి మద్దతుగా ఎమ్మెల్సీ దేశపతి ఫైర్



హైదరాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ) : శాంతియుత ఉద్యమాన్ని అణచివేత చర్యలతో గానీ, రాజకీయ కుయుక్తులతో గానీ నొక్కేయాలని చూస్తే అది ప్రజావిస్ఫోటానికి దారితీసి, ప్రభుత్వ పునాదులనే కదిలిస్తుందని ప్రముఖ కవి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం 'ఎక్స్' వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన సుదీర్ఘ లేఖ రాస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోదీ గారూ.. మీరు ఇప్పటికైనా రాజకీయ ప్రయోజనాలకతీతంగా, విజ్ఞతతో వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉన్నది' అని సూచించారు. ఢిల్లీ వేదికగా దేశ యువత చేపట్టిన ఉద్యమం వెనుక ఎలాంటి రాజకీయశక్తుల ప్రమేయం లేదని, అది వారి బంగారు భవిష్యత్తు, ఆత్మగౌరవం కోసం స్వచ్ఛందంగా సాగిస్తున్న చారిత్రాత్మక సమరమని దేశపతి స్పష్టంచేశారు. యువత హృదయాల్లో రగులుతున్న తీవ్ర అసంతృప్తిని కేవలం ఒక నిరసనగా చూడకూడదని, దేశంలో సుపరిపాలన కోసం వారు వ్యక్తం చేస్తున్న ఆకాంక్షగా గుర్తించాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఉద్యమిస్తున్న నిరుపేద, నిరుద్యోగ యువత తమ హక్కుల పట్ల పూర్తి అవగాహనతో, గాంధేయ మార్గంలో శాంతియుతంగా పోరాడుతున్నారని దేశపతి కొనియాడారు. అధికారం శాశ్వతం కాదు.. అది ప్రజాస్వామ్యం ప్రసాదించిన ఒక బాధ్యత మాత్రమేనని హెచ్చరించిన దేశపతి, పాలకులు ఏం చేసి నా చెల్లుతుందనే అహంకారంతో ఉండటం మంచిది కాదని హితవు పలికారు.



ఇందిరాపార్క్ దగ్గర ధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు

## విద్యార్థుల కోసం బీఆర్ఎస్ పోరుబాట

- విద్యార్థి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించిన కేటీఆర్
- నేడు హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన
- హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విద్యార్థులు ఉప్పెనలా తరలివచ్చి.. విజయవంతం చేయాలని పిలుపు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో విద్యార్థుల పోరాటానికి మద్దతుగా బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమైంది. ఇటీవల యువ సంగ్రామ సదస్సు పేరిట నిరుద్యోగుల తరపున సరూర్‌నగర్‌లో సమరభేరి మోగించగా, తాజాగా దేశ రాజధానిలో విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ఉదయం 10గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానుండగా, అణచివేత, దమనకాండకు వ్యతిరేకంగా మోదీ సర్కార్‌పై నిరసన గళమెత్తనున్నారు. ఈ మేరకు విద్యార్థులు ఉప్పెనలా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

### విద్యార్థులకు అండగా కేటీఆర్

తన 50వ పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న కేటీఆర్ విద్యార్థి ఉద్యమానికి అండగా నిలువనున్నారు. హైదరాబాద్ వేదికగా తలపెట్టిన నిరసనలో ప్రత్యక్షంగా పాల్గొనాలని సంకల్పించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యార్థులు, నిరుద్యోగులకు చేస్తున్న అన్యాయాలను ఎలుగెత్తి చాటనున్నారు. నాడు ఓట్ల కోసం యువతకు అలవిగాని హామీలు గుప్పించి గద్దెనెక్కిన తర్వాత పాలకులు చేస్తున్న మోసాలను ఎండగట్టనున్నారు. తప్పుడు వాగ్దానాలిచ్చిన ప్రభుత్వాల మెడలు వంచే దిశగా కార్యోన్ముఖులను చేయనున్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత యువత కోసం చేపట్టనున్న కార్యక్రమాలు, ఉద్యోగాల భర్తీ, పరీక్షల నిర్వహణలో తీసుకువచ్చే సంస్కరణలపై స్పష్టమైన ప్రకటన చేయనున్నారు.

### కదిలిరానున్న యువతరం

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి విద్యార్థులు, నిరుద్యోగులు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలివస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల నిర్వహించిన యువ సంగ్రామ సదస్సు స్ఫూర్తితో చేపట్టిన కార్యక్రమం తప్పకుండా విజయవంతమవుతుందని నేతలు ధీమా వ్యక్తంచేశారు. పోలీసులు సైతం అడ్డుకోకుండా నిరసనకు సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

## బీఆర్ఎస్వీ నిరసనకు షరతులతో అనుమతి

### సిటీ పోలీసుల కఠిన ఆంక్షలు

హైదరాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ): ఢిల్లీ సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, పోలీసుల అక్రమ ప్రవర్తనను నిరసిస్తూ.. విద్యార్థులకు మద్దతుగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమానికి హైదరాబాద్ సిటీ పోలీసులు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సమర్పించిన విజ్ఞప్తి మేరకు కఠిన ఆంక్షలతో సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రక్షిత కే మూర్తి అనుమతినిచ్చారు. ధర్నా చౌక్‌లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే దీక్ష చేపట్టాలని, ధర్నాలో వెయ్యి మందికి మించి పాల్గొనడానికి వీలు లేదని, నిబంధనలకు విరుద్ధంగా జనం గుమిగూడవద్దని తెలిపారు.

## మోదీని కాపాడేందుకు రేవంత్ తిప్పలు

### రెడ్కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): నీట్ పేపర్ లీక్‌పై దేశమంతా, కాంగ్రెస్ అగ్రనేతలంతా ప్రధానమంత్రి నరేంద్రమోదీని ప్రశ్నిస్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం మోదీని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని రెడ్కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి విమర్శించారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రధాన్, ప్రధాని మోదీ వైఫల్యం ఉన్నదని దేశమంతా విమర్శిస్తుంటే.. రేవంత్ మాత్రం నీట్‌తో ఏమాత్రం సంబంధం లేని గ్లోబరీనా అనే కంపెనీ పేరును మధ్యలోకి తీసుకొచ్చి బీజేపీకి, మోదీకి రక్షకుడిగా మారిపోయారని మండిపడ్డారు. నీట్ పరీక్ష నిర్వహించేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థ అయితే, దాంతో కేటీఆర్‌కు ఏం సంబంధం? అని ప్రశ్నించారు. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా రాష్ట్ర కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఏ ర్యాలీలోనూ రేవంత్‌రెడ్డి కనిపించడం లేదని, మరి ఇప్పుడు ఆయన ఏ పార్టీలో ఉన్నట్టు? అని ప్రశ్నించారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, చిత్రంలో గెల్లు శ్రీనివాస్ యాదవ్, జయసింహ, తుంగ బాలు, రఘురాం, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేశ్, కృష్ణ, మహిపాల్, రాజేశ్, యశ్వంత్ తదితరులు

## పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్

హైదరాబాద్, జులై 23(నమస్తే తెలంగాణ) : నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నేత ముఠా జయసింహతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్‌లో వద్ద నిరసన తెలుపనున్నట్టు తెలిపారు. కేటీఆర్ తన పుట్టినరోజు వేడుకలను పూర్తిగా రద్దు చేసుకొని ఈ ధర్నాకు హాజరవుతారని పేర్కొన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ప్రధాని ఇంటి వద్ద ధర్నా చేస్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కొడంగల్‌లో దాక్కొన్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి పూర్తిగా మోదీ డైరెక్షన్‌లోనే పనిచేస్తున్నారని ఆరోపించారు.

### లాఠీచార్జ్ దారుణం : గెల్లు శ్రీనివాస్

నీట్ అవకతవకలపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బీజేపీ ప్రభుత్వం లాఠీచార్జ్ చేయడం దారుణమని బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. రాహుల్‌గాంధీకి చిన్న దెబ్బ తగిలితే స్పందించిన రేవంత్‌రెడ్డి.. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న నీట్ లీకేజీపై ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఢిల్లీలో విద్యార్థులపై మోదీ ప్రభుత్వం లాఠీచార్జ్ చేస్తే, తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దిల్‌సుఖ్‌నగర్‌లోని నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేస్తున్నదని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం రాజుకున్నదని, దీని సెగలు ప్రభుత్వాలకు తగలడం ఖాయమని బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తుంగ బాలు, గోపగాని రఘురాం, పల్లా ప్రవీణ్ రెడ్డి, శిగ వెంకటేశ్, వల్లమల కృష్ణ, కోట్ల మహిపాల్, రాజేశ్ నాయక్, యశ్వంత్ పాల్గొన్నారు.

## నీట్ లీకేజ్ తప్పే.. అందుకే మౌనంగా ఉన్నాం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): నీట్ పరీక్ష ప్రశ్నపత్రం విషయంలో తప్పు జరిగిందని అందువల్ల రీ ఎగ్జామ్ నిర్వహించామని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇన్నాళ్లు మౌనంగా ఉన్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంగీకరించారు. ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రెండోసారి అత్యంత పకడ్బందీగా పరీక్ష నిర్వహించామని, పేపర్ లీక్ అంశంపై కేంద్రం సీరియస్‌గా ఉన్నదని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే కేంద్రం చర్యలు తీసుకున్నదని, ఘటనకు బాధ్యులైన 17 మందిని అరెస్టు చేసినట్టు చెప్పారు. దీనికి కేంద్రమంత్రి ప్రధాన్ రాజీనామా ఒక్కటే పరిష్కారం కాదని పేర్కొన్నారు. కొన్ని రోజులుగా ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న ఘటనలు దురదృష్టకరం అని వాపోయారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్ సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీకి గుర్తుందా? అని నిలదీశారు.



అసెంబ్లీ బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు

## రేవంత్-మోదీ దగాపై బీఆర్ఎస్ సమరభేరి

- నీట్‌పై నిరసన తెలిపే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదు
- గ్రూప్ - 1 పరీక్షల తారుమారుపై సీఎం బాధ్యత వహించాలి
- నిరసనకు నిరుద్యోగులు భారీగా కదిలిరావాలి
- ఎమ్మెల్సీ దాసోజు పిలుపు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): నీట్ పేపర్ లీకేజీ, గ్రూప్-1 పరీక్షల తారుమారుతో విద్యార్థులు, నిరుద్యోగులను దగా చేసిన ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డిపై శుక్రవారం బీఆర్ఎస్ సమరభేరి మోగించనున్నదని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ ప్రకటించారు. గురువారం బీఆర్ఎస్ఎల్పీ ఆఫీస్‌లో విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగాల భర్తీలో ఘోరంగా విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డికి నీట్ లీకేజీ గురించి మాట్లాడే హక్కు ఎక్కడిదని దాసోజు ప్రశ్నించారు. కేటీఆర్ పుట్టినరోజును అట్టహాసంగా నిర్వహించేందుకు అభిమానులు, యువత, బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమైనా కేటీఆర్ వారించారని చెప్పారు. ఇది సంబురాలు చేసుకోవాల్సిన సమయం కాదు.. పోరాడాల్సిన సమయమని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు ఉపక్రమించారని పేర్కొన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### నిరుద్యోగులను ముంచిన రేవంత్‌రెడ్డి

ఏటా రెండు లక్షల ఉద్యోగాలిస్తామని గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని గాలికొదిలి నిండా ముంచారని శ్రవణ్ మండిపడ్డారు. 2 లక్షలు దేవుడెరుగు కనీసం 10వేల ఖాళీలు కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర మంత్రి ఎంతటి నేరస్తుడో.. రాష్ట్రంలో టీజీపీఎస్సీ ద్వారా జీవో 29 తెచ్చి గ్రూప్-1లో అక్రమాలకు కారకుడైన సీఎం సైతం అంతే పెద్దనేరస్తుడని విరుచుకుపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్‌కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి రాజీనామా కోరుతున్న రాహుల్‌గాంధీకి తెలంగాణలో అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో పోలీసుల దాష్టీకాలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో ఒక న్యాయం.. హైదరాబాద్‌లో మరో న్యాయమా? అని నిలదీశారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్, గ్రూప్-1లో అవకతవకలకు కారకుడైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని దాసోజు డిమాండ్ చేశారు.

## ఢిల్లీలో యువతపై లాఠీచార్జ్ తగదు

### కేంద్రంపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫైర్

### విద్యార్థులపై దాడులను నిరసిస్తూ బీఆర్ఎస్ ర్యాలీ



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 23 : ఢిల్లీలో యువతను బీజేపీ ప్రభుత్వం అణచివేస్తూ దాడులు చేస్తున్నదని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. నీట్ పేపర్ లీక్‌పై ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన నిరసనకు మద్దతుగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీక్‌లతో పిల్లల భవిష్యత్‌పై తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు 150 సార్లు పేపర్లు లీక్‌లు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల మళ్లీ పేపర్ లీక్ జరుగుతూనే ఉంటున్నాయని ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థులు, యువకులపై లాఠీచార్జ్ జరుగుతున్నా బీజేపీ, కాంగ్రెస్ నేతలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. విద్యార్థులు, యువత కదిలిరావడంతో రాహుల్ గాంధీ హడావుడిగా మద్దతు తెలుపుతూ నిరసన వ్యక్తం చేయడాన్ని తప్పుబట్టారు. నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలు రాష్ట్రాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ కూడా పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండి విద్యార్థి యువతకు మద్దతుగా నిరసన వ్యక్తం చేస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, పేపర్ లీక్ చేసిన వారికి కఠిన శిక్ష పడేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఢిల్లీ ఆందోళన సమయంలో విద్యార్థులు, యువతపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## మహిళా ప్రాతినిధ్యం ఏది?

### కేశవరావు కమిటీని నిలదీత

హైదరాబాద్, జులై 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక కమిటీలో మహిళలకు ఎందుకు ప్రాతినిధ్యం కల్పించలేదు. ఉద్యమంలో మహిళలు పాల్గొనలేదా? అని ఎంపిక కమిటీ చైర్మన్ కే కేశవరావు, ఇతర కమిటీ సభ్యులను మహిళలు నిలదీశారు. గురువారం ఉద్యమకారుల కమిటీ సమావేశంలో తమ అభిప్రాయాలు తెలుపడానికి పలువురు మహిళలు హాజరయ్యారు. కమిటీ ఎదుట మాట్లాడటానికి కూడా తమకు అవకాశమివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో చైర్మన్ కే కేశవరావు అసహనానికి గురై సమావేశం నుంచి రెండుసార్లు బయటికెళ్లి తిరిగొచ్చారు. అయినా శాంతించని మహిళలు ప్రశ్నలవర్షం కురిపించసాగారు. దీంతో అల్లరి చేయొద్దు, మీడియా సమావేశం ఉన్నదంటూ వారిపై అగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మహిళ తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయారు. ఉద్యమకారులను సాధ్యమైనంత త్వరగా గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కేశవరావు వెల్లడించారు.

## జర్నలిస్టుల బస్‌పాస్ గడువు పొడిగింపు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : జర్నలిస్టుల బస్‌పాస్ గడువును మరోసారి పొడిగించారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులు మంజూరు కాని రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టుల బస్‌పాస్‌ను మరో 12 రోజులు పొడిగిస్తున్నట్టు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ జీ ముకుందరెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 23 నుంచి ఆగస్టు 3వతేదీ వరకు పాత అక్రిడిటేషన్ కార్డుపైనే బస్‌పాస్‌లను రెన్యువల్ చేస్తున్నట్టు తెలిపారు.

## • లాఠీచార్జ్‌ను నిరసిస్తూ సీపీఐ ర్యాలీ




నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ని ఖండిస్తూ గురువారం హైదరాబాద్‌లో సీపీఐ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. లిబర్టీ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీలో కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. -హైదరాబాద్

## • ఖమ్మం, భద్రాద్రిలో గర్జించిన విద్యార్థులు



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు గురువారం భద్రాద్రి, ఖమ్మం కలెక్టరేట్లను ముట్టడించారు. కలెక్టరేట్లలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అనంతరం, కలెక్టరేట్ గేట్ల వద్దనే విద్యార్థులు బైఠాయించి నినాదాలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. -ఖమ్మం కమాన్‌బజార్/కొత్తగూడెం గణేశ్ టెంపుల్

# కాంగ్రెస్ పలాయనవాదం!

## విద్యాశాఖ కార్యదర్శిపై కేంద్రం బదిలీ వేటు

- విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్న నేపథ్యంలో కేంద్రం కంటితుడుపు చర్యలకు దిగింది. విద్యా శాఖ కార్యదర్శి వినీత్ జోషిపై బదిలీ వేటు వేసింది. ఆయనను పంచాయతీ రాజ్ శాఖకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్‌ను ఉన్నత విద్య కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పెద్దలను వదిలేసి అధికారులను బలిపశువులను చేస్తున్నారని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కేంద్ర మంత్రి ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాల్సిదేనని డిమాండ్ చేస్తున్నారు.

## నేడు విద్యార్థుల దేశవ్యాప్త నిరసనలు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో శాంతి యుతంగా నిరసన జరుపుతున్న విద్యార్థులపై పోలీసుల అమానుష దమనకాండను నిరసిస్తూ శుక్రవారం దేశ వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సీజేపీ పిలుపునిచ్చింది. ఈ సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం పొందాలని ఒక పక్క కేంద్రం ప్రయత్నాలు సాగిస్తున్నప్పటికీ ఆందోళన చేపట్టాలని సీజేపీ కోరింది. విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, పౌర సంస్థలు ప్రతి జిల్లాలో శాంతియుతంగా ఆందోళనలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

## ఢిల్లీలో 17 మెట్రో స్టేషన్లు మూసివేత

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో గత నాలుగు రోజులుగా విద్యార్థులు జరుపుతున్న ఆందోళనను పురస్కరించుకుని అధికారులు ముందు జాగ్రత్తగా 17 మెట్రో స్టేషన్లను మూసివేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. అందులో సుప్రీం కోర్టు మెట్రో స్టేషన్ కూడా ఉంది.

## రాహుల్ నిరసనల డ్రామా
### జంతర్ మంతర్ తప్ప అన్ని చోట్ల తిరుగుతున్న వైనం

న్యూఢిల్లీ, జూలై 23: నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారం, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేస్తున్న నిరసనలపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 20న విద్యార్థులు నిర్వహించిన చలో పార్లమెంట్ మార్చ్‌పై పోలీసుల అణచివేత చర్యలను ఖండించడంలో సైతం రాహుల్ స్పందనపై నెటిజన్లలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఢిల్లీ పోలీసుల అణచివేత చర్యలకు తీవ్రంగా గాయపడి దవాఖానలలో చికిత్స పొందుతున్న విద్యార్థులు, యువజనులను పరామర్శించడానికి రాహుల్ వెళ్లకపోవడం, కనీసం జంతర్ మంతర్‌ను సందర్శించి యువ నిరసనకారులను పలుకరించకపోవడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులపై పోలీసుల చర్య జరిగిన మరుసటి రోజున రాహుల్ తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాతో కలసి ప్రధాని నరేంద్ర మోదీ నివాసం సమీపంలో మెరుపు ధర్నాకు దిగడం, తదనంతరం అరెస్టు కావడం వంటి నాటకీయ పరిణామాలు విద్యార్థుల నిరసన ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ఆడిన డ్రామాగా నెటిజన్లు భావిస్తున్నారు. దీనిపై




ఢిల్లీలో ఇందిర స్మృతి వనం వద్ద నీట్ విద్యార్థుల మృతికి రాహుల్ శ్రద్ధాంజలి

ఆమరణ దీక్ష చేస్తున్న విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి సైతం నిజాయితీ కొరవడిన నిరసనగా అభివర్ణించడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళి అర్పించేందుకు గురువారం ఇండియా కూటమి నాయకులతో కలసి మూడు బస్సుల్లో సెంట్రల్ ఢిల్లీలోని గాంధీ స్మృతిని రాహుల్ సందర్శించడం సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారితీసింది. విద్యార్థుల ఆత్మహత్యలపై ఆలస్యంగా మేల్కొన్న కాంగ్రెస్ ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతను తనకు అనుకూలంగా మలచుకోవడానికి ప్రయత్నిస్తోందని నెటిజన్లు విమర్శిస్తున్నారు.

## కాంగ్రెస్ నిరసనల్లో నిజాయితీ లేదు..

- రాజకీయ ప్రయోజనాల కోసం వాంగ్‌చుక్ ప్రతిష్ఠను వాడుకుంటున్నారు
- ప్రజల్ని మభ్యపెట్టలేరు..చిత్తశుద్ధి లేనివారిని యువతే పంపించివేస్తుంది
- ప్రధాని నివాసం వద్ద రాహుల్ నిరసనపై వాంగ్‌చుక్ భార్య విమర్శలు



న్యూఢిల్లీ, జూలై 23: ప్రధాని మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన చేపట్టడాన్ని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ నిరసనల్లో నిజాయితీ లోపించిందని అన్నారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిరసనకు దిగినప్పుడే కాంగ్రెస్ కూడా వచ్చి నిరసనల్లో పాలుపంచుకుని ఉండాల్సిందని ఆమె అన్నారు. నిజమైన మద్దతును చూపించటంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని తప్పుబట్టారు. గురువారం ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, రాజకీయ నాయకులు ప్రధాని నివాసం వద్ద ప్రదర్శన చేపట్టే బదులు, జంతర్ మంతర్ నిరసనల్లో పాల్గొని ఉండాల్సిందని అన్నారు. రాహుల్‌గాంధీ నిరసనల్లో చిత్తశుద్ధి లోపించిందని, రాజకీయ ప్రయోజనాల కోసం వాంగ్‌చుక్ ప్రతిష్ఠను వాడుకున్నారని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలను మభ్యపెట్టడం ఇక సాధ్యం కాదని, చిత్తశుద్ధి, నిజాయితీ లేనివారిని యువతే పంపించేస్తారని అన్నారు. కేవలం ప్రతీకాత్మక చర్యలకు, నిజాయితీతో కూడిన విధానానికి మధ్య తేడాను ప్రజలు గుర్తించగలరని ఆమె అన్నారు. మంగళవారం ప్రశ్న పత్రాల లీకేజ్‌కు వ్యతిరేకంగా ప్రధాని నివాసం వద్ద రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. ఈ నిరసనలో ఆయా పార్టీల రాజకీయ నేతలు కూడా పాల్గొన్నారు. ఢిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలను బలవంతంగా అక్కడ్నుంచి తరలించటం రాజకీయంగా దుమారం రేపింది.







ఢిల్లీలో విద్యార్థుల నిరసనను ప్రభుత్వం అణచి వేయాలని ప్రయత్నించడంపై సోషల్ మీడియాలో కామెంట్లు, కార్టూన్ల ద్వారా ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

# దేశాన్ని కదిలించిన వాంగ్‌చుక్

- లద్దాఖ్ నుంచి జంతర్ మంతర్ వరకు స్ఫూర్తిదాయక జర్నీ!
- మంచు కొండల్లో పుట్టిన కార్చిచ్చుగా ప్రశంసలు

న్యూఢిల్లీ: జంతర్ మంతర్ వద్ద ఆందోళనల వెల్లువ... కేంద్ర ప్రభుత్వం అణచివేత.. పోలీసుల లాఠీచార్జ్.. జెన్ జీ తిరుగుబాటు. కొన్ని రోజులుగా దేశంలో ప్రధాన చర్చకు దారి తీస్తున్న అంశాలు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, విద్యార్థుల ఆత్మహత్యలకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ ప్రముఖ విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతో దేశంలోని యువత అట్టుడుకుతున్నది. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన దీక్ష 27 రోజులుగా కొనసాగుతున్నది. యావత్తు దేశం నలుమూలల నుంచి యువత తండోపతండాలుగా తరలివస్తున్నది. బీజేపీ పాలనపై జరిగిన తిరుగుబాట్లలో ప్రధానమైన ఉద్యమమిదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల భవితవ్యాన్ని అంధకారం చేసేలా పరీక్షల నిర్వహణలో అలసత్వం కొనసాగుతున్నదంటూ ప్రజలు, విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు, టీచర్లు, విద్యావేత్తలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ఈ మొత్తం పోరాటం సీజేపీ వేదికగా జరుగుతున్నది. మరోవైపు దేశాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చిన వాంగ్‌చుక్ ఎవరు? ఆయన నేపథ్యమేంటి? అనే చర్చ విస్తృతంగా నడుస్తున్నది.

▶▶ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వాంగ్‌చుక్ 1988లో సొంత సంస్థ సెక్మోల్ ద్వారా లద్దాఖ్‌లోని విద్యావ్యవస్థను సమూలంగా మార్చారు. 2014లో హిమాలయ ప్రాంతాల్లో తీవ్ర నీటి కొరతను ఎదుర్కొనేందుకు ఆయన స్థాపించిన ఐస్ స్థూప సాంకేతికత ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది.

▶▶ 2019లో జమ్ము కశ్మీర్ ప్రత్యేక హోదాను రద్దు చేసి లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చినప్పటి నుంచి



వాంగ్‌చుక్ ఉద్యమబాట పట్టారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా ఇవ్వడం, గిరిజన ప్రాంత రక్షణలు కల్పించడం, స్థానికులకు భూమి, ఉద్యోగాల భద్రత అందించడం లాంటి వాటి కోసం పోరాడుతున్నారు.

▶▶ పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన హిమాలయాల్లో అభివృద్ధి పేరుతో భారీ గనుల తవ్వకాలు జరిగితే లద్దాఖ్ మనుగడే ప్రమాదంలో పడుతుందని సోనమ్ వాంగ్‌చుక్ బలంగా వాదిస్తున్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం గత రెండేండ్లలో రెండుసార్లు నిరాహార దీక్ష చేపట్టి, జైలు కెళ్లి ఇటీవలే విడుదలయ్యారు.

## కేంద్రం హామీతో దీక్ష విరమణ

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్ ఘటనలకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో 26 రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్న వాంగ్‌చుక్ గురువారం అర్ధరాత్రి దీక్ష విరమించారు. కేంద్ర మంత్రులు జితేంద్ర సింగ్, జేపీ నడ్డాలతో జరిగిన చర్చల్లో పలు డిమాండ్లకు మోదీ సర్కార్ సమ్మతించటం వల్లే ఆయన దీక్షను విరమించారు. మరోవైపు శుక్రవారం క్యాబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకుంటామంటూ ప్రధాని మోదీ అర్ధరాత్రి వీడియో సందేశాన్ని విడుదల చేశారు. జంతర్‌మంతర్ వేదికగా వాంగ్‌చుక్ ప్రారంభించిన దీక్షకు దేశవ్యాప్తంగా మద్దతు లభించింది. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించటంతో కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం దవాఖానకు తరలించారు. అప్పట్నుంచి దవాఖానలోనే ఆయన దీక్ష కొనసాగుతుంది.

## మేకులున్న లాఠీలతో విద్యార్థులపై దాడి!
### ఆల్ట్ న్యూస్ ఫ్యాక్ట్‌చెక్‌లో వెల్లడి



న్యూఢిల్లీ : జూలై 20న కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ మార్చ్‌లో విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దాడులు తీవ్ర వివాదానికి దారి తీసిన సంగతి తెలిసిందే. కొంతమంది పోలీసులు మేకులున్న లాఠీలతో విద్యార్థులపై దాడి చేశారంటూ రెండు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వీడియో నిజం కాదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. దీనిపై పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ ఢిల్లీ పోలీసులకు మద్దతు తెలిపింది. ఆ వీడియో ఫేక్ అని, పోలీసులు మేకులున్న లాఠీలను వాడలేదని తెలిపింది. అయితే ఆల్ట్ న్యూస్ మాత్రం తన కథనంలో ఈ వీడియోలు నిజమే అని పేర్కొంది.

**పెల్లెట్ గన్స్‌తో విద్యార్థులపై దాడులు**

ఛలో సంసద్‌లో పాల్గొన్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు విచక్షణా రహితంగా దాడులు చేశారంటూ అనేక ఆధారాలు బయటకొస్తున్నాయి. గురువారం కొందరు విద్యార్థులు తమపై పెల్లెట్ గన్స్‌తో పోలీసులు దాడి చేశారంటూ చెప్పారు. ఢిల్లీకి చెందిన 25 ఏండ్ల యువకుడు ఇండియా టుడేతో మాట్లాడుతూ.. తాను పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొన్నప్పుడు పోలీసులు తనపై పెల్లెట్ గన్స్ తో దాడి చేసినట్టు తెలిపారు. సఫ్దర్ గంజ్ దవాఖాన నివేదికలు కూడా ఇదే చెప్తున్నాయన్నారు. ఓ 19 ఏండ్ల యువకుడు మాట్లాడుతూ పెల్లెట్ గన్స్ దాడి వల్ల ఒక కన్ను చూపు మందగించినట్టు తెలిపాడు. పెల్లెట్ గన్స్ దాడితో మరో యువకుడు గాయపడ్డట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ బయటపెట్టింది. తమతో పాటు మరింత మందిపై ఈ దాడులు జరిగినట్టు వీరు చెబుతున్నారు.

## నాలుగో రోజూ స్తంభించిన పార్లమెంట్

**పట్టువీడని విపక్షం, మెట్టు దిగని పాలకపక్షం ▪ చర్చ లేకుండానే నేటికి వాయిదా**

న్యూఢిల్లీ, జూలై 23: నీట్ పేపర్ లీక్‌పై నిరసనలు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ విపక్షాలు తమ ఆందోళన కొనసాగించడంతో పార్లమెంట్ ఉభయ సభలు గురువారం వరుసగా నాలుగవ రోజు కూడా స్తంభించిపోయాయి. ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే లోక్‌సభ, రాజ్యసభ శుక్రవారానికి వాయిదా పడ్డాయి. సభ వెలుపల ప్రతిపక్ష, అధికార పక్ష ఎంపీలు పరస్పర నిరసనలు తెలిపారు. ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశమైనపుడు నీట్ పేపర్ లీక్ అంశం, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల చర్యకు నిరసనగా విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు వాయిదాపడిన సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా సభ్యుల నిరసనలు ఆగకపోవడంతో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. రాజ్యసభలో కూడా నినాదాలు పెరిగాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. చర్చకు విపక్షం సిద్ధంగా ఉందని, ప్రధాన్ ముందుగా రాజీనామా చేయాలని ఆయన స్పష్టం చేశారు. పలుమార్లు సభ వాయిదాపడి తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితి సద్దుమణగకపోవడంతో సభాధ్యక్ష స్థానంలో ఉన్న హరివంశ్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

### నాడు విద్యార్థి నాయకుడిగా పోరాటం
## నేడు విద్యా మంత్రిగా ఆరోపణలు
### పేపర్ లీక్‌లు కేంద్రంగా ప్రధాన్ రాజకీయాలు

న్యూఢిల్లీ, జూలై 23: ప్రస్తుతం వివాదాలకు కేంద్ర బిందువైన కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. 1997లో విద్యార్థి నాయకుడిగా చేసిన రాజయాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. అప్పట్లో ఒడిశా సచివాలయం బయట దాదాపు 1,500 మంది విద్యార్థులతో కలసి ఆందోళన చేసి లాఠీచార్జ్‌లో ఎముకలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. ఏబీవీపీలో చురుకుగా పాల్గొన్న ఆయన 1994 నుంచి 1997 వరకు ఆ సంఘానికి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత అదే ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర విద్యా శాఖ మంత్రిగా నీట్ యూజీ 2026 పేపర్ లీక్ కేసుపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, విపక్ష నాయకుల నుంచి రాజీనామా డిమాండ్లతో తీవ్ర నిరసనను ఎదుర్కొంటున్నారు.

## జంతర్ మంతర్‌కు భారీగా ఆహారం

న్యూఢిల్లీ, జూలై 23: జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఆహారం ఎలా? అర్ధాకలితోనే వారు నిరసన కొనసాగిస్తున్నారా? అన్న సందేహం అందరికీ రావడం సహజం. అయితే అక్కడి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అడగకపోయినా దేశ విదేశాల నుంచి సానుభూతితో వందలాది మంది ఆన్‌లైన్‌లో ఆహారాన్ని ఆర్డర్ ఇచ్చి ఆందోళనకారుల ఆకలిని తీరుస్తున్నారు. తమకు వస్తున్న ఆదరణను చూసి ఆశ్చర్యానికి గురయ్యామని నిర్వాహకులు సైతం తెలిపారు. ఆందోళనలో పాల్గొంటున్న నిరసనకారులకు దేశవ్యాప్తంగా పలు చోట్ల నుంచి, అలాగే విదేశాల నుంచి కూడా పలువురు పెద్ద మొత్తంలో ఆహార పదార్థాలను స్విగ్గీ, జొమాటో లాంటి ఫుడ్ యాప్‌ల ద్వారా పంపుతున్నారు. ఇలా పంపుతున్న ఆహారంలో ఎక్కువగా పిజ్జాలు, బర్గర్లు, మోమోలు ఉంటున్నాయి.

# మేమంతా మీ వెంటే..
### విద్యార్థులకు సినీ, క్రీడా, సాహితీ ప్రముఖుల మద్దతు

న్యూఢిల్లీ, జూలై 23: నీట్-యూజీ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు పలువురు సినీ ప్రముఖులు మద్దతు ప్రకటించారు. విద్యార్థులకు మద్దతుగా ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఉదయం ట్వీట్ చేసిన అనంతరం వీరు స్పందించడం గమనార్హం. ఇలా స్పందించిన వారిలో నటీనటులు కమల్ హాసన్, సోనూ సూద్, దియా మీర్జా, అదితి రావు హైదరీ, ప్రకాశ్ రాజ్, నటి, నిర్మాత నందితా దాస్, సినీ రచయిత్రి సుతాప సిక్దార్, భూమి ఫడ్నేకర్, సోనాక్షి సిన్హా, కీడా ప్రముఖులు యువరాజ్ సింగ్, అభినవ్ బింద్రా, మనూబాకర్, నిఖత్ జరీన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎక్స్‌లో, ఇన్‌స్టాలో, మీడియాతో వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

**విద్యార్థులకు లాఠీలెదురైతే ఆ దేశం విఫలమైనట్టే**

'ఒక పిల్లవాడు ఏడ్చినప్పుడు మనం తప్పక వినాలి. అయితే చాలామంది పిల్లలు చనిపోయేంత వరకు మనం ఎదురు చూస్తూ ఉన్నాం. నేర్చుకోవడం స్థానంలో శిక్షణ, జిజ్ఞాస స్థానంలో నేర ప్రవృత్తి చోటుచేసుకునే



వ్యవస్థ కుళ్లిపోయింది. సమాధానాలకు బదులుగా అడ్డంకులు, లాఠీలు ఎదురయ్యాయంటే ఆ దేశం విఫలమైనట్టే. విద్యార్థుల కోసం ఆమరణ దీక్ష చేస్తున్న సోనమ్ వాంగుచుక్ వెంటనే దీక్ష విరమించాలి.

– నటుడు, రాజకీయ నేత కమల్ హాసన్

**ఓటమి పరవాలేదు.. మోసం చేయకూడదు..**

ఓటమి పరవాలేదు. మోసం చేయకూడదు. విజయం కోసం అడ్డదారులు తొక్కవద్దని మా నాన్న చెప్పేవారు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కలేదని విద్యార్థులు నిరాశ చెందటం సహజం. మళ్లీ ఇలాంటి చేదు అనుభవాలు ఎదురుకాకుండా మనందరం సమిష్టిగా కృషి చేయాలి. సమాజంలో పెద్దలుగా, మన సంస్కృతిని సరైన మార్గంలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

– సచిన్ టెండూల్కర్, మాజీ క్రికెటర్

## తక్షణం జంతర్ మంతర్‌ను ఖాళీ చేయండి
### విద్యార్థులకు కేంద్రం హుకుం!

న్యూఢిల్లీ, జూలై 23: ఢిల్లీలో విద్యార్థులు ఆందోళన చేస్తున్న జంతర్ మంతర్ వేదికను ఖాళీ చేయాలంటూ కేంద్రం గురువారం హుకుం జారీ చేసినట్టు తెలిసింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌తో జంతర్ మంతర్ కేంద్రంగా జరుగుతున్న ఆందోళన కేంద్రంలో అలజడి సృష్టిస్తున్నది. నిన్నమొన్నటి వరకు వీరి ఆందోళనను మోదీ ప్రభుత్వం తేలిగ్గా తీసుకున్నప్పటికీ సోమవారం వీరు నిర్వహించిన చలో పార్లమెంట్ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీయడం, ఆ సందర్భంగా జరిగిన పరిణామాలు దేశ, ప్రపంచ దృష్టిని ఆకర్షించడంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. దీంతో విద్యార్థులను ఎలాగైనా ఆ ప్రదేశం నుంచి ఖాళీ చేయించడానికి ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. ఒక వేళ వారు స్వచ్ఛందంగా ఖాళీ చేయకపోతే పోలీస్ చర్య ద్వారా అయినా వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టాలని యోచిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## అల్లర్లలో పాల్గొంటే పాస్‌పోర్ట్ రద్దు!
### ఢిల్లీ పోలీసుల నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 23: హింసాత్మక నిరసనల్లో పాల్గొన్న వారిపై కఠిన వైఖరిని అవలంబించేందుకు ఢిల్లీ పోలీసులు సంసిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఉన్న చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు అల్లర్లలో పాల్గొన్నట్లు తేలిన వ్యక్తులపై పోలీసులు పాస్‌పోర్ట్ రద్దు ప్రక్రియలను కూడా ప్రారంభిస్తారు. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఈనెల 20న చలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పార్లమెంట్ చుట్టూ ఉన్న భద్రతా బారికేడ్లను నిరసనకారులు ఛేదించేందుకు ప్రయత్నించడంతో చెలరేగిన హింస నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో భద్రతా దళాలు బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీచార్జ్‌లకు పాల్పడటం, అల్లర్ల నిరోధక వాహనాలను మోహరించడం వంటివి చేశాయి.

## ఢిల్లీ పోలీసులు ఎవరినైనా అరెస్టు చేయొచ్చు!
### ఎన్ఎస్ఏ కింద అక్టోబర్ 18 వరకు అధికారం పొడిగింపు

న్యూఢిల్లీ, జూలై 23: యువ నిరసనకారులపై పోలీసు అధికారాల దుర్వినియోగం జరిగిందంటూ కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఆరోపిస్తున్న నేపథ్యంలో కఠినమైన జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద ఢిల్లీ పోలీసులకు ఉన్న ముందస్తు నిర్బంధ అధికారాన్ని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సందు అక్టోబర్ 18 వరకు పొడిగించారు. ఎన్ఎస్ఏలోని సెక్షన్ 3 ఉప సెక్షన్(2) కింద నివారణ చర్యగా ఎవరినైనా నిర్బంధించే అధికారాన్ని నగర పోలీసు కమిషనర్‌కు కల్పిస్తూ ఢిల్లీ ప్రభుత్వ హోం శాఖ జూలై 15న నోటిఫికేషన్ జారీచేసింది. ఈ అధికారాలు అక్టోబర్ 18 వరకు చెల్లుబాటు అవుతాయని నోటిఫికేషన్ పేర్కొంది.

## జంతర్ మంతర్ వద్ద మొబైల్ ఇంటర్నెట్ నిలిపివేత
### కన్నాట్ ప్లేస్‌లో దుకాణాల మూసివేత

న్యూఢిల్లీ, జూలై 23: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన కొనసాగుతున్న క్రమంలో నిరసనకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు 1.5 కి.మీ పరిధిలో గురువారం అర్ధరాత్రి వరకు మొబైల్ ఇంటర్నెట్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. అలాగే హోం మంత్రి అమిత్ షా ఇంటి బయట సెక్షన్ 163ను అమలు చేసిన పోలీసులు ఆ ప్రాంతంలో హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని న్యూఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ సలహా మేరకు కన్నాట్ ప్లేస్‌లో సాయంత్రం 6.30 గంటలకే దుకాణాలు, వ్యాపార సంస్థలు, హోటళ్లను మూసివేశారు.

## డ్రగ్స్ కేసు పెట్టి..శాశ్వతంగా లోపలేస్తా..
### నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులను బెదిరించిన ముంబై పోలీస్ అధికారి

ముంబయి, జూలై 23: మహారాష్ట్రలో విద్యార్థుల ఆందోళనను అక్కడి పోలీసులు అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారు. 'నిరసనల్లో మళ్లీ పాల్గొంటే మీ మీద డ్రగ్స్ కేసు పెట్టి..శాశ్వతంగా లోపలేస్తా' అంటూ ఓ పోలీస్ అధికారి ముంబైలో కొంతమంది విద్యార్థులను బెదిరిస్తున్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. 'నేను మీ బ్యాగుల్లో 50 గ్రాముల మాదక ద్రవ్యాల పౌడర్‌ను పెడితే చాలు..మీ లైఫ్ ఖతం' అంటూ సదరు పోలీస్ అధికారి విద్యార్థులను బెదిరించటం ఆ వీడియోలో స్పష్టంగా కనపడింది. దీనిపై స్పందించిన ముంబయి పోలీసులు, సదరు పోలీసు అధికారిని సస్పెండ్ చేసి..విచారణ చేపట్టారు.



## పోలీస్ వ్యాన్‌కు అడ్డుగా నిలిచిన అసామాన్యురాలు
### ముంబై విద్యార్థి నిరసనల్లో ఘటన

ముంబై: బుధవారం ముంబై శివాజీ పార్క్ వద్ద నిరసనల్లో ఒక సామాన్య మహిళ చూపిన ధైర్యం, ధిక్కార స్వరం దేశం యావత్తు చూసింది. అక్కడ విద్యార్థులను అరెస్టు చేసి పోలీస్ వ్యాన్‌లో తీసుకెళ్తుండగా..ఆ వ్యాన్ ముందుకు వెళ్లకుండా ఆమె అడ్డుకున్న తీరు సంచలనంగా మారింది. 'మీ హక్కుల గురించి కచ్చితంగా తెలిసివుండాలి' అంటూ సామాన్య మహిళ రియా అహిర్ చేసిన నినాదానికి పోలీసులు దిగిరాక తప్పలేదు. వ్యాన్‌లో ఉన్న విద్యార్థులు, ఇతర నిరసనకారులను విడుదల చేయాల్సి వచ్చింది. కేంద్ర మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని రియా డిమాండ్ చేశారు.

## కఠిన చర్యలపై క్యాబినెట్‌లో నిర్ణయం

- గత రెండున్నర నెలల్లో అనేక చర్యలు తీసుకున్నాం
- అర్ధరాత్రి ప్రధాని మోదీ వీడియో ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 23: దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న నీట్ పేపర్ లీకేజ్‌పై ప్రధాని మోదీ ఎట్టకేలకు స్పందించారు. నీట్ పేపర్ లీక్‌పై కఠిన చర్యలు ఉంటాయని ప్రధాని మోదీ ప్రకటించారు. నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. 'ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించా. శుక్రవారం కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నాం. పేపర్ లీకేజ్ ఘటనపై గత రెండున్నర నెలల్లో అనేక సమర్థవంతమైన చర్యలు తీసుకున్నాం. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేయాలని సంబంధిత శాఖలను ఆదేశించా' అని చెప్పారు. నీట్ పేపర్ లీక్ కేసులో నిందితులను పట్టుకున్నామని, విద్యార్థుల విద్యా సంవత్సరం వృధా కాకుండా చూడాలన్న ప్రభుత్వ బాధ్యతను తాము నెరవేర్చామని చెప్పారు.



**ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు**

దీనికంటే ముందు పరీక్ష లీకేజీ కేసుల్లో సకాలంలో విచారణ జరిపేందుకు ప్రభుత్వం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తుందని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా గురువారం ప్రకటించారు. ప్రధాని ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తున్నట్టు ఢిల్లీ హైకోర్టు ప్రకటించింది. పబ్లిక్ పరీక్షల చట్టం (అక్రమ పద్ధతుల నివారణ) పరిధిలోకి వచ్చే నేరాలు, సంబంధిత కేసులను ఈ ఫాస్ట్ ట్రాక్ కోర్టు విచారిస్తుందని పేర్కొంది.



## 2024 నీట్ లీక్.. కింగ్‌పిన్‌కు క్లీన్‌చిట్

- సంజీవ్ తప్పేం లేదన్న సీబీఐ
- ఆధారాల్లేవని చెప్పిన అధికారులు

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా నీట్ యూజీ -2026 లీక్ మీద తీవ్ర నిరసనలు జరుగుతున్న సమయంలో.. 2024 నీట్ పేపర్ లీక్ కేసులో కీలక సూత్రధారికి సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. 2024లో నీట్-యూజీ పేపర్ లీక్ అవడంలో కీలక సూత్రధారిగా సంజీవ్ కుమార్‌ను అప్పట్లో బీహార్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీబీఐకి కేసు అప్పగించిన తర్వాత.. రెండేండ్లుగా విచారణ జరిపి సంజీవ్ కుమార్ పేపర్ ప్రమేయం లేదని గురువారం క్లీన్‌చిట్ ఇచ్చింది. అతను అంతకు ముందే వేరేపేపర్ల లీకేజీ కేసుల్లో నిందితుడిగా ఉండటం వల్ల పోలీసులు అనుమానించినట్టు తెలిపింది. పాట్నా కోర్టులో 45 మంది నిందితులపై చార్జ్‌షీట్లను దాఖలు చేసినట్టు సీబీఐ వెల్లడించింది.



### ఢిల్లీ ఆందోళనలో పాల్గొనేందుకు
## హైదరాబాద్ నుంచి ఒంటరిగా..

న్యూఢిల్లీ: బయటకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పిన హైదరాబాద్ యువతి ఏకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యార్థుల ఆందోళన వద్దకు వెళ్లి పాల్గొనడం ఆశ్చర్యపరిచింది. ఫ్లయిట్ అటెండెంట్‌గా పనిచేస్తున్న దిశా శర్మ ఇటీవల ఇంట్లోంచి బయలుదేరి నేరుగా ఢిల్లీ వెళ్లే విమానం ఎక్కేసింది. విమానం ఎక్కే ముందు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో షేర్ చేసింది. ఢిల్లీ వెళ్లేందుకు హైదరాబాద్‌లో ఒంటరిగా విమానం ఎక్కానని, చాలా భయమేస్తున్నదని ఆమె పేర్కొంది. ఢిల్లీ వెళ్లడానికి తన ప్రయాణ చార్జీల కోసం విరాళాలు సేకరించినట్టు తెలిపింది. అంతేకాకుండా జంతర్ మంతర్ వద్ద నిరసనలో ఉన్న వారికి అందజేసేందుకు తాను మందులు, నిత్యావసరాలు కూడా సేకరించి పట్టుకెళ్తున్నట్టు తెలిపింది. తనకు ఢిల్లీలో ఎవరూ తెలియదని, ఆందోళనకారులతోనే ఉంటానని పేర్కొంది.

# ప్రశ్నించిన పాపానికి రాజేందర్‌రెడ్డి మృతి

- మానకొండూరు ఎమ్మెల్యే పీఏ వేధింపులతో ఈనెల 14న ఆత్మహత్యాయత్నం
- దవాఖానలో చికిత్స పొందుతూ మృత్యువాత
- నిందితులను అరెస్ట్ చేయాలంటూ కరీంనగర్‌లో బంధువుల ధర్నా
- కవ్వంపల్లి పీఏ మురళీధర్‌రెడ్డితో పాటు ఐదుగురిపై కేసు
- పీఏ ఇంటిపై దాడికి యత్నించిన వారిపై పోలీసుల లాఠీచార్జ్



కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన ఎదుట ధర్నాలో కూర్చున్న రాజేందర్‌రెడ్డి భార్య సమత, కుటుంబసభ్యులు, గ్రామస్తులు

తిమ్మాపూర్, జూలై 23: మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పీఏ వంగాల మురళీధర్‌రెడ్డి వేధిస్తున్నాడంటూ ఈనెల 14న ఆత్మహత్యాయత్నం చేసిన బేతెల్లి రాజేందర్‌రెడ్డి బుధవారం అర్ధరాత్రి దవాఖానలో మృతిచెందాడు. దీంతో గుండ్లపల్లితో పాటు కరీంనగర్‌లో గురువారం ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సమత భర్త రాజేందర్‌రెడ్డి (44)కి గ్రామంలోనే సిమెంట్ ఇటుకల షాప్ ఉంది. ఈ నెల 13న మధ్యాహ్నం ఆయన షాప్ వద్ద సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామానికి చెందిన పైడిపల్లి మల్లేశం, బిగుళ్ల శ్రవణ్ మద్యం తాగుతుండగా, అక్కడి నుంచి వెళ్లిపోవాలని రాజేందర్‌రెడ్డి కోరాడు. దీంతో ఘర్షణ చెలరేగి రాజేందర్‌రెడ్డి ఫోన్‌ను పగులగొట్టారు. అక్కడే ఉన్న మహ్మద్ సాదిక్ ముగ్గురిని సముదాయించి, వాళ్లతో సెల్‌ఫోన్ కొనిస్తామని చెప్పించాడు. మరుసటి రోజు మహ్మద్ సాదిక్, పైడిపల్లి మల్లేశం, బిగుళ్ల శ్రవణ్‌తో కలిసి ఎమ్మెల్యే పీఏ మురళీధర్‌రెడ్డి గన్నేరువరం పోలీస్ స్టేషన్‌లో రాజేందర్‌రెడ్డిపై ఫిర్యాదు చేసి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారు. గ్రామంలో అన్యాయాలపై ప్రశ్నిస్తున్న కారణంగానే ఎమ్మెల్యే పీఏ మురళీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తనపై కేసు నమోదు చేయించారని కుటుంబసభ్యులకు రాజేందర్‌రెడ్డి చెప్పుకొని బాధపడ్డాడు. ఆ తర్వాత తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నాడు. తనకు అన్యాయం చేస్తున్నారంటూ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే స్థానికులు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆ తర్వాత ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రాజేందర్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న గుండ్లపల్లి గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో దవాఖాన వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే పీఏతోపాటు మరో నలుగురిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోస్టుమార్టం నిర్వహించకుండా అడ్డుకొని ఆందోళనకు దిగారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ కుటుంబసభ్యులకు నచ్చజెప్పి ఫిర్యాదు తీసుకున్నారు. రాజేందర్‌రెడ్డి భార్య సమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. వంగాల మురళీధర్‌రెడ్డి, వంగాల రవీందర్‌రెడ్డి, వడ్లూరుకు చెందిన మహ్మద్ సాదిక్, పైడిమల్ల మల్లేశం, బిగుళ్ల శ్రవణ్‌పై ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌లో బీఎన్‌ఎస్ సెక్షన్ 108కింద కేసు నమోదు చేశారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ మరోసారి బంధువులు దవాఖాన ఎదుట రోడ్డుపై ధర్నాకు దిగారు. అరెస్ట్ చేస్తామని ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రాజేందర్‌రెడ్డి మృతదేహాన్ని అంబులెన్సులో గుండ్లపల్లికి తరలించారు.

### గుండ్లపల్లిలో స్వల్ప లాఠీచార్జ్

రాజేందర్‌రెడ్డి స్వగ్రామం గుండ్లపల్లి వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. రాజేందర్‌రెడ్డి మృతదేహాన్ని ఎస్కార్ట్ మధ్యన గుండ్లపల్లికి తరలించారు. ఇదే సమయంలో కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు రాజీవ్ రహదారిని దిగ్బంధించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పీఏ మురళీధర్‌రెడ్డి ఇంటిపై దాడికి యత్నించారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. అనంతరం పోలీస్ పహారా మధ్యన రాత్రి సమయంలో రాజేందర్‌రెడ్డికి అంత్యక్రియలు పూర్తి చేశారు.

### న్యాయం చేయకపోతే చచ్చిపోతం..

మానకొండూర్ ఎమ్మెల్యే పీఏ మురళీధర్‌రెడ్డి వేధింపుల కారణంగానే తన భర్త రాజేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని బేతెల్లి సమత రోదించింది. పీఏ మురళీధర్‌రెడ్డితోపాటు నిందితులను అరెస్ట్ చేయకపోతే నా బిడ్డ, కొడుకుతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించింది.

### రాజేందర్‌రెడ్డిది హత్యే..



రాజేందర్‌రెడ్డిది హత్యేనని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. అధికార పార్టీ ఎమ్మెల్యే పీఏను ప్రశ్నించడంతోనే రాజేందర్‌రెడ్డిని వేధించారని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేవరకూ బీఆర్‌ఎస్ తరఫున అండగా ఉంటామని స్పష్టంచేశారు. ఈ మేరకు అమెరికాలో ఉన్న ఆయన ఒక వీడియో రిలీజ్ చేశారు. రాజేందర్‌రెడ్డి మరణం బాధాకరమని విచారం వ్యక్తంచేశారు. పీఏ వేధింపులపై ఎమ్మెల్యేకు చెప్పుకొనేందుకు వెళ్తే కనీసం స్పందించకపోవడంతోనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్టు పేర్కొన్నారు. రాజేందర్‌రెడ్డి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## డీజీపీ ఆఫీసులో హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో స్వామి బలవన్మరణం
- బెట్టింగ్ వ్యసనం, లోన్ యాప్స్‌లో రుణాలే కారణం
- భార్యాపిల్లలను వేధిస్తే దయ్యమై పగతీర్చుకుంటానంటూ సూసైడ్ నోట్



హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్ బాస్ కార్యాలయంలోనే గురువారం ఓ హెడ్ కానిస్టేబుల్ తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకోవడం పోలీస్‌శాఖను కలవరపెట్టింది. డీజీపీ కార్యాలయంలోని షోగార్డ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా వేరుకొండలయ్య స్వామి(41) విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం ఉదయం 6.30 గంటలకు విధులకు వచ్చిన స్వామి, వాష్‌రూమ్‌కు వెళ్లి అక్కడే తన సర్వీస్ పిస్టల్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే విచారణ చేపట్టిన పోలీసులకు సూసైడ్ లెటర్ లభించింది. విషయం తెలిసిన వెంటనే డీజీపీ సీవీ ఆనంద్ కార్యాలయానికి చేరుకొని పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకొని, దర్యాప్తు వేగవంతం చేయాలని సైఫాబాద్ పోలీసులను ఆదేశించారు. హెడ్‌కానిస్టేబుల్ స్వామికి ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ఆసక్తి ఉన్నట్టు తోటి సిబ్బంది చెబుతున్నారు. లోన్‌యాప్స్‌ను ఆశ్రయించి ఈఎంఐలు చెల్లించలేక ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నారు.

### గతంలోనే మూడుసార్లు..

కాగా, ప్రస్తుతం లంగర్‌హౌస్‌లో ఉంటున్న స్వామి గతంలోనూ మూడుసార్లు ఆత్మహత్యాయత్నం చేసినట్టు అతని భార్య మౌనిక పోలీసులకు తెలిపారు. బుధవారం ఉదయం డ్యూటీకి వెళ్లాడని, గురువారం తిరిగి రావాల్సి ఉందని చెప్పారు. ఈ క్రమంలో స్వామి ఆత్మహత్య చేసుకున్నట్టు గురువారం ఉదయం కొండాపూర్ బెటాలియన్ కార్యాలయం నుంచి సమాచారం అందించారని తెలిపారు. హుటాహుటిన తాను డీజీపీ కార్యాలయానికి చేరుకోగా.. కార్యాలయంలోని వాష్‌రూమ్‌లో తన భర్త విగతజీవిగా పడి ఉన్నాడని ఆమె చెప్పారు. తన భర్త ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

### భార్యాపిల్లలను వేధిస్తే దయ్యమై వస్తా!

స్వామి రాసిన సూసైడ్‌నోట్‌లో .. 'ప్రియమైన శ్రీమతికి.. నీకు లేఖ రాస్తానని ఎప్పుడూ అనుకోలేదు.. నువ్వంటే నాకు చాలా ఇష్టం. ఈ ప్రపంచంలో నువ్వే నా బెస్ట్ ఫ్రెండ్‌వి. అందరూ నన్ను వద్దనుకున్నా నువ్వు మాత్రం కావాలనుకున్నావు.. అదొక్కటి చాలు ఈ జీవితానికి. నీతో ఇంకా జీవించాలని ఉంది. కానీ, ఈ దేవుడు నన్ను ఉండనీయడం లేదు. ఈ నిర్ణయం నాది మాత్రమే. నువ్వే లేకపోయింటే.. ఇన్ని రోజులు ఉండేవాడిని కాదు. ఇప్పుడు జీవిస్తున్న బతుకు నీదే. నీ కోసమే ఇన్నిరోజులు ఉన్నాను. ఐ లవ్యూ మౌనిక. ఐ మిస్‌యూరా.. హని అండ్ మణి'మామ్‌జీ'కి సపోర్ట్‌గా ఉండండి. నా ఆత్మకు శాంతి కలుగాలంటే నా భార్యాపిల్లలను ఎవరూ ఏమీ అనొద్దు. ఇదే నా చివరి కోరిక. ఏదైనా తప్పు చేసి ఉంటే నేను మాత్రమే చేశాను. వాళ్లను ఏమీ అనొద్దు. ఇది నా చివరి కోరిక. ఎవరైనా నా భార్యా పిల్లలను బెదిరించినా, హింసించినా దయ్యం అయ్యి వాళ్లను వదిలిపెట్టను' అని రాసుకొచ్చాడు.

## నా చావుకు కారణం మోదీనే..

- 'సర్' ఫామ్‌పై సూసైడ్ లెటర్ రాసి.. వాట్సాప్ స్టేటస్ పెట్టి..
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో యువకుడి ఆత్మహత్య



పిట్ల వంశీ రాసి స్టేటస్‌గా పెట్టుకున్న సూసైడ్ నోట్



పిట్ల వంశీ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 23: తన మరణానికి ప్రధానినరేంద్రమోదీ కారణం అంటూ ఎస్‌ఐఆర్ ఫారమ్‌పై సూసైడ్ నోట్ రాసి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పిట్ల బాలయ్య–భారతవ్వ దంపతులకు కొడుకు వంశీ(25), కూతురు పూజ ఉన్నారు. ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగాలేని కారణంగా డిగ్రీ మొదటి సంవత్సరంలోనే వంశీ చదువు ఆపేశాడు. పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకొని పడుకున్నాడు. గురువారం ఉదయం తల్లిదండ్రులు తలుపు తీసి చూసేసరికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే అప్పటికే బీఎల్‌వో ఇచ్చిన ఎస్‌ఐఆర్ ఫారమ్‌లో సూసైడ్ లెటర్ రాసి రాత్రి 11.30 గంటలకు తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. సదరు లేఖలో తన చావుకు కారణం కుటుంబం కాదని, కేవలం నరేంద్రమోదీనేనని పేర్కొన్నాడు. ఎవరినీ ఇబ్బందులు పెట్టకుండా తన దహన సంస్కారాలు ఆనవాయితీగా జరిపించాలని రాశాడు. తన ఆందోళనను అర్థం చేసుకుంటారని, చావాలంటే భయమైతున్నదని అందులో పేర్కొన్నాడు. అలాగే, అంతకు ముందు బ్లేడ్‌తో చేతి మణికట్టుపై, గొంతుపై కోసుకునే ప్రయత్నం చేసుకున్నట్టు తెలుస్తున్నది. చివరకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లేఖ చివర్లో ఇట్లు భారత పౌరుడు, వంశీ రాయల్, జైహింద్, థాంక్యూ గవర్నమెంట్ అంటూ ముగించాడు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఉద్యమ తీరును వంశీ ఫోన్, టీవీల్లో చూస్తూ భావోద్వేగానికి గురయ్యాడా ? అనే అనుమానాలు ఉన్నాయి. కాగా, వంశీ ఉపయోగించిన ఫోన్ గదిలో లభించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. కాగా, వంశీ తన తల్లితో బుధవారం సాయంత్రం గొడవ పెట్టుకున్నట్టు సమాచారం. ఇదే విషయమై తన కుమారుడి మృతికి కారణాలపై దర్యాప్తు చేయాలని తండ్రి బాలయ్య ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి తెలిపారు.

### వంశీది కేంద్ర ప్రభుత్వ హత్యే..

పిట్ల వంశీది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ హత్యే అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. అంతకుముందు వంశీ మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన తనను పోలీసులు అడ్డుకోవడంతో వారితో వాగ్వాదానికి దిగారు. . వంశీ మృతిపై కేటీఆర్ ఆరా తీసినట్టు తెలిపారు.

### బీఆర్‌ఎస్ ర్యాలీకి అనుమతి.. ఎల్లారెడ్డిపేట ఎస్సైపై వేటు

రాజన్న సిరిసిల్ల, జూలై 23 (నమస్తే తెలంగాణ): తన చావుకు మోదీని కారణమంటూ వంశీ ఆత్మహత్య చేసుకోగా, నిరసనగా బీఆర్‌ఎస్ నేతలతో పాటు స్థానికులు ర్యాలీ చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో ఆందోళన చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బీజేపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. ర్యాలీకి అనుమతి ఎలా ఇస్తారని ఓ కేంద్ర మంత్రి నేరుగా సిరిసిల్ల పోలీసులు ఉన్నతాధికారులకు ఫోన్ చేసినట్టు సమాచారం. వెంటనే సదరు పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీరియస్ అయినట్టు సమాచారం. దీంతో ఎల్లారెడ్డిపేట ఎస్‌ఐ రాహుల్‌రెడ్డిని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. మరికొంత మందికి కూడా పోలీసులు నోటీసులు జారీచేసి వివరణ కోరినట్టుగా తెలుస్తున్నది. ఒకటి, రెండు రోజుల్లో వారిపై కూడా చర్యలు ఉంటాయని తెలుస్తున్నది. ర్యాలీ చేస్తున్న సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా తాము చర్యలు తీసుకుంటే.. తమపైనే వేటు వేయడం ఏమిటని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంలో కేంద్ర మంత్రి చెప్పిన వెంటనే.. పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారా..? ..రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో కేంద్ర మంత్రికి సహకరించిందా..? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

## రోడ్డు విస్తరణలో ఇల్లు పోతున్నదని..

- గుండెపోటుతో కుప్పకూలి మహిళ మృతి
- నోటీసులతో మనోవేదనకు గురైన మధురవ్వ
- కరీంనగర్ జిల్లాలో విషాదం



బుర్ర మధురవ్వ (ఫైల్)

చిగురుమామిడి, జూలై 23: రోడ్డు విస్తరణలో తన ఇల్లు పోతున్నదని ఓ మహిళ తీవ్ర ఆందోళన చెందింది. నోటీసులు వచ్చినప్పటి నుంచి అదే మనోవేదనతో తల్లడిల్లింది. చివరకు గురువారం గుండెపోటుతో కుప్పకూలి ప్రాణాలు కోల్పోయింది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వరకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. హుస్నాబాద్ నుంచి కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి వరకు ఇటీవల పనులు ప్రారంభించారు. సుందరగిరిలో 40 ఫీట్ల మేర రోడ్డు విస్తరించాలని గ్రామ ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి తీర్మానం చేశారు. అప్పుడే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లకు మార్కింగ్ ఇవ్వడంతోపాటు నోటీసులు అందజేశారు. కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న బుర్ర మధురవ్వ (55)కు కూడా నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చెందింది. నెల రోజులు గా ఇదే విషయం అందిరికీ చెప్పుకొంటూ బాధపడుతున్నది. గురువారం కూరగాయలు అమ్ముకొని ఇంటికి వచ్చిన వెంటనే గుండెపోటుతో కుప్పకూలింది. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ జంగ శిరీష, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి పరామర్శించారు.




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

## బాలికల గురుకులంలో ఫుడ్ పాయిజన్

- బెల్లంపల్లిలో 30 మంది విద్యార్థినులకు అస్వస్థత
- ఏడుగురి పరిస్థితి విషమం
- మంచిర్యాలలో చికిత్స

బెల్లంపల్లి, జూలై 23 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం ఉడకబెట్టిన బఠానీలను అల్పాహారంగా అందించారు. రాత్రి భోజనం చేసిన కొద్దిసేపటికే కడుపునొప్పి, వికారంతో 30 మంది విద్యార్థినులు వాంతులు చేసుకున్నారు. వెంటనే సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కోలుకున్న కొందరిని గురుకులానికి తీసుకువచ్చారు. గురువారం ఉదయం మరికొందరు వాం తులు చేసుకోగా వారిని కూడా దవాఖాన కు తరలించారు. కొందరికి గురుకుల పాఠశాలలోనే షంషీర్‌నగర్ అర్బన్ హెల్త్ సెంట ర్ వైద్య సిబ్బంది వైద్యం అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న ఏడుగురిని మంచిర్యాలలోని ఏరియా దవాఖానకు తరలించారు. విద్యార్థినులను డీఎంహెచ్ వో నరేందర్ రాథోడ్, ప్రోగ్రామ్ అధికారి సుధాకర్ పరామర్శించారు. అనంతరం పాఠశాలకు వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించారు. ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి వాసురామ్ ఆధ్వర్యంలో ఆహారపదార్థాలు, నీటి శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపించారు. బీసీ గురుకుల పాఠశాలల ఆర్‌సీవో శ్రీధర్, డీసీవో శిరీష వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉడకని ఆహారం, పరిశుభ్రత లేని పరిసరాలతోనే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, ఇందుకు బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు.

## అనారోగ్యంతో సమ్మక్క పూజారి మృతి



సిద్ధబోయిన పాపారావు (ఫైల్)

తాడ్వాయి, జూలై 23 : అనారోగ్యంతో సమ్మక్క ఆలయ పూజారి సిద్ధబోయిన పాపారావు (60) గురువారం మధ్యాహ్నం మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పలు దవాఖానల్లో చికిత్స పొందారు. మధ్యాహ్న సమయంలో ఆరోగ్యం విషమించడంతో ఇంటి వద్దనే మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాపారావు భౌతికకాయానికి పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావుతో పాటు పలువురు నివాళులర్పించారు.

## రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజు

వనస్థలిపురం, జూలై 23: రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నాయకోటి రాజు ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని హస్తినాపురం కేకే గార్డెన్స్‌లో ఎన్నికలు నిర్వహించారు. సమీప అభ్యర్థి పోరెపల్లి నాగరాజుపై ఆయన 28 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. తనను గెలిపించిన సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## కెమెరామెన్‌ను పెండ్లాడిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు

లక్నో, జూలై 23: ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సోషల్‌మీడియాలో క్రియాశీలకం గా ఉండే ముగ్గురు అక్కాచెల్లెళ్లు...వారి రీల్స్ తీసే కెమెరామెన్‌ను పెండ్లి చేసుకోవటం సంచలనంగా మారింది. ఓ ఆలయంలో జరిగిన వీరి వివాహానికి సంబంధించి వీడియో, ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. యూపీలోని అమ్రోహా జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ధౌరియా గ్రామానికి చెందిన అల్కా, దేవిక, సంతోష్‌లు అక్కాచెల్లెళ్లు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లలో వీరికి ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువగానే ఉంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులనే పెండ్లి చేసుకుంటామని తల్లిదండ్రులకు తొలుత చెప్పారట. ఏమైందో తెలియదుగానీ, ఈ ముగ్గురూ కెమెరామెన్ వికాస్‌ను ఓ ఆలయంలో వివాహం చేసుకోవటం..స్థానికంగా సంచలనం రేపింది. ముగ్గురు అక్కాచెల్లెళ్లలో ఇద్దరు తోబుట్టువులు.

# హైడ్రాపై మిలిటరీ యాక్షన్ తప్పదు

మొదటిపేజీ తరువాయి...

మరో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై గురువారం జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ విచారణ జరిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రైవేట్ ఆస్తులకు దూరంగా ఉండాలని గతంలోనే రంగనాథ్‌ను ఆదేశించామని పేర్కొన్నారు. అయినా మరోసారి కూల్చివేతలు చేపట్టడంపై మండిపడ్డారు. 'ఈ వివాదంలో కోర్టు ఇప్పటికే రెండుసార్లు ఉత్తర్వులు వెలువరించింది. వాటిని లెక్కచేయకుండా మూడోసారి హైడ్రా అధికారులు తమ భూమిలోకి ప్రవేశించారని పిటిషనర్ చెప్తున్నారు. ఒకే వ్యవహారంపై వరుసగా మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు కావడం అత్యంత తీవ్రమైన విషయం' అని ధర్మాసనం తీవ్రస్థాయిలో మండిపడింది. గత విచారణకు రంగనాథ్ నేరుగా హాజరయ్యారని, మరోసారి ఆ భూమిలో అడుగుపెట్టబోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ మళ్లీ ఆ భూమిలోకి హైడ్రా అధికారులు వెళ్లడం అంటే న్యాయవ్యవస్థను అవమానించడమే అవుతుందని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఆయనను దూరంగా ఉండమని చెప్పండి. లేదంటే కేంద్ర హోంశాఖకు, రక్షణ మంత్రిత్వశాఖకు చెప్పి ఆర్మీని రంగంలోకి దించుతాం' అని వ్యాఖ్యానించారు. ఒక ఐపీఎస్ అధికారి ఇలా చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయనకు ప్రభుత్వం అండ ఉండొచ్చని, అంతమాత్రాన ప్రైవేట్ ఆస్తిలోకి వెళ్లొచ్చని కాదని చెప్పారు. ఆ స్థలం ఆర్మీజోన్‌లో ఉన్నది కాబట్టి దాని రక్షణకు ఆర్మీనే రంగంలోకి దించాలని, ఈ మేరకు బైసన్ విభాగం సీనియర్ గ్రేడ్ బ్రిగేడియర్‌తో సంప్రదింపులు జరుపాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించారు. సబ్ లెఫ్టినెంట్ హోదా ఉన్న అధికారి నేతృత్వంలో లాన్స్‌నాయక్ హోదా ఉన్న 10 మంది ఆర్మీ సిబ్బందిని అక్కడ మోహరించాలని, వారి పేర్లను శుక్రవారం ఇవ్వాలని కోరాలని పేర్కొన్నారు.

### ఆర్మీ బ్యారక్స్‌లో పడేస్తే..

ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదాస్పద భూమిలోకి హైడ్రా వెళ్లరాదని, అవసరమైతే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని తాము గతంలోనే సూచించామని జస్టిస్ అనిల్‌కుమార్ గుర్తుచేశారు. కానీ, అలా చేయకుండా మళ్లీ ఆ ప్రాంతంలోకి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. 'మీరు చట్టానికి అతీతులని అనుకుంటున్నారా?' అని ప్రశ్నించారు. మేమేంటో చూపిస్తామంటూ వ్యాఖ్యానించారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఎవరైనా అక్కడ అడుగుపెడితే అదుపులోకి తీసుకొని, ఆర్మీ బ్యారక్‌లో పడేయాలని సైన్యానికి సూచిస్తామని పేర్కొన్నారు. వారి వాహనాలను కూడా సీజ్ చేయాలని, ఆ తర్వాత వారిని కోర్టు ముందు హాజరుపరచాలని కోరుతామని చెప్పారు. 'మా తీర్పును అమలు చేయాలని మిమ్మల్ని బతిమిలాడుకోవాల్సిన అవసరం కోర్టుకు లేదు. ఇది న్యాయస్థానాన్ని తీవ్రంగా అవమానించడమే. ఈ దేశ న్యాయవ్యవస్థ శక్తి ఏమిటో కూడా ఆయనను తెలుసుకోనివ్వండి' అని వ్యాఖ్యానించారు.

### ప్రభుత్వంపై నమ్మకం పోయింది

సాధారణంగా ఆర్మీని రంగంలోకి దించకూడదనే విషయం తమకు తెలుసని, అయితే న్యాయపాలనలో భాగంగా తప్పడం లేదని జస్టిస్ అనిల్‌కుమార్ వ్యాఖ్యానించారు. 'ఇలాంటి విషయాల్లో సైన్యం జోక్యం చేసుకోరాదన్న స్పృహ కోర్టుకు ఉన్నది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం లేకపోవడంతో ఆర్మీకి ఆదేశాలు ఇవ్వాల్సి వస్తున్నది' అని పేర్కొన్నారు. 'ఒక సీనియర్ ఐపీఎస్ అధికారే మా ఆదేశాలను పట్టించుకోవడం లేదు.



ఇక రాష్ట్రంలోని మిగతా అధికారులు పట్టించుకొంటారని ఎలా అనుకుంటాం' అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏం జరుగుతున్నదో సచివాలయంలో కూర్చొన్నవారికి కూడా తెలియాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

### అరాచకం రాజ్యమేలుతుంది

హైడ్రాను ఇలాగే వదిలేస్తే రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతుందని ధర్మాసనం తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేసింది. బయట ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తూ, కోర్టుకు వచ్చి నచ్చిన రీతిలో సమాధానం ఇస్తున్నారని మండిపడింది. రాష్ట్రంలో ఇలాంటి అరాచకం కొనసాగడానికి వీల్లేదని స్పష్టంచేసింది. 'అసలు రెవెన్యూలో మీకేం పని?' అని ప్రశ్నించింది. 'మీరు కావాలంటే ఏదైనా చేసుకోండి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఒత్తిడి వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ సైన్యాన్ని రంగంలోకి దింపుతాం' అని న్యాయమూర్తి స్పష్టంచేశారు.

### కోర్టుకిచ్చిన హామీ ఉల్లంఘన

తొలుత పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం హరీశ్‌కుమార్ వాదనలు వినిపించారు. మరోసారి పిటిషనర్ స్థలంలోకి వెళ్లబోమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ నెల 20న హైకోర్టులో హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దానిని ఉల్లంఘిస్తూ ఈ నెల 22న హైడ్రా యంత్రాంగం పిటిషనర్ స్థలంలోకి వచ్చిందని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోల ఆధారాలను కోర్టుకు సమర్పించారు. వాటిని న్యాయమూర్తికి అందజేశారు. ఈ నెల 21న పిటిషనర్ తన స్థలంలో పునరుద్ధరణ పనులు చేపట్టగా హైడ్రా అధికారులు, పోలీసులతో వచ్చి పనుల్లో జోక్యం చేసుకొన్నారని చెప్పారు. అప్పీల్ వేయబోతున్నామని, ఎలాంటి పనులు చేపట్టరాదని హెచ్చరించారని తెలిపారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపించారు. హైడ్రా అధికారులు వివాదాస్పద స్థలంలోకి వెళ్లలేదని పేర్కొన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషనర్ సమర్పించిన ఫొటోల్లో హైడ్రా వాహనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఫొటోలను ఏ సమయంలో, ఏ తేదీన తీశారో కూడా వాటిపై ఉన్నదని పేర్కొన్నారు. ఇది కచ్చితంగా కోర్టు ఉత్తర్వుల ప్రత్యక్ష ఉల్లంఘనే అవుతుందని తేల్చిచెప్పారు.

### ఏజీ వినతితో ఉత్తర్వుల జారీ నిలుపుదల

కోర్టు ఉత్తర్వులు సాయంత్రానికి అందుబాటులోకి వస్తాయనే దశలో అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి జోక్యంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. ఆయన విచారణకు హాజరై, పిటిషనర్‌కు చెందిన భూమిలోకి హైడ్రా అధికారులు వెళ్లబోరని హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారు. దీంతో న్యాయమూర్తి స్పందిస్తూ, అధికారి అఫిడవిట్ దాఖలు చేసిన తర్వాత పరిశీలిస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. దీంతో ఉత్తర్వుల జారీ నిలిచిపోయింది.

### చట్టానికి లోబడి ఉండాల్సిందే

ప్రభుత్వమైనా చట్టానికి లోబడి ఉండాల్సిందేనని జస్టిస్ అనిల్‌కుమార్ స్పష్టంచేశారు. డివిజన్ బెంచ్ తీర్పు అమల్లో ఉండగా ప్రైవేట్ భూమిలోకి ఎలా ప్రవేశిస్తారని నిలదీశారు. ప్రభుత్వ భూమిని రక్షించే పేరుతో ఏ చట్ట నిబంధనల ప్రకారం కోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వమైనా, ప్రభుత్వ అధికారులైనా చట్టానికి అతీతులు కాదని, కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం రాజ్యాంగ బద్ధ బాధ్యత అని గుర్తుచేశారు. గత విచారణ సమయంలో ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కావని హామీ ఇవ్వడంతో కోర్టు వెసులుబాటు కల్పించిందని పేర్కొన్నారు. అందుకు విరుద్ధంగా హైడ్రా చర్యలు ఉన్నాయంటే, న్యాయవ్యవస్థ నిర్వహణలో ఉద్దేశపూర్వకంగా జోక్యం చేసుకోవడమేనని తప్పుబట్టారు. కోర్టు ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధంగా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని, కానీ ఉత్తర్వులు అమల్లో ఉన్నంతకాలం వాటిని తప్పనిసరిగా పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ దశలో మరోసారి అదనపు ఏజీ ఖాన్ కల్పించుకొని చివరిసారిగా మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా, న్యాయమూర్తి తోసిపుచ్చారు. వివాదాస్పద స్థలం రక్షణ కోసం ఆర్మీని రంగంలోకి దింపాలంటూ ఆదేశాలను డిక్టేట్ చేశారు. ఉత్తర్వుల ప్రతులను కేంద్ర హోం, రక్షణ మంత్రిత్వ శాఖలకు, బైసన్ విభాగానికి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని సూచించారు.

# గురుకులంలో డైరెక్ట్ రిక్రూట్ 30 శాతమే

## ప్రమోషన్ల ద్వారానే 70% పోస్టులు భర్తీ • గతంలో 70% నేరుగా నియామకాలు

**ఎస్సీ గురుకుల సొసైటీ నిబంధనల్లో మార్పులు**

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**సెక్రటరీ అధికారాలకు కూడా కత్తెర**

**ఎస్సీ శాఖ మంత్రికే సర్వాధికారాలు**

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): ఇప్పటికే డిసెండింగ్ ఆర్డర్‌ను పాటించకుండా, రిలిక్విష్‌మెంట్‌ను అమలు చేయకుండా గురుకుల అభ్యర్థులకు తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ సర్కార్.. తాజా నిర్ణయంతో వారిని మరింత నిరాశపరిచింది. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని వివిధ క్యాడర్లలో డైరెక్టు రిక్రూట్‌మెంట్ పోస్టులను 30 శాతానికే పరిమితం చేసింది. 70% పోస్టులను ప్రమోషన్ల ద్వారానే భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇటీవల సొసైటీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్(బీజీ)లో ప్రతిపాదనలకు ఆమోదం తెలుపగా, తాజాగా ఉత్తర్వులను ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీ శారద జారీచేశారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో డిగ్రీ కాలేజీలు, జూనియర్ కాలేజీలు, గురుకుల పాఠశాలలు, సీవోఈలు, ప్రత్యేక గురుకులాలు అన్నీ కలిపి 268 గురుకులాలు ఉన్నాయి. అందులో లెక్చరర్లు, ప్రిన్సిపాల్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచర్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, ఫిజికల్ డైరెక్టర్ తదితర కీలక పోస్టులున్నాయి. ఆయా పోస్టులను తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) ఆధ్వర్యంలోనే భర్తీ చేస్తారు. ప్రస్తుతం ఎస్సీ గురుకుల సొసైటీలో ఆయా పోస్టుల భర్తీకి సర్వీస్ రూల్స్, నియామక విధివిధానాల నిబంధనలకు కీలక సవరణలు చేసింది. ఆయా ప్రతిపాదనలపై ఇటీవల నిర్వహించిన సొసైటీ బీజీ మీటింగ్‌లో ఆమోదం తెలుపగా, తాజాగా ఉత్తర్వులు వెలువరించింది. మొత్తంగా ఎస్సీ గురుకుల సొసైటీలో డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసే పోస్టులను భారీగా కుదించింది. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, పీడీ గ్రేడ్-2 పోస్టుల్లో కేవలం 30% మాత్రమే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు. 70% పోస్టులను ప్రమోషన్ల ద్వారానే భర్తీ చేస్తారు. డిగ్రీ ప్రిన్సిపాల్, గ్రేడ్-1 ప్రిన్సిపాల్ పోస్టులను 100% ప్రమోషన్ల ద్వారానే భర్తీ చేసేలా నిబంధనలను సవరించింది.




**మంత్రికే సర్వాధికారాలు**

ఏ సొసైటీలో లేని విధంగా పలు ఉన్నతస్థాయి పోస్టుల నియామకానికి సంబంధించి ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీకి ఉన్న అధికారాలకు సైతం ప్రభుత్వం కత్తెర వేసింది. ఎస్సీ గురుకుల సొసైటీ చైర్మన్‌గా వ్యవహరించే ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రికే ఆ నియామక అధికారాలను కట్టబెట్టింది. అడిషనల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, గ్రేడ్-1, గ్రేడ్-2 ప్రిన్సిపాల్ నియామకానికి సంబంధించి పూర్తి అధికారాలు ఇప్పటివరకు సొసైటీ వైస్ చైర్మన్, (సెక్రటరీ)కి ఉన్నాయి. ప్రస్తుతం వైస్ చైర్మన్, సెక్రటరీ అధికారాలకు ప్రభుత్వం కత్తెర వేసింది. చైర్మన్‌గా వ్యవహరించే మంత్రికి నియామక అధికారాలను కట్టబెట్టింది. ఈ మేరకు బీజీలో నిర్ణయించింది. సంబంధించిన ఉత్తర్వులను సొసైటీ సెక్రటరీ తాజాగా జారీ చేశారు. సొసైటీ జోనల్ సిస్టమ్‌లో కూడా పలు మార్పులు చేశారు. ప్రస్తుతం 7జోన్లు, 2 మల్టీజోన్లు, 1 స్టేట్ ఆఫీసర్ పోస్టు ఉన్నాయి. అయితే, వాటిని యథాతథంగానే కొనసాగిస్తూ, జోన్ 3, 4, 6ను మాత్రం ఈస్ట్, వెస్ట్‌గా విభజించింది. గురుకుల సీట్ల కేటాయింపునకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అమలు చేయాలని నిర్ణయించింది.

**ఎస్సీ గురుకులాల్లో గతంలో అమలైన, ప్రస్తుతం జారీ చేసిన జీవో ప్రకారం వివిధ క్యాడర్ పోస్టుల భర్తీ విధానం**

| క్యాడర్ | గతంలో | | ప్రస్తుతం | |
|---|---|---|---|---|
| | ప్రమోషన్ | డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ | ప్రమోషన్ | డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ |
| డిగ్రీ ప్రిన్సిపాల్ | 30% | 70% | 100% | - |
| గ్రేడ్-1 ప్రిన్సిపాల్ | 70% | 30% | 100% | - |
| డిగ్రీ లెక్చరర్ | 30% | 70% | 70% | 30% |
| జూనియర్ లెక్చరర్ | 50% | 50% | 70% | 30% |
| పీజీటీ | 50% | 50% | 70% | 30% |
| టీజీటీ | 50% | 50% | 70% | 30% |
| పీడీ గ్రేడ్-2 | 50% | 50% | 70% | 30% |

## నత్తనడకన 'సర్' డిజిటలైజేషన్

- గ్రేటర్‌లో దయనీయం.. 10 రోజులే గడువు
- హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 50శాతం దాటలే
- అగ్రస్థానంలో యాదాద్రి జిల్లా

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్), ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. సీఈవో కార్యాలయం గురువారం సాయంత్రం 6 గంటల వరకు వెల్లడించిన అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఎన్యుమరేషన్ ఫారామ్ (ఈఎఫ్)లను 100% పంపిణీ చేసినప్పటికీ, వాటిని సేకరించి ఆన్‌లైన్‌లో డిజిటలైజ్ చేసే ప్రక్రియ వేగంగా సాగడం లేదు. రాష్ట్రంలోని మొత్తం 3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 2,41,32,992 (71.34%) మంది ఫారాలు మాత్రమే డిజిటలైజ్ అయ్యాయి. ఇంకా 28.66% మంది ఓటర్ల వివరాలు డిజిటలైజ్ కావాల్సి ఉన్నది. ఈఎఫ్‌ల సమర్పణకు ఆగస్టు 3 చివరి తేదీ కావడంతో మిగిలిన 10 రోజుల స్వల్ప వ్యవధిలో ఈ భారీ ప్రక్రియను పూర్తిచేయడం బీఎల్వోలకు, అధికార యంత్రాంగానికి పెను సవాలుగా మారింది. ప్రస్తుతం ఈఎఫ్‌ల డిజిటలైజేషన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రథమ స్థానంలో నిలువగా.. హైదరాబాద్ జిల్లా చిట్టచివరి స్థానంలో ఉన్నది.

## కాజీపేట- బల్హార్షా ట్రిప్లింగ్ పనులు పూర్తి

**దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్**

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : రూ.3వేల కోట్ల వ్యయంతో కాజీపేట- బల్హార్షా మధ్య 203 కి.మీ మేర ట్రిప్లింగ్, విద్యుదీకరణ పనులు పూర్తి చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య 11 కి.మీ మేర చేపట్టిన మూడో లైన్ నిర్మాణం, విద్యుదీకరణ పనులు బుధవారంతో పూర్తయినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు ప్రారంభం కావడంతో దేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలను అనుసంధానించే గ్రాండ్ ట్రంక్ మార్గంలో సరుకు, ప్రయాణికుల రవాణా సజావుగా సాగుతుందని పేర్కొన్నారు.

## టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): ప్రయాణికుల భద్రత, పారదర్శకమైన సేవలు అందించడానికి భారతీయ రైల్వే ఆధునిక సాంకేతికత పద్ధతులు అమలు చేస్తున్నది. అందులో భాగంగా నార్త్ సెంట్రల్ రైల్వే టికెట్ తనిఖీ చేసే సిబ్బంది(టీసీలు)కి బాడీ కెమెరాలను అందించాలని నిర్ణయించింది. దీనివల్ల టికెట్ తనిఖీ ప్రక్రియలో జవాబుదారీతనం పెరుగుతుందని రైల్వేవర్గాలు పేర్కొంటున్నాయి. టీసీలకు బాడీ కెమెరాలను అమర్చేవిధానాన్ని ముందుగా ప్రయాగ్‌రాజ్ - న్యూఢిల్లీ మధ్య తిరిగే రైళ్లలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని ఉత్తర మధ్య రైల్వే నిర్ణయించింది. తర్వాత దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్టు రైల్వేశాఖ ప్రతినిధి శివమ్‌శర్మ పేర్కొన్నారు. సుదీర్ఘ ప్రయాణాల్లో అంతరాయం కలుగకుండా దీర్ఘకాలిక బ్యాటరీ లైఫ్‌ను వీటికి అందించనున్నట్టు చెప్పారు.

## పెన్నా నీళ్లు చాలడం లేదు

**అందుకే కృష్ణా జలాలు తరలించుకుంటున్నాం**

**ట్రిబ్యునల్ విచారణలో ఏపీ సర్కార్ వాదనలు**

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): పెన్నా బేసిన్ నీటితో హంద్రీనీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి, తెలుగుగంగ ప్రాజెక్టులను నిర్వహించుకోలేమని, అందుకే కృష్ణా జలాలను తరలించుకుంటున్నామని ఏపీ సర్కార్ వెల్లడించింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపించింది. కేంద్రం జారీచేసిన సెక్షన్ 3 మార్గదర్శకాల మేరకు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి ఢిల్లీలో ఈ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణ గురువారం సైతం కొనసాగింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో క్యారీ ఓవర్ స్టోరేజీ నీటివినియోగం ఆధారంగానే తమకు 76%, తెలంగాణకు 24% నిష్పత్తిలో పంపిణీ చేయాలని ఏపీ ప్రతిపాదించింది. తెలంగాణ సైతం ఆర్డీఎస్ దగ్గర వాడుకోలేని నీళ్లను తుమ్మిళ్ల దగ్గర వాడుతున్నదని తెలిపింది. ఆర్డీఎస్ రైట్ కెనాల్‌కు కేడబ్ల్యూడీటీ-2 అనుమతులిచ్చిందని, తద్వారా తుంగభద్ర రైట్ బ్యాంక్ లోలెవెల్ కెనాల్ కింద కవర్ కాని ఏరియాలకు నీళ్లిస్తామని వెల్లడించింది. ఆర్డీఎస్‌ను కృష్ణా బోర్డే పర్యవేక్షిస్తున్నదని, కమిటీలు కూడా వేశారని, 16వ బోర్డు మీటింగ్ మినట్స్ రికార్డ్ అయ్యాయని పేర్కొన్నది. ఆర్డీఎస్ ఆనకట్ట ఎత్తు పెంచాలని నిపుణుల కమిటీ చెప్పలేదని, కేవలం ఆ అంశాన్ని పరిశీలించమని మాత్రమే సూచించిందని తెలిపింది. ఈ వాదనలు శుక్రవారం కూడా కొనసాగనున్నాయి.

## జైలుకు రెడ్కో డీఈ వెంకటరమణ

**6 వరకు జ్యుడీషియల్ రిమాండ్**

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూలై 23 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రెడ్కో డివిజనల్ ఇంజినీర్ (డీఈ) ముత్యం వెంకటరమణను ఏసీబీ అధికారులు గురువారం నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం ఆయనను 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిందితుడిని జైలుకు తరలించారు. ఇటీవల డీఎస్పీ భీంరెడ్డిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన కొద్ది రోజులకే డీఈని అరెస్టు చేయడం సంచలనం సృష్టించింది. భీంరెడ్డిని తమ కస్టడీలోకి తీసుకుని లోతుగా ప్రశ్నించేందుకు ఏసీబీ కసరత్తు చేస్తున్నది. వెంకటరమణ రూ.400 కోట్ల అక్రమాస్తులు కలిగి ఉన్నట్టు ఏసీబీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.



ఏదైనా పని అప్పగిస్తే చాలు... 'నాకు టైం లేదు. వీలు కాదని' మనలో చాలామందిమి తప్పించుకుంటాం. కానీ, ఆ మహిళ మనందరిలా కాదు. ఆమె కాళ్లు కదలవు, శరీరం సహకరించదు. అయినా కుంచె పట్టి ప్రపంచానికి రంగులు పూసింది. బాల్యంలోనే 'కండర క్షీణత వ్యాధి'తో మంచానికి పరిమితమైంది. నాలుగు గోడల నడుమ జీవిస్తూ కళాత్మక పెయింటింగ్స్ వేస్తూ ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నది షేక్ నఫీస్. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన హార్ట్ ఏబుల్డ్ చిత్రకళా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన తన కళాఖండాలు ఎందరినో ఆలోచింపజేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్న నఫీస్ జిందగీతో ముచ్చటించింది. ఆ విశేషాలు తన మాటల్లోనే...



# కుంచె నా నేస్తమైంది!

అందరిలాగే నేను కూడా చిన్నప్పుడు ఆడుతూ పాడుతూ పెరిగాను. గొప్పగా చదువుకోవాలని చక్కగా బడికి వెళ్లేదాన్ని. ఏమైందో తెలియదు కానీ అనుకోకుండా నా కాళ్లు, చేతులు బలహీనపడుతూ వచ్చాయి. అమ్మానాన్నలు భయపడి పోలియో అనే అనుమానంతో డాక్టర్లకు చూపించారు. అయినా కూడా ఫలితం లేకుండా పోయింది. నేను పదో తరగతి కొచ్చే సరికి లేవలేని పరిస్థితి ఏర్పడింది. పూర్తిగా మంచానికే పరిమితమయ్యాను. నాకు 'కండర క్షీణత వ్యాధి' వచ్చిందని వైద్యులు చెప్పడంతో తట్టుకోలేకపోయాను. కదల్లేను, నడవలేను, శరీరమంతా బలహీనంగా మారిపోయింది. నా జీవితం ఓ చీకటి గదికే పరిమితమైంది. నా వ్యాధిని చూసి అమ్మానాన్న తట్టుకోలేకపోయారు. నా ఒంటరి తనాన్ని వాళ్లు చూడలేక చిన్నప్పటినుంచి నాకు ఎంతో ఇష్టమైన డ్రాయింగ్ వేయమని పెన్సిళ్లు, డ్రాయింగ్ షీట్లు తెచ్చి చేతికిచ్చేవారు. అలా ఒంటరిగా ఉన్న నాకు డ్రాయింగ్ తోడైంది. నా ఆలోచనలన్నీ బొమ్మలు వేయడం పైనే కేంద్రీకరించడం మొదలు పెట్టాను. అలా కుంచె నా నేస్తమైంది.







### ఆ ప్రదర్శనతో..

బొమ్మలు వేయడం హాబీగా పెట్టుకున్న నాకు వాటిని నలుగురికీ చూపించాలన్న ఆలోచన కూడా రాలేదు. నాకు వచ్చిన వ్యాధి గురించి తెలుసుకునేందుకు సారంగి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఖాజా అఫ్రీది ఓసారి మా ఇంటికొచ్చాడు. నా గది నిండా పెయింటింగ్స్ చూసి ఆశ్చర్యపోయాడు. ఇవన్నీ ఎక్కడ కొన్నారని అడిగిన ఆయనకు 'నేనే వేశాను' అని సమాధానమిచ్చాను. 'నిజమా!' అంటూ చాలాసేపు వాటినే అలా చూస్తూ ఉండిపోయాడు. తర్వాత నమ్మకం కలిగి ఇంతమంచి పెయింటింగ్స్ పదిమందికీ చూపితే ఎందరికో స్ఫూర్తి కలుగుతుందని రవీంద్ర భారతీలో ఆర్ట్ ఎగ్జిబిషన్ పెట్టిస్తానని మాటిచ్చాడు. అన్నట్టుగానే నేను వేసిన పెయింటింగ్స్‌తో 2018లో రవీంద్ర భారతిలో రెండు రోజులపాటు ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఆ ప్రదర్శన నా జీవితాన్నే మార్చేసింది. నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. దాదాపు 20 ఏండ్లు బయటి ప్రపంచం తెలియని నేను ఆరోజు బయటికొచ్చాను. యాదృచ్ఛికంగా కేటీఆర్ గారు మా ప్రదర్శనకొచ్చారు. నా పెయింటింగ్స్ చూసి ఆయన చాలా భావోద్వేగానికి గురయ్యారు. నా దగ్గరికొచ్చి ఆరోగ్య సమాచారం తెలుసుకుని అప్పటికప్పుడే స్పెషల్ ఆర్టిస్ట్ పింఛన్ కింద నెలకు రూ.10వేలు అందజేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికీ అది కొనసాగుతూనే ఉంది. ఆయన చేసిన మేలుకు గుర్తుగా ఆయన ఫొటోను డ్రాయింగ్ వేసిచ్చాను. అప్పుడున్న మెట్రో ఎండీ 20 పెయింటింగ్స్ కొని మెట్రో స్టేషన్లలో పెట్టించారు.

### మరింత బలహీనంగా..

మొదటి ప్రదర్శనతో నాలో కొత్త ఉత్సాహం మొదలైంది. బయటి ప్రపంచాన్ని చూడాలన్న నా కోరిక అతి కొద్ది రోజుల్లోనే నెరవేరింది. 2021లో అప్పుడున్న తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఢిల్లీలో రెండురోజులపాటు ప్రదర్శన ఏర్పాటు చేసుకున్నాం. ఆ తరువాత ప్రపంచంలోనే పెద్ద ఆర్ట్ ఎగ్జిబిషన్‌గా పేరున్న దుబాయ్‌లో కూడా నా చిత్రాలు ప్రదర్శించారు. ఇప్పటివరకు 400 వరకు పెయింటింగ్స్ వేసుంటాను. వాటిలో చాలా వరకు నా గురించి నేను వేసుకున్నవే ఉన్నాయి. వాటిని చూస్తే ఒంటరితనాన్ని గుర్తుకు తెచ్చే భావాలే గుర్తొస్తాయి. దాంతో పాటు ప్రకృతినీ చూపించాను. నా వయసుతోపాటు నాకొచ్చిన వ్యాధి కూడా పెరుగుతూనే ఉంది. ఒకప్పుడు అరలీటర్ వాటర్‌బాటిల్ ఎత్తిన నాకు ప్రస్తుతం ఖాళీ నీళ్ల సీసా ఎత్తాలన్నా ఇబ్బందిగానే ఉంది. కంటి చూపు తగ్గింది. చేతి బలం క్షీణిస్తోంది. ఒకప్పుడు రెండు మూడు గంటలపాటు పెయింటింగ్ వేస్తూ కూర్చునేదాన్ని. ఇప్పుడు గంటసేపు కూడా కూర్చోలేకపోతున్నాను.

> "నా జీవితంలో ఆ ఇద్దరినీ అస్సలు మర్చిపోను. ఒకరు నాకు జన్మనిచ్చిన నా తల్లి, మరొకరు నాకంటూ గుర్తింపు తెచ్చిన ఖాజా అఫ్రీది. నా బాల్యం నుంచి ఇప్పటి వరకు నాకు సేవలు చేస్తూనే ఉంది నా కన్నతల్లి. ఆమె రుణం వచ్చే జన్మలోనైనా తీర్చుకోవాలి. మరుగున పడిన నా కళను వెలుగులోకి తెచ్చారు ఖాజా భాయ్. ప్రతి ప్రదర్శనలో నా పెయింటింగ్స్‌ను పరిచయం చేశాడు. ఆయన లేకుంటే నా పెయింటింగ్స్‌కు ఇంత ఆదరణ లభించేది కాదు. నాకు ఒక సోదరుడిలాగా తోడున్నాడు."



### మీ కష్టాలు చాలా చిన్నవి

నా కళను గుర్తించి ఈశ్వరీబాయి అవార్డుతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అవార్డులు, సన్మానాలతో సత్కరించాయి. నాన్న రైల్వే ఉద్యోగిగా పనిచేయడం వల్ల ఆయన చనిపోయినా కూడా ఆయనకొచ్చే పెన్షన్, నాకొచ్చే పెన్షన్‌తో కుటుంబం నెట్టుకొస్తున్నాం. నాకో చెల్లి కూడా ఉంది. తను కూడా ఇంటర్మీడియట్‌లో ఉన్నప్పుడే ఈ వ్యాధి బారిన పడింది. అయినా డిగ్రీ పూర్తి చేసింది. ప్రస్తుతం ఇంట్లోనే గ్లాస్ వర్క్ చేస్తుంటుంది. ఇప్పుడున్న యువత చిన్న చిన్న విషయాలకే మానసికంగా కుంగిపోతున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నా కష్టంతో పోలిస్తే మీ కష్టాలు చాలా చిన్నవి. శరీరం సహకరించలేని నేనే ఇంతమంచి పెయింటింగ్స్ వేస్తున్నానంటే మీరు తలుచుకుంటే అద్భుతాలు చేయగలరు. ఒక్కసారి మీకు మీరు ప్రశ్నించుకోండి. ప్రస్తుతం నేను బొమ్మలు గీయడం నెమ్మదించినా మీ అందరిలో ఆత్మస్థైర్యం నింపేందుకే ఇటీవల ఇవి ప్రదర్శనకు పెట్టాను.

... రాజు పిల్లనగోయిన

## ఇద్దరూ టీచర్లే!

ఒకే ఫ్రేములో ఈ ఇద్దరినీ చూస్తే భలే ముచ్చటగా ఉంది కదా. ఇద్దరూ దేశాధినేతలే! ఇద్దరూ పాఠాలు చెప్పి పైకెదిగిన వారే. రాజకీయాల్లోకి రాకముందు మన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాలుగేండ్లపాటు ఉపాధ్యాయినిగా పనిచేశారు. ఈ ఫొటోలో ఉన్న రెండో నేత సిల్జనోవ్స్కా. తను ఉత్తర మాసిడోనియా అధ్యక్షురాలు. రాజకీయాల్లోకి రాకముందు ఆమె ఓ ప్రొఫెసర్. న్యాయ శాస్త్ర పాఠాలు చెప్పే సిల్జనోవ్స్కా రాజకీయాల్లోకి వచ్చాక అనేక బాధ్యతలు నిర్వహించారు. ఓసారి అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయినా.. మళ్లీ పోటీ చేసి గెలిచారు. ఉత్తర మాసిడోనియా అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేస్తూ.. 'ఉత్తర మాసిడోనియాను ఫెమినిస్ట్, యూరోపియనైజ్డ్ కంట్రీగా మారుస్తాన'ని ప్రకటించారు. ప్రపంచంలో ఏ దేశాధినేతా ఇలాంటి ప్రకటన చేయలేదు. ఆచరణలో సఫలమైతే మంచిదే!



## ట్రెక్కింగ్ చేద్దామా!

ట్రెక్కింగ్ అనగానే అందరికీ గుర్తుకొచ్చే పేరు హిమాలయాలు. ఆ శీతల ప్రాంతానికి వెళ్లి ఒక్కసారైనా ట్రెక్కింగ్ చేయాలనుకుంటారు. కానీ, కొంతమంది మాత్రం ట్రెక్కింగ్ అంటే నెలల తరబడి చేయాలంటూ తమలోని కోరికను అణుచుకుంటూ ఉంటారు. కానీ, కేవలం వారంరోజుల్లోనే మనసుకు నచ్చినట్లుగా ట్రెక్కింగ్ చేసే వెసులుబాటు ఉన్న ప్రాంతాలివి. అవేమిటో ఓ లుక్కేయండి..

**రూపిన్ పాస్:** 7 రోజులపాటు సాగే ఒక అద్భుతమైన క్రాసోవర్ ట్రెక్కింగ్ ఇది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల గుండా 43 కిలోమీటర్ల మేర విస్తరించి 15,250 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతం మంచు, దట్టమైన అడవులతో ఉంటుంది. ఈ అద్భుతమైన ప్రాంతంలో పలకరించే జలపాతాలు ట్రెక్కింగ్ చేసేవారికి మరింత ఉత్సాహాన్నిస్తాయి.



**ఫ్లవర్‌వ్యాలీ:** ఉత్తరాఖండ్‌లోని గడ్వాల్ హిమాలయాల్లో ఆరురోజులపాటు చేసే ఈ 38 కిలోమీటర్ల ప్రయాణం ఎంతో కొత్తగా ఉంటుంది. యునెస్కో గుర్తింపు పొందిన ఈ ప్రాంతం వర్షాకాలంలో రంగురంగుల ఆల్పైన్ పూలతో కళకళలాడుతుంది.

**బురాన్ ఘాటి:** హిమాలయ పర్వత శ్రేణులలో ఉన్న ఒక ప్రసిద్ధ ట్రెక్కింగ్ ప్లేస్. ఈ ట్రెక్ మంచుతో కప్పి ఉన్న పర్వతాలు, అడవులు, పచ్చిక బయళ్లతో భూలోక స్వర్గంగా దర్శనమిస్తుంది. ఈ ఏరియా సముద్ర మట్టానికి దాదాపు 15 వేల అడుగుల ఎత్తులో ఉంటుంది. వారం రోజులపాటు సాగే ఈ ట్రెక్కింగ్ మిమ్మల్ని సిమ్లా దగ్గరున్న పబ్బర్ లోయలోని ఓక్ అడవుల నుంచి కిన్నౌర్ లోయలోని ఆపిల్ తోటల వరకు తీసుకెళ్తుంది.

**హంప్తా పాస్:** హిమాలయ ట్రెక్‌లలో చాలా ప్రసిద్ధమైనది హంప్తా పాస్. కులులోని పచ్చని పచ్చికబయళ్లు, మంచు కప్పుకొన్న గిరులు, స్పితి లోయలోని హిమ ఎడారి ఇలా ఎన్నో ప్రత్యేకతల సమాహారం హంప్తా పాస్. శారీరకంగా దృఢంగా ఉన్నవారికి ఈ ట్రెక్కింగ్ అనుకూలం.

**చంద్రఖని పాస్:** ఇది హిమాచల్ ప్రదేశ్‌లోని కులు లోయలో ఉంటుంది. సముద్ర మట్టానికి సుమారు 3,660 మీటర్ల ఎత్తులో ఉంది. డియో టిబ్బా, పిర్ పంజాల్ పర్వత శ్రేణులు ఈ మార్గంలో ట్రెక్కింగ్ చేసేవారికి కనువిందు చేస్తాయి.

**చాదర్ ట్రెక్:** చాదర్ ట్రెక్ అనేది లడఖ్‌లోని జాంస్కర్ నదిపై ఘనీభవించిన మంచుపై నడిచే ఒక సాహస యాత్ర. సముద్రమట్టానికి సుమారు 11,100 అడుగుల ఎత్తులో ప్రారంభమయ్యే ఈ మార్గం జనవరి, ఫిబ్రవరి నెలలో ట్రెక్కింగ్‌కు అనుకూలం.

## సన్‌స్క్రీన్ స్ప్రే చేస్తున్నారా..

ఎండాకాలమనే కాదు అన్ని రోజుల్లోనూ సన్‌స్క్రీన్‌ను వాడుతున్నారు నేటి తరం అమ్మాయిలు. అతినీల లోహిత కిరణాల నుంచి కాపాడుకోవటం సహా చర్మం ట్యాన్ అవ్వకుండా ఉండేందుకు, పిగ్మెంటేషన్‌ను అరికట్టేందుకు అంటూ ఇవి వాడేందుకు ఎవరి కారణాలు వారికి ఉంటున్నాయి. అందులోనూ ఇటీవల కాలంతో సంబంధం లేకుండా ఎండల తీవ్రత కూడా ఎక్కువగానే ఉంటున్నది. అయితే ఇప్పటి దాకా క్రీమ్ లేదా లోషన్‌ల రూపంలోనే వీటిని వినియోగం ఎక్కువగా ఉంది. కానీ దీన్ని మరింత సమర్థంగా వినియోగించుకునేలా 'స్ప్రే సన్‌స్క్రీన్'లు తయారవుతున్నాయి. రోజ్ వాటర్‌లాంటివి స్ప్రే చేసినట్టే దీన్నీ స్ప్రే చేసుకోవచ్చు. లోషన్లతో పోలిస్తే పల్చగా ఉండే ఇవి శరీరం మీద సమంగా పరచుకుంటాయి. దాని వల్ల చర్మానికి మరింత రక్షణ లభిస్తుంది. అలాగే బయటికి వెళ్లినప్పుడూ సులభంగా అప్లై చేసుకోవచ్చు. అయితే ఈ రకం సన్‌స్క్రీన్‌లను సక్రమంగా వినియోగించేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకసారి స్ప్రే చేస్తే చర్మం మీద ఇది చాలా పల్చటి పొరను ఏర్పరుస్తుంది. అందువల్ల అనుకున్నంత రక్షణ రాకపోవచ్చు. అందుకే కేవలం తడి అవ్వగానే వదిలేయకుండా చర్మం మీద గాజు పొరలా సన్‌స్క్రీన్ మెరిసేంత వరకూ దీన్ని చల్లాలి. ఆ తర్వాత బాగా ఇంకేలా నెమ్మదిగా మర్దనా చేయాలి. అలాగే శరీరం మీద చేసినట్టు ముఖం మీద నేరుగా స్ప్రే చేయకూడదు. అరచేతిలో వేసుకుని రాసుకోవడమే మంచి పద్ధతి. దాని వల్ల సన్‌స్క్రీన్ ముక్కు, కళ్లను ప్రభావితం చేయకుండా ఉంటుంది. ఇక, గాలి ఎక్కువగా వీచే ఆరుబయట కాకుండా, ఏదైనా గదిలాంటి దానిలో కూర్చుని రాసుకోవడం వల్ల సన్‌స్క్రీన్ వృథా కాకుండా ఉంటుంది. ఇక, రక్షణ విషయంలో క్రీములకు ఇవేం తీసిపోవని చర్మ సంరక్షణా నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఇక సన్‌స్క్రీన్ రాసుకోవడం మరింత తేలికైనట్టే!



## పరిమితి మంచిదేగా..



'పామాయిల్' మాట వినిపించగానే చాలామంది విషతుల్యంగా భావించి దాంతో చేసిన ఆహారాన్ని వెంటనే పక్కన పెట్టేస్తున్నారు. అంతలా ప్రభావితం చేశారు మరి నేటి సోషల్‌మీడియా సైంటిస్టులు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని పూర్తిగా నమ్మాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఒక నూనె ఆరోగ్యకరమా కాదా అనేది నూనె పేరును చూసి కాకుండా.. దాన్ని ఎలా వాడుతున్నాం, ఎంత మోతాదులో తీసుకుంటున్నాం.. ఆహారపు అలవాట్లు ఎలా ఉన్నాయన్న దానిపై ఆధారపడి ఉంటుందని వివరిస్తున్నారు.

**పామాయిల్** విటమిన్-ఇ తోపాటు శరీరానికి అవసరమైన కొవ్వు ఆమ్లాలు కూడా ఉంటాయి. అలా అని పరిమితికి మించి తీసుకోమని కాదు. అన్ని రకాల నూనెలను మారుస్తూ, పరిమిత మోతాదులో వాడటం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఒక రకమైన నూనెను మంచిదని, మరోదాన్ని చెడ్డదని ముద్ర వేయడం శాస్త్రీయంగా సరైన విధానం కాదని చెబుతున్నారు. ముఖ్యంగా ఇంట్లో తయారుచేసిన సమతుల ఆహారం, తక్కువగా వేయించిన పదార్థాలు, నూనెను నియంత్రించి వాడటమే ఆరోగ్యానికి అసలు మంత్రం అని గుర్తుచేస్తున్నారు.

**ఆహారంపై** నిర్ణయాలు తీసుకునే ముందు సోషల్ మీడియా ట్రెండ్స్‌ను కాకుండా సైంటిఫిక్ ఆధారాలను నమ్మాలని వైద్యులు సూచిస్తున్నారు. వస్తున్న ప్రతి కంటెంట్‌ను నమ్మి, యదార్థాలను సరిచూసుకోకుండా, వారి విద్యార్హతతో సంబంధంలేని అంశాలను భయంతో ఫాలో అవ్వడం కూడా మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. ఒక్క పదార్థాన్ని చూసి తీర్పు చెప్పడం కాదు... మొత్తం ఆహారపు జీవనశైలే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది అని గ్రహించాలి.

## తోటకూర గారెలు

**కావలసిన పదార్థాలు**

**శనగపప్పు:** ఒక కప్పు, **మినుప పప్పు:** అర కప్పు, **తరిగిన తోటకూర:** ఒక కప్పు, **ఉల్లిగడ్డ:** ఒకటి, **పచ్చిమిర్చి:** నాలుగు, **ఉప్పు:** తగినంత, **వెల్లుల్లి:** నాలుగు రెబ్బలు, **జీలకర్ర:** ఒక టీస్పూన్, **నూనె:** వేయించడానికి సరిపడా.

**తయారీ విధానం**

శనగపప్పు, మినుప పప్పును బాగా కడిగి నాలుగు గంటలపాటు నానబెట్టాలి. నానిన పప్పుల్ని బరకగా, గట్టిగా గ్రైండ్ చేసుకోవాలి. ఒక గిన్నెలో పప్పు ముద్ద, తోటకూర తరుగు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, దంచిన వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు వేసి బాగా కలపాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి నూనెపోసి, బాగా వేడయ్యాక పప్పు మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని అరచేతిలో గారెల్లా ఒత్తి నూనెలో దోరగా కాల్చుకుంటే వేడివేడి తోటకూర గారెలు సిద్ధం.





## ఆర్థిక విషయాలు పంచుకోండి

భారతీయుల్లో ఎక్కువమంది తమ ఆర్థిక వివరాలను జీవిత భాగస్వామితో పంచుకోవడం లేదట. ఫలితంగా.. బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, మ్యూచువల్ ఫండ్స్‌లలో రూ.80,000 కోట్లకు పైగా సొమ్ము క్లెయిమ్ చేయకుండా పడి ఉన్నదట. అత్యవసర పరిస్థితుల్లో బ్యాంక్, ఇన్సూరెన్స్‌కు సంబంధించిన వివరాలు తెలియకపోవడం వల్ల.. వాటిని క్లెయిమ్ చేయడం లేదట. దీనిని అధిగమించాలంటే.. అన్నిరకాల ఆర్థిక విషయాలను జీవిత భాగస్వామితో పంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకోసం కొన్ని సలహాలను అందిస్తున్నారు.

- బీమా పాలసీలు, పెట్టుబడులు, ప్రావిడెంట్ ఫండ్స్ వంటివాటి గురించి దంపతులిద్దరూ చర్చించుకోవాలి. జీవిత బీమా పాలసీ నంబర్లు, బ్యాంక్ బ్రాంచ్‌లు, యూఏఎన్ నంబర్లు, డీమ్యాట్ ఖాతా వివరాలను.. కచ్చితంగా ఒకచోట రాసి ఉంచుకోవాలి.
- ప్రతి బ్యాంక్ ఖాతా నంబర్, బ్రాంచ్, మ్యూచువల్ ఫండ్‌కు సంబంధించిన వివరాలతో కూడిన ఒక ఫిజికల్, డిజిటల్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేసుకోవాలి.
- అన్ని రకాల లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ నంబర్లు, కంపెనీ పేర్లు, ఈపీఎఫ్ యూఏఎన్ నంబర్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ వివరాలను నోట్ చేసి పెట్టుకోవాలి.
- ఎవరికైనా డబ్బు అప్పు ఇచ్చినా, వేరే ప్రాంతంలో ఆస్తులు కొనుగోలు చేసినా.. అందుకు సంబంధించిన అన్ని విషయాలతోపాటు డాక్యుమెంట్లను కూడా భాగస్వామితో పంచుకోవాలి.

**ఇలాంటి** విషయాల గురించి ముందే సూటిగా మాట్లాడుకోవడం వల్ల భవిష్యత్తులో వచ్చే చట్టపరమైన, మానసికమైన ఇబ్బందులను నివారించవచ్చని అంటున్నారు. ఇంటి ఆర్థిక విషయాలను కలిసికట్టుగా ఎలా మేనేజ్ చేయాలో నిపుణులను అడిగి తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

# అసెంబ్లీ విస్తరణ కోసం షాహీ మసీదు స్థలం!

- 1539 చదరపు గజాల భూమి స్వాధీనానికి విఫల యత్నం
- కాన్‌స్టిట్యూషనల్ క్లబ్ నిర్మాణానికి కాంగ్రెస్ సర్కార్ కసరత్తు
- నోటిఫికేషన్ జారీకి సిద్ధమవుతున్న ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ విస్తరణలో భాగంగా ఆవరణ లోని చారిత్రాత్మక షాహీ మసీదు (బాగ్-ఏ-ఆమ్) స్థలాన్ని తీసుకొనేందుకు సర్కార్ సిద్ధమైనట్టు తెలిసింది. మసీదు స్థలంలో కాన్‌స్టిట్యూషనల్ క్లబ్ నిర్మించాలనుకుంటున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇందుకోసం మసీదుకు చెందిన 1539 చదరపు గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇందుకు ప్రత్యామ్నాయంగా ఉద్యానవనశాఖకు చెందిన 698 చదరపు గజాలు, దాని పక్కనున్న 641 చదరపు గజాల స్థలాన్ని మసీదుకు అప్పగించాలని భావిస్తున్నట్టు వినికిడి. ఇందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రణాళికలు సిద్ధంచేసినట్టు తెలుస్తున్నది. ప్రభుత్వ నిర్ణయాన్ని వక్ఫ్ బాధ్యులు, ముస్లిం మతపెద్దలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ప్రస్తుతానికి గోప్యంగా ఉంచుతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వారిని నయానో భయానో ఒప్పించేందుకు ఒకరిద్దరు ప్రభుత్వ పెద్దలను రంగంలోకి దించినట్టు అధికారవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

### మసీదు స్థలం స్వాధీనం సాధ్యమేనా?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన గెజిట్ ప్రకారం 13,811 చదరపు గజాల మసీదు స్థలం ప్రస్తుతం మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్నది. మసీదుకు సంబంధించిన భవనం క్యాటగిరీ-1 వారసత్వ కట్టడాల జాబితాలో ఉన్నది. ప్రస్తుతం మసీదుకు సంబంధించి 10,117 చదరపు గజాల స్థలం అందుబాటులో ఉన్నదని, మిగిలిన 3500 చదరపు గజాల భూమిని గుర్తించే ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నదని మైనారిటీ సంక్షేమశాఖ అధికారులు చెప్తున్నారు. వారసత్వ కట్టడాల జాబితాలో ఉన్న స్థలాన్ని సేకరించడం అంత సులభం కాదని పురావస్తు నిపుణులు పేర్కొంటున్నారు. తెలంగాణ ఏన్షియంట్ అండ్ హిస్టోరికల్ మాన్యుమెంట్ యాక్ట్ -1960, తెలంగాణ హెరిటేజ్ యాక్ట్-2017 ప్రకారం యాజమాని ఒప్పుకొన్న మీదట మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాల్సి ఉంటుందని, లేదంటే అంతే విలువైన స్థలాన్ని సంబంధిత యజమాని సంస్థ లేదా వ్యక్తికి అప్పగించాల్సి వస్తుందని చెప్తున్నారు. ఇలాంటి చట్టపరమైన చిక్కులను అధిగమించాలంటే ఎక్కువ సమయం పడుతుందని అంటున్నారు.

### ముస్లిం మైనారిటీ వర్గాల అభ్యంతరం

అసెంబ్లీ ఆవరణలోని షాహీ మసీదు స్థలాన్ని తీసుకొని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్ నిర్మించడాన్ని ముస్లిం మైనారిటీ వర్గాలు వ్యతిరేకించే అవకాశం ఉంది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని బాహాటంగా వెల్లడించకపోవడంతో వారు స్పందించడంలేదని తెలుస్తున్నది. కానీ ప్రభుత్వం ఇదే రీతిన ముందుకెళ్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని మైనారిటీ సంఘాల బాధ్యులు అంటున్నారు. మసీదు స్థలాన్ని ఇవ్వడం ఎట్టి పరిస్థితుల్లో కుదరదని, అది తమ మనోభావాలను దెబ్బతీయడమేనని స్పష్టం చేస్తున్నారు.



పెయిన్, పాలియేటివ్ కేర్ విభాగాన్ని ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు

## ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్ నియంత్రణ

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ): క్యాన్సర్ నివారణ జాతీయ ప్రాధాన్యతగా మారాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌లో క్యాన్సర్ రోగుల కోసం ఏర్పాటు చేసిన పెయిన్, పాలియేటివ్ కేర్ విభాగం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ క్యాన్సర్ రోగుల కోసం పెయిన్, పాలియేటివ్ కేర్ సేవలను ప్రారంభించడం సంతోషకరమని చెప్పారు. అంకాలజిస్టులు, పాలియేటివ్ కేర్ నిపుణులు కలిసి పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆధునిక వైద్యం చెబుతున్నదని అన్నారు. ఈ చికిత్స ప్రధాన చికిత్సలతో పాటు సమాంతరంగా పనిచేస్తూ రోగి జీవన నాణ్యతను మెరుగుపరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్ చైర్మన్ గోపీచంద్ మన్నం, డైరెక్టర్ రమేశ్ గూడపాటి, మెడికల్ అంకాలజీ విభాగాధిపతి సాయినాథ్ పాల్గొన్నారు.

## అధికారిక గ్రూపుల్లో పార్టీ ప్రచారాలు!

**కాంగ్రెస్ పాలనలో వింత పోకడ**

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో వింత పోకడలు నడుస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల సమాచారాన్ని మీడియాకు చేరవేసే ప్రభుత్వ అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టులు షేర్ చేయడం వివాదాస్పదమవుతున్నది. మంత్రుల గ్రూపులతోపాటు ఏకంగా చీఫ్ మినిస్టర్ ఆఫీస్ (సీఎంవో) వాట్సాప్ గ్రూపుల్లో పార్టీ వ్యవహారాలకు సంబంధించిన పోస్టులు పెట్టడం విస్మయానికి గురిచేస్తున్నది. దీంతో ముఖ్యమంత్రి పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ల తీరుపై ఆయా సంస్థల మీడియా ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితులు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వింత పోకడలు పోతున్నదని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని చెప్తున్నారు. ఇటీవల రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌లో 'సర్'పై నిర్వహించిన జూమ్ సమావేశం, ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన అంశాలు షేర్ చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సమాచార పౌర సంబంధాల శాఖ వాట్సాప్ గ్రూపులో రాహుల్‌గాంధీ ఢిల్లీలో చేసిన ధర్నాపై సీఎం చేసిన ట్వీట్‌ను మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ షేర్ చేయడం విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికైనా సీఎం పీఆర్వోలు, ప్రభుత్వంలో ఉన్నత పోస్టుల్లో ఉన్న అధికారులు తమ తీరును మార్చుకోవాలని పలువురు జర్నలిస్టులు కోరుతున్నారు.

## విమానానికి బాంబు బెదిరింపు

శంషాబాద్ రూరల్, జూలై 23 : విమానంలో బాంబు ఉందని గుర్తుతెలియని వ్యక్తి నుంచి మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయం 'శంషాబాద్ ఎయిర్‌పోర్టులో టేకాఫ్ అవుతున్న విమానంలో బాంబు ఉంది. ఏక్షణమైనా అది పేలవచ్చు.' అని ఓ గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ అధికారిక వెబ్‌సైట్‌కు మెయిల్ వచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ సిబ్బంది ఎయిర్‌పోర్టులోని పలు విమానాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. ఎక్కడా బాంబు కనిపించకపోవడంతో దుండగుడు కావాలనే ఈ మెయిల్ చేసినట్టు భావించి ఎయిర్‌పోర్టు ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అన్నారంలో 66 ఎకరాల భూసేకరణ

- ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల
- 60 రోజుల్లో అభ్యంతరాలు స్వీకరణ
- భూముల క్రయవిక్రయాలపై తాత్కాలిక నిషేధం


సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారంలో 261 సర్వే నంబర్‌లోని 66 ఎకరాలను ఇటీవల పరిశీలించిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

గుమ్మడిదల, జూలై 23: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారంలో ప్రతిపాదిత టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రాజెక్ట్ కోసం అవసరమైన 66 ఎకరాల భూసేకరణకుగాను జిల్లా కలెక్టర్ కార్యాలయం ఇటీవల ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసింది. భూసేకరణ చట్టం-2013 సెక్షన్ 11(1) ప్రకారం భూసేకరణ చేపట్టనున్నట్టు ఓ ప్రధాన ప్రతికలో జూన్ 18న ప్రకటన విడుదల చేసింది. ఈ విషయం ఇంకా మండల ప్రజలకు, అన్నారం రైతులకు తెలియకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావ మదింపు ప్రక్రియ నుంచి మినహాయింపు ఇచ్చారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ జారీ చేసిన జీవోఆర్టీ నంబర్ 44, తేదీ 13.03.2026 ప్రకారం ఈ నిర్ణయం తీసుకోగా, తెలంగాణ గెజిట్ మార్చి 16న ప్రచురితమైంది. ఈ నోటిఫికేషన్ ప్రకారం భూ సేకరణకు సంబంధించిన పూర్తి వివరాలు, మ్యాపులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాల్లో కార్యాలయ వేళలో పరిశీలించేందుకు, భూ సేకరణ ప్రక్రియను నిర్వహించేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి ప్రభుత్వం అధికారాలు అప్పగించింది. నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి జిల్లా కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా సంబంధిత భూముల అమ్మకం, కొనుగోలు, బదిలీ లేదా ఇతర హక్కుల బదలాయింపులు చేపట్టరాదని స్పష్టం చేశారు. భూసేకరణపై అభ్యంతరాలు ఉన్న భూ యజమానులు, హక్కుదారులు లేదా ఇతర ప్రయోజనదారులు నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచి 60 రోజుల్లోపు జిల్లా కలెక్టర్ లేదా భూసేకరణ అధికారికి లిఖితపూర్వకంగా సమర్పించాలని పేర్కొన్నారు.

### మార్చి 10న భూములను పరిశీలించిన పటాన్‌చెరు ఎమ్మెల్యే

అన్నారంలోని 261 సర్వే నంబర్‌లోని 66 ఎకరాల భూములను టీజీఐఐసీకి అప్పగించేది లేదంటూ మార్చి 10వ తేదీన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఆ భూములను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కొన్నేండ్లుగా ఈ భూములనే నమ్ముకొని బతుకుతున్న రైతులకు నష్టం వాటిల్లకుండా తాను రైతుల పక్షానే పోరాటం చేస్తానని ఈ పరిశీలనలో ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఈ 66 ఎకరాల్లో ఎకరా భూమితో పాటు పది గుంటల వరకు భూమి కలిగిన రైతులు 92 మంది ఉన్నారు. జూన్ 18వ తేదీన ప్రాథమిక ప్రకటన వచ్చి ఇప్పటికే 36 రోజులు గడిచింది. ఈ విషయంపై మున్సిపల్ పాలకవర్గం, నియోజకవర్గ నాయకులు, ఆయా రైతులు ఎలా స్పందిస్తారు? భూములను ప్రభుత్వానికి అప్పగిస్తారా? భూపోరాటం చేస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.

# మహిళా ఉద్యోగిపై వేధింపులు, ఆపై తొలగింపు

## టెక్ మహీంద్రా ఆఫీసు ముందు బాధితురాలి ఆందోళన


టెక్ మహీంద్రా కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న భావన

దుండిగల్, జూలై 23: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నా, కన్నకూతురు ఆరోగ్య పరిస్థితి విషమించినా కనీస మానవత్వం చూపకుండా ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తీవ్ర మానసిక వేధింపులకు గురిచేయడమే కాకుండా, ఆమెను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించిన దారుణ ఉదంతం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని టెక్ మహీంద్రా సంస్థలో వెలుగుచూసింది. కంపెనీ యాజమాన్యం వేధింపులపై పోలీసులకు ఫిర్యాదుచేసిన బాధితురాలు ఆపై టెక్‌మహీంద్రా ముందు గురువారం ఆందోళనకు దిగారు. బాధితురాలు భావన తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె నాలుగున్నర నెలల క్రితం ఎంతో శ్రమపడి ఇంటర్వ్యూలు క్రాక్ చేసి టెక్‌మహేంద్రాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరింది. జూన్ నెలలో ఆఫీసులోనే పనిచేస్తుండగానే తీవ్ర అనారోగ్యానికి గురై ఫ్లోర్‌పైనే స్పృహతప్పి పడిపోయింది. దీంతో ఆమెను ముందుగా క్యాంపస్ దవాఖానకు, ఆపై మల్లారెడ్డి వైద్యశాలకు, అనంతరం నగరంలోని జీనియా హాస్పిటల్స్‌కు తరలించారు. ఆమె స్పాండిలైటిస్ సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించిన వైద్యులు 15 రోజులపాటు ఫిజియోథెరపీ తీసుకోవాలని సూచించడంతో ఇంటివద్దే ఉంటూ చికిత్స పొందుతున్నది. ఇందుకు సంబంధించిన మెడికల్ రిపోర్టులను సైతం కంపెనీకి పంపించింది. అయినప్పటికీ యాజమాన్యం ఆమెను ఆరోగ్య పరిస్థితి అడగకుండా ఎప్పుడు ఆఫీస్‌కు వస్తున్నారు? రాకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తాం అంటూ ఈ మెయిల్స్ పంపడం ప్రారంభించారు. ఇటీవల తన కూతురు తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో మూడురోజులపాటు సెలవు తీసుకొని ఇంటికి వెళ్తుండగా.. ఆఫీస్ లాగిన్ చేయాలని, లేకపోతే గైర్హాజరుగా పరిగణిస్తామని తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఆ తరువాత ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు ఈ మెయిల్స్ పంపించారు. దీంతో విసుగుచెందిన భావన కంపెనీ టాక్సిక్ వాతావరణం, యాజమాన్య వేధింపులపై దుండిగల్ పోలీసులకు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు తనను లేబర్ కమిషనర్ వద్దకు వెళ్లాలని ఉచిత సలహా ఇచ్చారని తెలిపారు. ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు.

### టెక్‌మహీంద్ర ముందు ఆందోళన...

మెడికల్ లీవ్‌లో ఉన్న తనను ఉన్నట్టుండి ఉద్యోగం నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ భావన గురువారం టెక్‌మహీంద్ర ముందు ఆందోళనకు దిగింది. తనలాంటి బాధితులు టెక్‌మహీంద్రలో ఎందరో ఉన్నారని, అందరికీ న్యాయం జరిగేంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఉద్యోగం సంపాదిస్తే.. అకస్మాత్తుగా విధుల్లో నుంచి ఎలా టెర్మినేట్ చేస్తారని నిలదీశారు. కంపెనీ లోపల ఉద్యోగులెవరికీ స్వేచ్ఛలేదని, కనీసం వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా తమపై అధికారికి చెప్పే వెళ్లాల్సి ఉంటుందని ఆరోపించారు. కంపెనీలో జరుగుతున్న వేధింపుల పట్ల ఐటీ మంత్రిత్వశాఖకు సైతం ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

## 'అన్నాభావు సాఠే' జయంతిని అధికారికంగా నిర్వహించండి'

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రకు చెందిన ప్రముఖ సంఘ సంస్కర్త, మొదటి దళిత సాహిత్యవేత్త అన్నాభావు సాఠే జయంతిని ఆగస్టు ఒకటిన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని 57ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. గురువారం సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం, మాంగ్ సమాజ్ జేఏసీ నేతలు ఉద్ధవ్ కాంబ్లే, నర్సింగ్ మోరే, నాందేవ్, బాలాజీ, పరమేశ్ కలిసి సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. 1920 ఆగస్టు1న మహారాష్ట్రలోని వాటేగావ్‌లో జన్మించి, సామాజిక అసమానతలను ఎదుర్కొంటూ ఎదిగారని గుర్తుచేశారు. దేశ సామాజిక చరిత్రలో అణగారినవర్గాల గొంతుకగా నిలిచిన మహనీయుడు అన్నాభావు సాఠే అని కొనియాడారు.

# చివరి దశలో 'ది ప్యారడైజ్'?



అగ్ర హీరో నాని 'ది ప్యారడైజ్' ప్రపంచాన్ని వీక్షించేందుకు సినీప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బ్లాక్ బస్టర్ 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే విడుదల ఆలస్యం అవుతుండటంతో అభిమానులు మాత్రం కాస్తంత నిరాశగానే ఉన్నారు. మొన్నటివరకూ విడుదల తేదీలను ప్రకటించిన చిత్రబృందం ప్రస్తుతం మౌనంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ప్రస్తుతం ఈ సినిమాకు చెందిన క్లైమాక్స్‌ను భారీ హంగులతో శ్రీకాంత్ ఓదెల చిత్రీకరిస్తున్నారట. ఇది పూర్తయ్యాక, ఓ ఐటమ్ సాంగ్ షూట్ కూడా ఉంటుందట. ఈ రెండూ పూర్తయ్యాకే విడుదల తేదీ ప్రకటిస్తారని వినికిడి. కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో డా.మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, నిర్మాత: సుధాకర్ చెరుకూరి, నిర్మాణం: ఎస్ఎల్‌వీ సినిమాస్.

# 'స్పిరిట్'లో అతిథి పాత్ర?



తెలుగులో 'మల్లీశ్వరి' వంటి హిట్ సినిమాలో నటించింది బాలీవుడ్ అగ్ర కథానాయిక కత్రినాకైఫ్. ఆ తర్వాత బాలీవుడ్‌లో సూపర్ స్టార్‌డమ్‌ని సంపాదించుకుంది. వివాహానంతరం సినిమాలకు బ్రేక్‌నిచ్చి పూర్తిగా కుటుంబానికి పరిమితమైపోయింది. తాజా సమాచారం ప్రకారం ఆమె తెలుగులో రీఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. ప్రభాస్ 'స్పిరిట్'లో కీలకమైన అతిథి పాత్ర కోసం చిత్ర బృందం కత్రినాను సంప్రదించారని, ఆమె సుముఖత వ్యక్తం చేసిందని ఫిల్మ్‌నగర్ టాక్. 'స్పిరిట్' సినిమా ఇప్పటికే 40 శాతం షూటింగ్‌ని పూర్తిచేసుకుంది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై పాన్ ఇండియస్థాయిలో భారీ అంచనాలున్నాయి. కెరీర్‌లో తొలిసారి ప్రభాస్ పోలీస్ పాత్రను పోషిస్తుండటంతో ఆయన అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు

# మహిళా ప్రధాన కథకు గ్రీన్‌సిగ్నల్?



కథ, పాత్ర సరిగ్గా లేకపోతే సినిమా అంగీకరించరు సాయిపల్లవి. సాధ్యమైనంత వరకూ ఆమె నటించే సినిమాల్లో బలమైన కథలే ఉంటాయి. పాత్రలు కూడా బరువుగానే ఉంటాయి. ప్రస్తుతం బాలీవుడ్ పాన్ ఇండియా మూవీ 'రామాయణ'లో సీతాగా సాయిపల్లవి నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే మణిరత్నం సినిమాకు కూడా ఈ అందాలభామ ఓకే చెప్పింది. కాకపోతే 'తండేల్' తర్వాత తెలుగులో ఏ కథనూ సాయిపల్లవి ఓకే చెయ్యలేదు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం దర్శకుడు తిరుమల కిశోర్ ఇటీవలే సాయిపల్లవికి ఓ కథ వినిపించారట. మహిళా ప్రధానంగా సాగే ఈ కథలో.. దైవిక శక్తులు, పురాణాల టచ్ కూడా ఉందట. కథలోని భావోద్వేగాలు, పాత్ర ప్రాధాన్యత సాయిపల్లవిని ఆకట్టుకున్నాయని, ఈ ప్రాజెక్ట్‌పై ఆమె సానుకూలంగానే స్పందించినట్టు తెలుస్తున్నది. ఇక దీనిపై సాయిపల్లవి నుంచి అధికారికంగా గ్రీన్‌సిగ్నల్ వస్తే, ఇతర నటీనటులు, నిర్మాతల వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.

చిత్రం



# బాలకృష్ణకు శస్త్రచికిత్స

అగ్ర కథానాయకుడు బాలకృష్ణ ఇటీవల తన 111వ సినిమా షూటింగ్‌లో గాయపడిన విషయం తెలిసిందే. కాకినాడ పోర్ట్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా జరిగిన ప్రమాదంలో ఆయన కాలి కండరాలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం ఆయన్ని హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. గురువారం ఆయన మోకాలికి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. సుశిక్షితులైన వైద్యబృందం పర్యవేక్షణలో మూడు గంటల పాటు శస్త్ర చికిత్స జరిగిందని, అనుకున్న ప్రణాళిక ప్రకారం ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని ఏఐజీ ఆసుపత్రి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ గౌతమ్ చౌదరి తెలిపారు. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆయన కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని హెల్త్ బులెటిన్‌లో పేర్కొన్నారు.



# రాధా రమణ రాగాలు మనసున మోగే వేళలో

అగ్ర దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళి పిక్చర్స్ పతాకంపై నిర్మితమవుతున్న ప్రేమకథ 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా వేణుగోపాల్‌రెడ్డి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మాత. సెప్టెంబర్ 3న సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈసినిమాలోని తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు.'రాధా రమణ రాగాలు మనసున మోగే వేళలో.. ఏదో తపన తాగేసి వయసులు ఊగే వేళలో..' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాయగా, వాసుకి వైభవ్ స్వరపరిచి, ఆలపించారు. హీరోహీరోయిన్ల మధ్య పొయెటిక్ రొమాంటిక్ ఫీల్‌తో ఈ పాటను చిత్రీకరించినట్టు మేకర్స్ తెలిపారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని వారన్నారు. ఉపేంద్ర లిమాయె, వెంకటేశ్ కాకుమాను, నరేంద్ర రవి, మణి, సోహాన్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పవన్ పప్పుల.



# శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో?

టాలీవుడ్‌లో క్రేజీ కాంబినేషన్‌కి రంగం సిద్ధమైంది. 'ఉప్పెన'ఫేం వైష్ణవ్ తేజ్ కథానాయకుడిగా కొత్తబంగారు లోకం, సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి బ్లాక్‌బస్టర్స్‌ని అందించిన శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో సినిమా రానున్నట్టు ఫిల్మ్ వర్గాల్లో టాక్ వినిపిస్తున్నది. ఇటీవలే వైష్ణవ్‌కి శ్రీకాంత్ అడ్డాల కథ వినిపించారట. తనదైన భావోద్వేగాలతో విభిన్నంగా సాగే ఈ ప్రేమకథ వైష్ణవ్ తేజ్‌కి బాగా నచ్చిందని వినికిడి. ఈ సినిమాను ఎవరు నిర్మిస్తారు? అనే విషయం తెలియాల్సి వుంది. ఈ సినిమాకు చెందిన అధికారిక ప్రకటన త్వరలో వచ్చే అవకాశం ఉంది.



# జాతీయ అవార్డు బాధ్యతను పెంచింది

ఇటీవల ప్రకటించిన జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో 2024 సంవత్సరానికిగాను '35-చిన్న కథ కాదు' చిత్రం ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికైన విషయం తెలిసిందే. నివేధా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ ప్రధాన పాత్రల్ని పోషించారు. నందకిషోర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సృజన్ యర్రబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మాతలు. గురువారం ఈ సినిమా తాలూకు స్క్రీన్‌ప్లే పుస్తకాన్ని ఆవిష్కరించారు. 2018లో ఓ చిన్న ఆలోచనతో మొదలైన ఈ సినిమా ప్రయాణం జాతీయ అవార్డును గెలుచుకునే వరకు వెళ్లడం ఓ మధురజ్ఞాపకమని, ఇది తమపై మరింత బాధ్యతను పెంచిందని, ఈ సినిమా స్క్రీన్‌ప్లే పుస్తకం చాలా మందికి ఉపయుక్తంగా ఉంటుందని దర్శకుడు నందకిషోర్ తెలిపారు. రెండేళ్ల తర్వాత కూడా ఈ సినిమా గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటున్నారని, ఇప్పుడీ సినిమా ఘనత ఢిల్లీ వరకు చేరిందని హీరో విశ్వదేవ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



# టైటిల్ మార్చాల్సి వచ్చింది!

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కర్మాఖ్య'. అభినయకృష్ణ దర్శకత్వంలో శ్రీవాణీనాథ్, యశ్వంత్‌రాజ్ నిర్మిస్తున్నారు. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ట్రైలర్‌ను సీనియర్ నటి విజయశాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'తొలుత ఈ సినిమాకు 'కామాఖ్య' అనే టైటిల్ పెట్టాం. అయితే కొన్ని కారణాల వల్ల టైటిల్ మార్చాల్సి వచ్చింది. అమ్మవారి అంశాలు కలిగిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఆద్యంతం అనూహ్య మలుపులతో ఉత్కంఠను పంచుతుంది' అన్నారు. థియేటర్‌లో చూసి ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమా ఇదని నిర్మాత శ్రీవాణీనాథ్ తెలిపారు. ఆనంద్, శరణ్యప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గ్యాని, కథ, దర్శకత్వం: అభినయకృష్ణ.



# కామన్వెల్త్ సందడి షురూ

## అట్టహాసంగా ఆరంభ వేడుకలు

గ్లాస్గో: నాలుగేండ్లకోసారి వచ్చే మల్టీ స్పోర్టింగ్ ఈవెంట్ కామన్వెల్త్ గేమ్స్ సందడి మొదలైంది. గ్లాస్గో ఆతిథ్యం ఇస్తున్న 13వ ఎడిషన్ ప్రారంభోత్సవాన్ని గురువారం అర్ధ రాత్రి ఇక్కడి ఒవో హైడ్రో స్టేడియంలో అట్టహాసంగా నిర్వహించారు. లవ్ లెటర్ టు గ్లాస్గో (గ్లాస్గోకు ప్రేమలేఖ) అనే ప్రత్యేక థీమ్‌తో రూపొందించిన ఈ వేడుకను కామన్వెల్త్ చరిత్రలోనే తొలిసారిగా ఇండోర్ అరీనాలో నిర్వహించారు. బకింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి తీసుకొచ్చిన కింగ్స్ బ్యాటన్ సందేశాన్ని చదివి బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్-3 గేమ్స్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆతిథ్య స్కాట్లాండ్ సంస్కృతిని, కామన్వెల్త్ దేశాల ఆత్మీయతను ప్రతిబింబించేలా కేటీ టన్ స్టాల్, నాథన్ ఈవాన్స్, కాలమ్ బిటీ, నీనా నెస్బిట్ వంటి ప్రముఖ సంగీత కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. కామన్వెల్త్ కూటమికి చెందిన 74 దేశాల అథ్లెట్లతో నిర్వహించిన పరేడ్ ఈ వేడుకకే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ మార్చ్‌ఫాస్ట్‌లో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను త్రివర్ణ పతాకాన్ని, బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్ కింగ్స్ బ్యాటన్‌ను చేతబూని భారత జట్టును ముందుండి నడిపించారు.

### భారత్‌కు డోపింగ్ మరక

మెగా గేమ్స్‌లో ప్రారంభోత్సవానికి ముందే భారత బృందంలో డోపింగ్ కలకలం రేగింది. జుడోకా అరుణ్ కుమార్ ఔట్ ఆఫ్ కాంపిటీషన్ డోప్ టెస్టులో విఫలమయ్యాడు. దాంతో 14 మందితో కూడిన భారత కామన్వెల్త్ బృందం నుంచి అతడిని తప్పించారు. వెయిట్ లిఫ్టర్ దిల్‌బాగ్ సింగ్‌ను గేమ్స్ నుంచి భారత్ విత్‌డ్రా చేసుకుంది. కామన్వెల్త్ క్వాలిఫికేషన్ టైమ్‌లో భారత లిఫ్టర్లు యాంటీ డోపింగ్ రూల్స్‌ను ఉల్లంఘించిన నేపథ్యంలో వెయిట్‌లిఫ్టింగ్‌లో ఒక కోటాను తగ్గించడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

## లవ్లీనాకు పతకం ఖాయం

గ్లాస్గో: కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. రింగ్‌లోకి దిగకముందే భారత స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్ పతకం ఖాయం చేసుకుంది. మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనాకు తొలి రౌండ్‌లో బై లభించింది. దాంతో తను నేరుగా ఈ నెల 31న జరిగే సెమీఫైనల్లో పోటీ పడనుంది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఆమెకు కనీసం కాంస్యం లభించనుంది. కాగా, ఒలింపిక్ మెడలిస్ట్ అయిన లవ్లీనాకు కామన్వెల్త్‌లో ఇదే మొదటి పతకం కావడం విశేషం.

### లాన్ బౌల్స్‌లో శుభారంభం

గేమ్స్ తొలి రోజు జరిగిన లాన్ బౌల్స్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటారు. పురుషుల సింగిల్స్ సెక్షన్ -డి తొలి మ్యాచ్‌లో పుతుల్ సానోవాల్.. 2023 వరల్డ్ చాంపియన్ ర్యాన్ బెస్టర్ (కెనడా)పై టై బ్రేక్‌లో విజయం సాధించి శుభారంభం చేశాడు. విమెన్స్ పెయిర్ ఈవెంట్ సెక్షన్-బి తొలి మ్యాచ్‌లోభారత ద్వయం రూపా రాణి-పింకి సింగ్ ద్వయం మాల్టా దేశానికి చెందిన ప్రత్యర్థులపై టై బ్రేక్‌లో గెలుపొందింది.

### యువ భారత్‌దే సిరీస్

కొలంబో: శ్రీలంక టూర్‌ను భారత అండర్-19 జట్టు ఘనవిజయంతో ముగించింది. గురువారం ముగిసిన రెండో యూత్ టెస్టులో యువ భారత్ 211 పరుగుల భారీ తేడాతో శ్రీలంక అండర్-19ను చిత్తు చేసింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-0తో గెలుచుకుంది. భారత్ నిర్దేశించిన 472 పరుగుల ఛేదనలో ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 260కే ఆలౌట్ అయింది. ఆఖరి రోజు భారత విజయానికి ఆరు వికెట్లు కావాల్సి ఉండగా స్పిన్నర్ రోహిత్ యాదవ్ (4/49), సుభాష్ (3/27) రాణించడంతో ఈ టెస్టు టీమిండియా వశమైంది.

## సింధు, సేన్ ఔట్



చాంగ్జౌ: చైనా ఓపెన్ సూపర్ 1000 టోర్నీలో భారత పోరాటం ముగిసింది. సింగిల్స్ విభాగాల్లో మిగిలిన ముగ్గురు షట్లర్లూ ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిబాట పట్టారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధుతో పాటు మెన్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి తమ ప్రత్యర్థుల చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు. మొదట సింధు.. 21-16, 20-22, 18-21తో చెన్ యు ఫీ (చైనా) చేతిలో పోరాడి ఓడింది. రెండేండ్ల తర్వాత ఇటీవలే జపాన్ ఓపెన్ గెలిచిన జోష్‌లో ఉన్న సింధు.. చైనా మాస్టర్స్‌లో మాత్రం ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోయింది. ఇక మరో స్టార్ షట్లర్ లక్ష్య.. 19-21, 11-21తో విక్టర్ లై (కెనడా) జోరు ముందు తేలిపోయాడు. తొలి రౌండ్‌లో మెరుగ్గా ఆడిన ఆయుష్ ప్రిక్వార్టర్స్‌లో మాత్రం 21-15, 13-21, 20-22తో నాట్ ఎన్‌గుయెన్ చేతిలో పరాభవం పాలయ్యాడు.

# హమ్మయ్య.. గెలిచాం

## తొలి టీ20లో జింబాబ్వేపై భారత్ ఘనవిజయం • వైభవ్ మెరుపులు



వైభవ్ (50)


హరారే: వరుసగా రెండు సిరీస్ ఓటముల తర్వాత భారత టీ20 జట్టు ఎట్టకేలకు గెలుపు బాట పట్టింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం హరారే వేదికగా జరిగిన తొలి పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో ఏడు ఓటముల తర్వాత గెలుపు రుచిని ఆస్వాదించింది. జింబాబ్వే నిర్దేశించిన 126 పరుగుల స్వల్ప ఛేదనలో వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50) మెరుపులకు తోడు ఇషాన్ కిషన్ (35) రాణించడంతో భారత్.. 13.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో రెండు నెలల క్రితం భారత టీ20 సారథ్య పగ్గాలు అందుకున్న అయ్యర్ టీమిండియా సారథిగా తొలి విజయాన్ని అందుకున్నాడు. తొలుత భారత బౌలర్లు కట్టడిచేయడంతో జింబాబ్వే 125/7 స్కోరు మాత్రమే చేసింది. వెస్లీ మధెవెరె (34 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 39) టాప్ స్కోరర్. బంతితో రాణించిన మయాంక్ (2/18)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శనివారం రెండో టీ20 జరుగుతుంది.

### వైభవ్ 'తొలి' ధనాధన్

ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శనతో జాతీయ జట్టులోకి వచ్చిన వైభవ్.. ఇంగ్లండ్ సిరీస్‌లో నిరాశపరిచినా తనకు అచ్చొచ్చిన హరారే పిచ్‌పై జింబాబ్వే బౌలర్లపై పిడుగులా విరుచుకుపడ్డాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇక్కడే జరిగిన అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్ (80 బంతుల్లో 175 రన్స్‌తో)లో దుమ్మురేపిన వైభవ్.. ఫస్ట్ టీ20లో అదే జోరును కొనసాగించాడు. ఎంగరవ వేసిన రెండో ఓవర్లోనే రెండు సిక్స్‌లు, బౌండరీతో 20 రన్స్ దండుకున్నాడు. అభిషేక్ (1) విఫలమైనా వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్‌తో కలిసి స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఎవాన్స్ బౌలింగ్‌లో 4,6 బాదిన ఈ బీహార్ చిన్నోడు.. ముజరబాని 5వ ఓవర్లో ఒక సిక్స్, రెండు ఫోర్లు దంచాడు. మరో ఎండ్‌లో ఇషాన్.. న్యామహూరీ ఓవర్లో మూడు బౌండరీలు బాదాడు. పవర్ ప్లే తర్వాత ఎంగరవ విసిరిన ఓవర్లో మొదటి బంతికి రెండు రన్స్ తీసి 18 బంతుల్లో అర్ధశతకం పూర్తిచేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతడికి ఇదే తొలి ఫిఫ్టీ. అయితే ఆ తర్వాతి బంతికే అతడు నిష్క్రమించాడు. వైభవ్ ఔటైనా శ్రేయస్ (28 నాటౌట్)తో కలిసి మూడో వికెట్‌కు 46 రన్స్ జోడించిన ఇషాన్ విజయానికి 12 పరుగుల దూరంలో పెవిలియన్ చేరాడు. అయితే కెప్టెన్ శ్రేయస్, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ (6 నాటౌట్) లాంఛనాన్ని ముగించారు.

### పేసర్ల కట్టడితో..

అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే భారత యువ పేసర్ల ధాటికి తొలి బంతి నుంచే విలవిల్లాడింది. రీఎంట్రీలో



మయాంక్ (2/18)

మయాంక్ ఫస్ట్ బాల్‌కే బెనెట్ (0)ను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచాడు. ప్రిన్స్, అరంగేట్ర పేసర్ అశోక్ శర్మ లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడంతో ఆతిథ్య జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. 7 ఓవర్లకు 31/3తో నిలిచిన జింబాబ్వే.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఆదుకుంటాడనుకున్న సారథి సికందర్ రజా (4)ను దూబే పెవిలియన్‌కు పంపాడు. బర్ల్ (26), మరుమణి (27) సాయంతో మధెవెరె ఆదుకోవడంతో జింబాబ్వే ఆమాత్రం స్కోరైనా సాధించింది.

**1** అంతర్జాతీయ టీ20ల్లో ఫిఫ్టీ చేసిన యంగెస్ట్ బ్యాటర్‌గా 15 ఏండ్ల 118 రోజుల వైభవ్ రికార్డు సృష్టించాడు..

### సంక్షిప్త స్కోర్లు

జింబాబ్వే: 20 ఓవర్లకు 125/7 (మధెవెరె 39, బర్ల్ 26, మయాంక్ 2/18, ప్రిన్స్ 2/19): **భారత్:** 13.2 ఓవర్లకు 126/3 (వైభవ్ 50, ఇషాన్ 35, ముజరబాని 2/26, ఎంగరవ 1/30)

## ఎవరీ అశోక్ శర్మ?

*నమస్తే తెలంగాణ క్రీడా విభాగం*



భారత ఫాస్ట్ బౌలింగ్ విభాగం అమ్ములపొదిలో మరో అస్త్రం చేరింది. గంటకు 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసిరే రాజస్థాన్ యంగ్ పేసర్ అశోక్ శర్మ జింబాబ్వేతో తొలి టీ20 మ్యాచ్‌లో బరిలోకి దిగి అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి టీమిండియాకు ఆడే స్థాయికి ఎదిగిన 24 ఏండ్ల అశోక్ ప్రయాణం స్ఫూర్తిదాయకం. జైపూర్ సమీపంలోని రాంపూర్ అనే చిన్న గ్రామానికి చెందిన అశోక్ తండ్రి ఓ రైతు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల ఇద్దరు కుమారుల్లో ఒకరిని మాత్రమే క్రికెట్‌లో ప్రోత్సహించగల పరిస్థితి నెలకొంది. దీంతో అశోక్ అన్న అక్షయ్ శర్మ (డిస్ట్రిక్ట్ లెవెల్ క్రికెటర్) తమ్ముడి కల కోసం తన ఆటను పక్కనబెట్టాడు. కుటుంబం చేసిన త్యాగానికి తగ్గట్టుగానే అశోక్ కష్టపడి జాతీయ స్థాయికి ఎదిగాడు. 2025-26 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అతను సంచలన ప్రదర్శన చేశాడు. 10 మ్యాచుల్లోనే 22 వికెట్లు పడగొట్టి టోర్నీ టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శనతో 2026 ఐపీఎల్ వేలంలో గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ రూ. 90 లక్షలకు దక్కించుకుంది. జీటీ హెడ్ కోచ్ ఆశీష్ నెహ్రా గైడెన్స్‌లో మరింత మెరుగైన అశోక్ పదునైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ధ్రువ్ జురెల్‌కు 154.2 కి.మీ. వేగంతో బంతిని విసిరి 2026 సీజన్‌లోనే ఫాస్టెస్ట్ బౌలర్‌గా నిలిచాడు. అశోక్ ప్రతిభను, పదునైన పేస్‌ను గుర్తించిన సెలెక్టర్లు ఈ టూర్‌కు ఎంపిక చేయగా.. కెప్టెన్ అయ్యర్ తొలి మ్యాచ్‌లోనే అతనికి చాన్స్ ఇచ్చాడు. ఈ పోరులో అశోక్ వికెట్ తీయకపోయినా 140 కి.మీ ప్లస్ పేస్‌తో ఫర్వాలేదనిపించాడు.

## టీమ్ రేసింగ్ విన్నర్ తృష్ణ సెయిలింగ్ క్లబ్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: సికింద్రాబాద్ క్లబ్ జీఎంఆర్ స్పోర్ట్స్ యూత్ ఓపెన్ రెగట్టా ఆప్టిమిస్ట్ క్లాస్ టీమ్ రేసింగ్ విభాగంలో తృష్ణ సెయిలింగ్ క్లబ్ చాంపియన్‌గా నిలిచింది. హుస్సేన్ సాగర్‌లో గురువారం ఉత్కంఠగా సాగిన ఫైనల్ రేసులో కృష్ణ, అడ్రియన్ ఆంటోనీ, విరాట్, ఖైరుల్ అఫెండీతో కూడిన తృష్ణ క్లబ్ స్థానిక తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్-1 జట్టుపై పైచేయి సాధించింది. ఎస్.కె. రమీజా భాను, మణి ఎన్, రవి బెన్నోలు , నరసింహతో కూడిన తెలంగాణ సెయిలింగ్-1, తృష్ణ సైలింగ్ క్లబ్ తుదిపోరులోతలో రేసు గెలవడంతో టైటిల్ విజేతను తేల్చేందుకు ఆఖరి నిర్ణయాత్మక రేసు నిర్వహించారు. ఇందులో అద్భుత ప్రతిభ కనబరిచిన తృష్ణ క్లబ్ విజయం సాధించింది.

## వాణిజ్య

### రూపాయి 20 పైసలు డౌన్



న్యూఢిల్లీ, జూలై 23: రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయి పతనానికి చేరువైంది. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 20 పైసలు పతనం చెంది 96.73 వద్దకు జారుకున్నది. గడిచిన రెండు నెలల్లో కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఇది రెండోసారి కావడం విశేషం. క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం రూపాయి పతనానికి ఆజ్యంపోసిందని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. 96.53 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు 96.45 నుంచి 96.73 స్థాయిలో కదలాడింది. ఈ ఏడాది మే 20న కరెన్సీ రికార్డు స్థాయి 96.86కి పడిపోయిన విషయం తెలిసిందే.

### 100 డాలర్లకు క్రూడ్

న్యూఢిల్లీ, జూలై 23: ముడి చమురు ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ నడుమ దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో సంక్షోభం తిరిగి ముదురుతున్నది. ఈ ప్రభావం అంతర్జాతీయ క్రూడాయిల్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే గురువారం బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ రేటు 6 శాతానికి పైగా ఎగిసి 100 డాలర్లను తాకింది. ఈ ఏడాది మే నెల నుంచి గమనిస్తే ఈ మార్కును ధరలు అందుకోవడం ఇదే తొలిసారి. ఇటు ఇరాన్ దాడులతో హార్ముజ్, అటు హౌతీల భయంతో ఎర్ర సముద్రంలో సరఫరా సజావుగా సాగడం లేదు. ఈ పరిస్థితి ఆయిల్ ధరలకు రెక్కలు తొడుగుతున్నది. గ్యాస్ ధరలూ నెల రోజులుగా ఎగబాకుతున్నాయి.

# సీసీఐపై సర్కార్ నిర్లక్ష్యం

**కేంద్రానికి ప్రతిపాదనలు పంపడంలో రాష్ట్ర ప్రభుత్వ జాప్యం**

**6వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమపై శీతకన్ను**

**మాట తప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**బీఆర్ఎస్ హయాంలో ఇండస్ట్రీ పునరుద్ధరణకు కృషి**

**అయినా కేంద్రం సహకారం లేక ఫలించని ప్రయత్నాలు**



మూతబడిన ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ

ఆదిలాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో మూతబడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కంపెనీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తున్నది. ఇది.. స్థానిక యువత ఉపాధికి, పరిశ్రమ అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నది. ఈ సిమెంట్ తయారీ సంస్థ తిరిగి ప్రారంభమైతే 6వేల మందికి ఉపాధి లభించడంతోపాటు వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికీ దోహదం చేయగలదు. దీంతో కంపెనీని తిరిగి ప్రారంభించాలంటూ సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో సాధన సమితి సభ్యులు ఇటీవల కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామిని కలువగా.. ఆయన సానుకూలత వ్యక్తం చేశారు.

### రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపితే పునరుద్ధరణ

కేంద్ర మంత్రితో కేటీఆర్ జరిపిన చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం కొరవడిందన్న సంకేతాలు రావడం గమనార్హం. సీసీఐ ప్రారంభానికి రేవంత్ సర్కార్ చొరవ చూపితే పరిశ్రమ పునరుద్ధరణ సాధ్యమయ్యే అవకాశాలున్నట్టు కూడా స్పష్టమైంది. కేవలం రూ.250 కోట్ల పెట్టుబడిని పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొస్తే సీసీఐని తెరువడం సాధ్యమేనని కేటీఆర్‌తో మంత్రి కుమార స్వామి అన్నట్టు సాధన సమితి సభ్యులు చెప్పారు. అయినప్పటికీ ఇప్పటిదాకా ప్రభుత్వం నుంచి ఆ దిశగా ఎలాంటి సమాచారం లేదని మంత్రి పేర్కొన్నట్టు వారు తెలిపారు. నిజానికి ముఖ్యమంత్రి ఆదిలాబాద్ పర్యటనలో సీసీఐని మళ్లీ ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ ఇప్పుడు కేంద్రం సానుకూలంగా ఉన్నా స్పందించకపోవడంపై జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఇదీ సంగతి..

ఆదిలాబాద్ పట్టణం శివారులో కేంద్ర ప్రభుత్వం 1982 ఆగస్టు 15న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కు అంకురార్పణ చేసింది. 807 ఎకరాల విస్తీర్ణంలో రోజుకు 1,200 టన్నుల ఉత్పాదక సామర్థ్యంతో ఈ కర్మాగారాన్ని రూ.47 కోట్ల వ్యయంతో నిర్మించింది. 1984 మేలో ఉత్పత్తి ప్రారంభమైంది. కాగా, 772 ఎకరాల్లో ప్లాంట్, దానికి అనుబంధంగా 170 ఎకరాల్లో టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేశారు. అలాగే 48 మిలియన్ టన్నుల సున్నపురాయి నిల్వలు, 32కేవీ విద్యుత్తు సరఫరా, నీటి సౌకర్యాలున్నాయి. ఈ పరిశ్రమపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 4వేల కుటుంబాలు ఉపాధి పొందేవి. ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు ఉండటంతో 1993 వరకు సంస్థ లాభాలను ఆర్జించింది. లెవీ ప్రకారం ఉత్పత్తి అయిన సిమెంట్‌లో 60 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కొనుగోలు చేసేవి. అయితే అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకువచ్చింది. ఈ విధానంలో సీసీఐకిచ్చిన ప్రోత్సాహకాలను కేంద్రం ఉపసంహరించుకున్నది. కోల్, జిప్సం, సున్నపురాయి తదితర ముడి సరుకులపై రాయితీని తొలగించింది. లెవీ విధానాన్ని కూడా ఎత్తివేసింది. దీంతో సీసీఐకి క్రమంగా నష్టాలు ప్రారంభమయ్యాయి. 1996నాటికి సీసీఐ పూర్తిగా నష్టాల్లో కూరుకుపోవడంతో యాజమాన్యం ఉత్పత్తిని నిలిపేసింది. ఈ నేపథ్యంలో 2008లో సీసీఐ ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ప్రకటించి పరిశ్రమను పూర్తిగా మూసివేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. దీంతో సీసీఐపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

### బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముమ్మర ప్రయత్నాలు

మూతబడిన సీసీఐని పునఃప్రారంభించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలనే చేసింది. ప్రధాన మంత్రి మోదీకి నాటి సీఎం కేసీఆర్ ఈ మేరకు లేఖలు కూడా రాశారు. అలాగే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్, బీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర మంత్రులను కలిసి సీసీఐని ప్రారంభించాలనీ కోరారు. తమ నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా వివిధ రాయితీలు కల్పిస్తామని కేంద్రానికి సూచించారు. ఈ క్రమంలోనే రామగుండం ఎరువుల కర్మాగారం తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 49:51 లేదా 51:49 నిష్పత్తిలో సంయుక్తంగా పరిశ్రమను నిర్వహించేందుకూ సిద్ధమని నాటి బీఆర్ఎస్ సర్కార్ స్పష్టం చేసింది. చివరకు సీసీఐని పూర్తిగా తెలంగాణ ప్రభుత్వానికే అప్పగించినా.. స్వాధీనం చేసుకుని నడపడానికి సిద్ధంగా ఉన్నట్టు కేంద్రానికి తెలియజేసింది. అయినా మోదీ సర్కార్ నుంచి స్పందనే కరువైంది. అయితే ఇప్పుడు కేంద్రం నుంచి సానుకూలత వస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం అశ్రద్ధ కనబరుస్తున్నది. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు జిల్లా అభివృద్ధి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీసీఐ పునరుద్ధరణకు కృషి చేయాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

### రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి



సీసీఐ పునరుద్ధరణ విషయంలో కేంద్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ సానుకూలంగా ఉన్నది. యాజమాన్యం కూడా కంపెనీని తిరిగి ప్రారంభించడానికి సిద్ధం. రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు ఇస్తే మిగతా నిధులను తాము సమకూర్చుకుని పరిశ్రమను ప్రారంభిస్తామని చెప్తున్నారు. సీసీఐ భూములను రక్షణ శాఖ, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఇచ్చేది లేదని కేంద్ర మంత్రి కూడా అంటున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన, సహకారం లేదు. కాబట్టి ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి కేంద్ర ప్రభుత్వం అడిగిన రూ. 250 కోట్లను సమకూర్చాలి. అది జరుగకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం.

**-విజ్జగిరి నారాయణ, సీసీఐ సాధన కమిటీ కో-కన్వీనర్**



## ధరలు తగ్గుతాయని వేచి చూడొద్దు!

**హైదరాబాద్ క్రెడాయ్ ప్రతినిధులు వెల్లడి**

**ఆగస్టు 28 నుంచి హైదరాబాద్ ప్రాపర్టీ షో**


సిటీబ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ) : 'రేటు ఆగదు... డిమాండ్ తగ్గదు' అనే సరికొత్త థీమ్‌తో 'క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో 2026' నిర్వహించనున్నట్టు హైదరాబాద్ క్రెడాయ్ అధ్యక్షుడు ఎన్ జైదీప్ రెడ్డి తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో క్రమంగా పెరుగుతున్న మౌలిక వసతులు, ఐటీ రంగ విస్తరణతో రియల్ ఎస్టేట్ రంగానికి తిరుగులేకుండా పోయిందని, రాబోయే రోజుల్లో ప్రాపర్టీ ధరలు మరింత పెరిగే అవకాశమే తప్ప తగ్గే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఆగస్టు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాపర్టీ షోను నిర్వహించనున్నట్టు గురువారం వెల్లడించారు. ఈ ప్రాపర్టీ షోలో 100కు పైగా రెరా ఆమోదిత ప్రాజెక్టులను అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. ఒకే వేదికపై ప్లాట్లు, విల్లాలు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నట్లు క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ జగన్నాథ్ రావు అన్నారు.

## గ్రామీణ భారతం ఆగమాగం

**తగ్గుతున్న కొనుగోలు శక్తి, పెరుగుతున్న అప్పులు**

**ప్రమాదకరంగా కుటుంబాల పొదుపు: నాబార్డ్ సర్వేలో వెల్లడి**

*న్యూఢిల్లీ, జూలై 23: దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి జారుకుంటున్నది. అస్తవ్యస్తమైన గ్రామీణ భారతం ముఖచిత్రాన్ని వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంక్ (నాబార్డ్) తాజా అధ్యయనం ఒక్కటి ఆవిష్కరించింది. గ్రామీణ ఆర్థిక పరిస్థితులు-సెంటిమెంట్స్ సర్వేలో కుటుంబస్తుల ఆదాయం పడిపోతున్నదని, వారి కొనుగోలు శక్తి తగ్గుతున్నదని, ద్రవ్యోల్బణం భయాలు వెంటాడుతుండగా.. పొదుపునకు దూరమై, అప్పులతో అవసరాలు తీర్చుకుంటూ, నమ్మకం లేని జీవితాలను గడుపుతున్నారని తేలింది మరి. దాదాపు రెండేండ్ల క్రితం (2024 సెప్టెంబర్) ఈ ద్వైమాసిక సర్వేను నాబార్డ్ మొదలుపెట్టగా.. గ్రామాల్లో ఇంత అధ్వానంగా పరిస్థితులు ఎప్పుడూ కనిపించకపోవడం గమనార్హం. ఆర్థికంగా చితికిపోతున్న ఎన్నో గ్రామీణ కుటుంబాలు.. స్థానిక వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుంటున్నాయి. ఇక అప్పు పుట్టని వారు బంధువులు, మిత్రుల వద్ద చేయి చాచాల్సిన దుస్థితి నెలకొన్నదని సర్వే చెప్తున్నది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ సర్వే జరిగింది.*



***ఆదాయం అంతంతే..***

*తాజా సర్వేలో ఏడాది క్రితంతో పోల్చితే ఆదాయం పెరిగిన గ్రామీణ కుటుంబాలు 27.7 శాతంగానే ఉన్నాయి. సర్వే మొదలైనప్పట్నుంచి చూస్తే ఇదే కనిష్ఠ స్థాయి. ఇక 52.6 శాతం కుటుంబాల ఆదాయం యథాతథంగానే ఉండగా.. 19.8 శాతం మందిది పడిపోయినట్టు స్పష్టమైంది. గత ఏడాది నవంబర్ నుంచి గ్రామీణుల ఆదాయం క్రమేణా క్షీణిస్తున్నట్టు సర్వే పేర్కొనడం ప్రమాద ఘంటికలను మోగిస్తున్నది ప్పుడు. ఇక పెరుగుతున్న ధరల దెబ్బకు గ్రామీణుల ఆదాయం అంతకంతకూ బలహీనపడుతున్నది. నిజానికి గ్రామాల్లో అత్యధికుల జీవనాధారం వ్యవసాయమే. ఎల్ నినో కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు.. ఇప్పుడు పంటల సాగునే ప్రశ్నార్థకం చేస్తున్నది. కొనుగోళ్లు పడిపోయి వ్యాపారాలూ ప్రభావితమవుతున్నాయి. జూలై లో వినియోగ వ్యయం 74.1 శాతానికి దిగజారింది. మే నెలలో ఇది 77.2 శాతంగా, నిరుడు జూలైలో 76.6 శాతంగా ఉన్నది. ఇక ఆదాయం లేక పొదుపు వైపే గ్రామీణులు చూడట్లేదని సర్వే చెప్తున్నది.*

## ఇన్ఫోసిస్ లాభం 7,769 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23: ఇన్ఫోసిస్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.7,769 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 12.2 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 14 శాతం ఎగబాకి రూ.48,211 కోట్లకు చేరుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికిగాను ఆదాయంలో వృద్ధి 1.5 శాతం నుంచి 3 శాతం లోపు ఉండవచ్చునని తన గైడెన్స్‌లో పేర్కొంది. స్థూల ఆర్థిక పరిస్థితులు అనిశ్చితిగా ఉండటం వల్లనే ఈ ఏడాది ఆదాయంలో వృద్ధి సింగిల్ డిజిట్‌కు పరిమితంకానున్నదని కంపెనీ సీఈవో, ఎండీ సలీల్ పరేఖ్ తెలిపారు. ఉద్యోగుల పరిహారం పెంపు రెండు విడుతలుగా అక్టోబర్, జనవరి నుంచి



అమల్లోకి తీసుకురానున్నట్టు చెప్పారు. ఇన్ఫోసిస్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. కంపెనీ సీఈవోగా ఆశీష్ కుమార్ దాస్ నియమితులయ్యారు. ఈ నియామకం వచ్చే ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నది.

## నష్టాల ఊబిలో స్టాక్ మార్కెట్లు

ముంబై, జూలై 23: దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల పరంపర కొనసాగుతున్నది. వరుసగా నాలుగోరోజూ గురువారం కూడా సూచీలు భారీగా నష్టపోయాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కారణంగా మదుపర్లలో సెంటిమెంట్ నీరుగారింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 363.66 పాయింట్ల నష్టంతో 76,391.39 వద్దకు పడిపోయింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 126.65 పాయింట్లు కోల్పోయి 23,869.60 వద్ద స్థిరపడింది. దీంతో గత నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,760 పాయింట్లు లేదా 2.25 శాతం నష్టపోగా, నిఫ్టీ కూడా 464.70 పాయింట్లు లేదా 1.90 శాతం పతనం చెందాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శుక్రవారం 24 జూలై 2026 | HYDERABAD

## క్యూర్ బిల్లుపై ఎమ్మెల్యే మర్రి అభ్యంతరాలు



హైదరాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ): ప్రతిపాదిత క్యూర్ బిల్లులో పొందుపర్చిన పలు నిబంధనలపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌కు సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. బిల్లును చట్టంగా అమలు చేసే ముందు అన్ని కోణాల్లో సమగ్రంగా పునఃసమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగం కల్పించిన స్వయం ప్రతిపత్తి, అధికార వికేంద్రీకరణ సూత్రాలను ఈ బిల్లు బలహీనపరుస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.'పట్టణాభివృద్ధి ప్రజాస్వామ్య వికేంద్రీకరణతో కలిసి సాగాలి. క్యూర్ బిల్లు స్థానిక సంస్థలను బలోపేతం చేయాలి తప్ప..బలహీనపరచకూడదు. ప్రజలకు పాలనలో మరింత భాగస్వామ్యం, అందుబాటు ధరల్లో మున్సిపల్ సేవలు, బాధ్యతాయుతమైన స్థానిక పాలన లభించాలి. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి.. ప్రజాహితం దృష్ట్యా బిల్లులో తగిన మార్పులు చేస్తుందని ఆశిస్తున్నా.' అని ఎమ్మెల్యే మర్రి అన్నారు.

## బీఎల్‌వోల దగ్గరే కుప్పలుగా ఫారాలు



సిటీబ్యూరో: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ గ్రేటర్‌లో నత్తనడకన సాగుతున్నది. బీఎల్‌వోల నిర్లక్ష్యం, ఎన్నికల కమిషన్ అధికారుల అలసత్వం, ఓటర్ల అవగాహనలోపంతో సర్ ప్రక్రియలో గందరగోళం నెలకొంది. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్యుమరేషన్ ఫారాలు ఇప్పటికీ బీఎల్‌వోల దగ్గర కుప్పలుగా పడి ఉన్నాయి. గ్రేటర్ వ్యాప్తంగా ఏ పోలింగ్ కేంద్రంలో చూసినా వివరాలు నింపకుండా, ఓటర్లకు పంపిణీ చేయకుండా ఉన్న ఖాళీ ఎన్యుమరేషన్ ఫారాలు దర్శనమిస్తున్నాయి. పంపిణీ వంద శాతం పూర్తయినట్లు అధికారిక లెక్కలు చెప్తున్నా.. తమ వద్దే ఎందుకు పెట్టుకున్నారని బీఎల్‌వోలను ప్రశ్నిస్తే.. ఓటర్లు వచ్చి తీసుకెళ్లడం లేదని బదులిస్తున్నారు. అదేవిధంగా వివరాలు నమోదు చేసిన ఫారాలు కూడా అలాగే అట్టిపెట్టుకుంటున్నారు. ఇదేమిటని అడిగితే.. ఆన్‌లైన్ ప్రక్రియలో సమస్యలొస్తున్నాయని చెబుతున్నారు. ఇవన్నీ చూస్తుంటే ఆగస్టు 3 నాటికి గ్రేటర్‌లో సర్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు ఏమాత్రం కనిపించడంలేదు. కాగా, కీలకమైన డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా 50 శాతం కూడా దాటకపోవడం గమనార్హం.



### పుట్టిన రోజు వేడుకలకు కేటీఆర్ దూరం • విద్యార్థుల ఉద్యమానికి మద్దతు



ఇందిరాపార్కు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

# గులాబీ దండు..పోరుబాట

### నేడు ఇందిరాపార్క్ వద్ద బీఆర్‌ఎస్వీ నిరసన

సిటీబ్యూరో: నీట్‌లో అవకతవకలపై ఉద్యమిస్తున్న విద్యార్థి, యువతపై దాష్టీకానికి పాల్పడుతున్న మోడీ సర్కారుపై నిరసన గళమెత్తేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. విద్యార్థులపై ఢిల్లీ సర్కారు అణచివేత, దమనకాండకు వ్యతిరేకంగా విద్యార్థులకు సంఘీ భావంగా పోరుబాట పట్టనున్నది. ఈ మేరకు శుక్రవారం ఇందిరాపార్క్‌లో పార్టీ విద్యార్థి విభాగం(బీఆర్ఎస్వీ) ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. తన 50వ పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న ఆయన.. విద్యార్థి ఉద్యమానికి అండగా నిలువనున్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యార్థులు, నిరుద్యోగులకు చేస్తున్న అన్యాయాలను ఎలుగెత్తి చాటనున్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత యువత కోసం చేపట్టనున్న కార్యక్రమాలు, ఉద్యోగాల భర్తీ, పరీక్షల నిర్వహణలో తీసుకు వచ్చే సంస్కరణలపై స్పష్టమైన ప్రకటన చేయనున్నారు.

**ఏర్పాట్ల పరిశీలన**

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేస్తున్న యువతపై కేంద్ర ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా ఇందిరాపార్కు వద్ద శుక్రవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ కోరారు. ఈ మేరకు ఇందిరా పార్కు వద్ద చేపట్టే నిరసన కార్యక్రమం ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని తెలిపారు.

## మెట్రో జాప్యం ఖరీదు
# ₹4 వేల కోట్లు
### ఏటా పెరుగుతున్న అంచనా వ్యయం

పాలకుల నిర్లక్ష్యం హైదరాబాద్ మెట్రో పాలిట శాపంగా మారింది. వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రూపొందించిన మెట్రో విస్తరణ ప్రణాళికలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నాన్చివేత, కమిటీల అధ్యయనాల్లో జరుగుతున్న కాలయాపన ఫలితంగా ప్రాజెక్టు అంచనా వ్యయం నానాటికీ పెరిగిపోతున్నది. గతంలో పంపిన డీపీఆర్ ప్రకారం కిలో మీటర్ నిర్మాణానికి రూ. 270 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయగా.. తాజాగా ఇది రూ. 314 కోట్లకు చేరినట్టుగా తెలిసింది.

- హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ)



### తాజాగా కి.మీ.కు రూ.44 కోట్ల భారం

### అధ్యయనాల పేరుతో కాలయాపన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

మెట్రో ప్రాజెక్టు ఆలస్యం అవుతున్నకొద్దీ ఏటా కిలోమీటర్‌కు రూ.44 కోట్ల వరకు అదనపు భారం పడుతున్నదని, ప్రాజెక్టు ప్రాథమిక ప్రతిపాదనలు, కారిడార్ల విభజన, సవరణల కారణంగా మొత్తం ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో వచ్చిన వ్యత్యాసం దాదాపు రూ. 4 వేల కోట్లకు మించిపోయేలా ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పార్ట్-ఏ, పార్ట్-బీ కింద ప్రతిపాదించిన మెట్రో రైలు ఏడు కారిడార్లతో 130 కిలోమీటర్లకు రూ. 36,680 కోట్లతో పంపిన డీపీఆర్‌కు మళ్లీ సవరణలు చేస్తే ఏకంగా రూ. 40వేల కోట్లకు పైగా చేరనున్నది.

### కేటీఆర్ జన్మదిన వేడుకలు.. సైకిళ్ల పంపిణీ



>IVలో



## డ్రైవింగ్ లైసెన్స్‌కు
# ₹5 వేలు
### వసూళ్లే లక్ష్యంగా.. ఏజెంట్ల దందా

### రంగారెడ్డి జిల్లా ఆర్టీఏ కార్యాలయాల్లో అన్నీ తామైన వైనం

### ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి..కలెక్షన్లు


సిటీబ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డిలోని మణికొండ, కొండాపూర్, ఇబ్రహీంపట్నం ఆర్టీఏ కార్యకలాపాలన్నీ ఏజెంట్ల చేతుల్లోకి వెళ్లిపోయాయి. కార్యాలయాల ఎంట్రీ గేటు నుంచి మొదలుపెడితే ఎగ్జిట్ గేట్ వరకు జరిగే ప్రతి పనిని వారే చక్కబెడుతున్నారు. ఒక్క లైసెన్స్‌కు రూ.5వేలు, ఫిట్‌నెస్‌కు రూ.2000, వాహన బదిలీలో యజమాని మరణిస్తే రూ.6000లు ఇలా ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి వసూళ్ల పర్వానికి తెరతీశారు. కార్యాలయాల్లోనూ, వాటి పక్కన సమాంతరంగా ఆఫీసులు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీఏ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

**ఆదేశాలు.. బేఖాతరు!**

ఇటీవల రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్టీఏ కార్యాలయాల్లోకి ఏజెంట్లు ప్రవేశిస్తే సంబంధిత ఆర్టీఓలదే బాధ్యత అని హెచ్చరికలు జారీ చేశారు. ప్రతీ ఆర్టీఏ కార్యాలయంలో 'బ్రోకర్లను ఆశ్రయించరాదు' అనే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం తమను ఎవ్వరూ ఆపలేరంటూ ఏజెంట్లు, కొందరు అధికారులు రెచ్చిపోతున్నారు. రంగారెడ్డి మణికొండ ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్లను అనుమతిస్తూ, వారు తీసుకొచ్చే పనులను చకచకా చేస్తూ వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. ఓ యువతి లెర్నింగ్ లైసెన్స్‌కు మణికొండ కార్యాలయానికి చేరుకోగా.. అక్కడే ఉన్న ఏజెంట్ వారితో డీల్ కుదుర్చుకుని ఆ పేపర్‌పై కోడ్ రాసి టెస్ట్ రూంలోకి పంపించారు. ఇంకేముంది.. లెర్నింగ్ జారీ అయిపోయింది. శాశ్వత లైసెన్స్ కూడా తామే ఇప్పిస్తామంటూ.. ఆమె వద్ద రూ.5వేలు వసూలు చేయడం గమనార్హం.

**అవి ఏజెంట్ల ట్రాక్‌లా.. ?**

కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో ఒక్క రోజుకు కనీసం 150 మందికి పైగా డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరవుతారు. వీళ్లలో వంద మందికి పైగా ఏజెంట్లతోనే హాజరవుతారు. ప్రతీ ట్రాక్ నెంబర్ వద్ద ఒక్కో ఏజెంట్ నిలబడి వారికి డ్రైవింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ఎవరైతే డబ్బులిస్తారో వారు ట్రాక్ నుంచి బయటకు వచ్చే వరకు వారితోనే ఉండి పని ముగిస్తారు. 8, హెచ్ తదితర రౌండ్స్‌పై ఎలాంటి అవగాహన లేకున్నా శాశ్వత లైసెన్స్ చేతుల్లో పెట్టేస్తున్నారు.



అంబేద్కర్ బస్తీలో ఆందోళన చేస్తున్న మూసీ బాధితులు

# డబుల్ ఇండ్ల కోసం ఆందోళన

**30 ఏళ్లుగా మురికి కూపాల్లో ఉంటున్నా మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోవడంలేదు**

**మూసారాంబాగ్ అంబేద్కర్ బస్తీవాసుల ఆగ్రహం**

మలక్‌పేట, జూలై 23: మూసీ సుందరీకరణ పేరిట ఇండ్లను కోల్పోయిన మూసారాంబాగ్‌లోని అంబేద్కర్ బస్తీవాసుల్లో కొందరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేసిన ప్రభుత్వం, మరికొందరికి మంజూరు చేయకపోవటంతో గురువారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఇచ్చినవారికే రెండుసార్లు ఇండ్లు ఇచ్చిన ప్రభుత్వం.. తాము 30 ఏళ్లుగా స్థానికంగా మురికికూపాల్లో నివసిస్తున్నప్పటికీ తమకు ఇండ్లు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ సర్కార్ ఇచ్చినవారికే రెండుసార్లు ఇళ్ల పట్టాలు ఇచ్చిందని, అదికూడా కనీసం గుడిసె కూడా లేకుండా జిల్లాల్లోని గ్రామాల్లో నివాసముంటున్న స్థానికేతరులకు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఈ విషయంలో లోతుగా దర్యాప్తు చేపట్టి స్థానికంగా ఉండే మూసీ బాధితులకు పంపిణీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఇందిరమ్మా.. ఇవేం వసూళ్లు

### టోకెన్ అమౌంట్ తిరిగివ్వరా?

### అకౌంట్ నంబర్ ఆప్షన్ లేకుండానే ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు ఫారాలు




**సిటీ బ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ):**

గ్రేటర్‌లో లక్ష ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రీలాంచ్‌ను తలపించేలా ఇందిరమ్మ ఇండ్ల పథకం తీరు ఉన్నది. నగరంలోని పేదలు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని, అందుకోసం ముందుగా రూ.100 చెల్లించాలని బ్రోచర్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా టోకెన్ అమౌంట్ కింద రూ.10 వేలు చెల్లించాలని.. ఇల్లు మంజూరు కానీ దరఖాస్తుదారులకు ఆ మొత్తాన్ని తిరిగిస్తామని విధి విధానాల్లో చూపారు. కానీ ఆ రూ.10 వేలు కూడా నొక్కేసే పరిస్థితులు క్షేత్రస్థాయిలో నెలకొన్నాయి. దరఖాస్తు ఫారంలో దరఖాస్తుదారుడి అకౌంట్ నంబర్ నమోదు చేసేలా ఆప్షన్ లేకపోవడంతో కంగుతింటున్నారు. ఒకవేళ ఇల్లు రాకపోతే ముందుగానే చెల్లించిన టోకెన్ అమౌంట్ తిరిగి ఎలా చెల్లిస్తారు? రూ.10 వేల టోకెన్ అమౌంట్ ఇల్లు మంజూరు కాని వాళ్లకు తిరిగి ఇవ్వరా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పైగా ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరు రూ.6 లక్షలు చెల్లించాలనే నిబంధన పెట్టడంతో పేదల సొంతింటి కలపై నీళ్లు చల్లినట్లయింది. బస్తీలు, గుడిసెల్లో నివసించే నిరుపేదలకు రూ.6 లక్షలు చెల్లించే స్థోమత ఎలా ఉంటుంది? అని నగరంలోని పేదలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. పేదలకు ఇచ్చే ఇండ్లతో వ్యాపారం చేయడం సరికాదంటున్నారు.

## బోనాల ఉత్సవాలపై నీలినీడలు!

### డిసెంబర్ నుంచి నిలిచిన నిర్వహణ నిధులు

సిటీబ్యూరో: బోనాల ఉత్సవాల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేయాల్సి ఉండగా, చార్మినార్, గోల్కొండ జోన్లు మినహా చాలా జోన్లలో టెండర్లు ఆహ్వానించలేదు. ఈ నేపథ్యంలోనే గత డిసెంబర్ నెల నుంచి బిల్లులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పెండింగ్ బకాయిలతో పాటు కొత్త పనులకు సంబంధించిన నిధులను విడుదల చేయకపోతే, ఉత్సవాలకు సంబంధించిన పనులన్నింటినీ నిలిపివేస్తామని కొందరు కాంట్రాక్టర్లు స్పష్టం చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికల్లా తొలుత మార్చి నెల వరకు ఉన్న బిల్లులన్నీ చెల్లిస్తామని అధికారులు చెబుతుంటే.. నెలాఖరు వరకు వేచి చూడటం వల్ల పండుగ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు కాంట్రాక్టర్లు. మొత్తంగా కాంట్రాక్టర్లను ఆదుకునేందుకు మార్చి నాటి బిల్లుల ప్రాసెసింగ్‌ను వీలైనంత త్వరగా ముగించి వెంటనే నిధులు విడుదల చేస్తారా? ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి విఘాతం కలగకుండా ఏ విధంగా చర్యలు తీసుకుంటారో అన్నది వేచి చూడాల్సిందే.



## ఇక న్యాయపోరాటమే..

### ఎలివేటెడ్ పరిహారంపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

### 28న న్యాయ నిపుణులతో బాధితుల ప్రత్యేక సమావేశం

సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ): రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఆస్తులు కోల్పోతున్నవారికి నష్టపరిహారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో బాధితులు న్యాయపోరాటానికి సిద్ధం అవుతున్నారు. హైకోర్టులో ఇప్పటికే నడుస్తున్న కేసుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణ, చట్టపరమైన అంశాలు, పరిహారం చెల్లింపుపై ఉన్న సందేహాల నివృత్తి వంటి అంశాలపై రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ చైర్మన్ సతీష్ గుప్తా ఆధ్వర్యంలో ఈనె 28న ఖార్ఖానాలో హైకోర్టు న్యాయవాదులు, న్యాయ నిపుణులతో.. బాధితులు సమావేశం కానున్నారు. దాదాపు 800కిపైగా బాధితులు, భూ యజమానులు ఈ సమావేశంలో పాల్గొంటారని సమాచారం.

## మసకబారుతున్న సైకిల్ ట్రాక్

### పట్టించుకోని యంత్రాంగం

### కూల్చివేతలు, మరమ్మతులతో సైక్లిస్టులకు ఇబ్బందులు



తెల్లాపూర్‌లోని సైకిల్ ట్రాక్‌పై పగుళ్లు

సిటీబ్యూరో: ఐటీ కారిడార్‌లోని ఓఆర్‌ఆర్ వెంట రూ. 93కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన 23 కిలోమీటర్ల సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్ ఖ్యాతి మసకబారుతోంది. ఏడాది కాలంగా నిర్వహణ లోపంతో ఈ ప్రపంచస్థాయి ట్రాక్ లోపభూయిష్టంగా మారుతున్నదని సైక్లిస్టులు, పర్యావరణవేత్తలు ఆవేదన చెందుతున్నారు. ట్రాక్‌లోని వట్టినాగుల పల్లి, కోకాపేట, నానక్‌రాంగూడ పరిసర ప్రాంతాల్లో అనేక చోట్ల పెద్ద ఎత్తున్న పగుళ్లు వస్తున్నాయి. ఇవి విస్తరించడంతో సైకిల్ సన్నని టైర్లు వాటిలో చిక్కుకుని సైక్లిస్టులు కింద పడి గాయపడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. దీనికి తోడు ట్రాక్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద భద్రత కోసం ఏర్పాటు చేసిన బొల్లార్డ్స్ విరిగిపోవడం, కొన్ని చోట్ల పూర్తిగా తొలగించారు. మరమ్మతుల నిర్లక్ష్యానికి తోడు, రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ నివారణ పేరిట అధికారులే ఈ ట్రాక్ నిర్మాణాలను కూల్చివేయడం వివాదాస్పదంగా మారింది. మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద వాహనాల రాకపోకల కోసం కొత్తగా యూ టర్న్, అండర్ పాస్ నిర్మించేందుకు అధికారులు దాదాపు సోలార్ రూఫ్ షెడ్లను పిల్లర్లను తొలగించడంపై సైక్లిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నమ్మకంతో ముందడుగు వేద్దాం : బీవోబీ



సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ) : నమ్మకంతో ముందడుగు వేద్దామనే నినాదంతో 119వ వార్షికోత్సవ వేడుకలను బ్యాంక్ ఆఫ్ బరోడా ఘనంగా నిర్వహించింది. గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్ సచిన్ టెండూల్కర్ పాల్గొని నూతన డిజిటల్ సేవలను ఆవిష్కరించారు. మరింత సురక్షితమైన, సులభంగా బ్యాంకింగ్ సేవలను అందించేలా కొత్త మొబైల్ బ్యాంకింగ్ యాప్, భవిష్యత్ బ్యాంకింగ్ పరిశోధనలు, డిజిటల్ మార్పుల కోసం ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్, కస్టమర్లతో బహుభాషల్లో వాయిస్ ద్వారా సంభాషించే ఏఐ వర్చువల్ అసిస్టెంట్, ప్రత్యేక గృహ రుణాలు, ఈవీ ఛార్జింగ్, బ్యాటరీ స్వాపింగ్ ఇన్‌ఫ్రాకు ఆర్థిక సాయం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రత్యేక రుణాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను పెంచేందుకు 119 కొత్త బిజినెస్ కరస్పాండెంట్ కేంద్రాల ప్రారంభం వంటి సేవలను బీవోబీ విస్తరిస్తుందని, కస్టమర్ల నమ్మకమే పునాదిగా, సుస్థిర అభివృద్ధి, ఆధునిక ఆవిష్కరణలతో బ్యాంకింగ్ సేవలను మరింత ముందుకు తీసుకెళ్తామని ఎండీ, సీఈవో డాక్టర్ దేబదత్త చంద్ స్పష్టం చేశారు.

# స్టాక్ ట్రేడింగ్ పేరుతో మోసం

సిటీబ్యూరో, జులై 23 (నమస్తే తెలంగాణ): స్టాక్ ట్రేడింగ్‌లో భారీ లాభాలొస్తాయంటూ నమ్మించి ఓ ప్రైవేట్ ఉద్యోగికి సైబర్‌నేరగాళ్లు రూ. 6.7 లక్షలు బురిడీ కొట్టించారు. నేరేడ్‌మెట్ ప్రాంతంలో నివాసముండే బాధితుడు అమెజాన్‌లో పనిచేస్తున్నాడు. కాగా ముకేష్ పేరుతో వాట్సాప్ గ్రూప్‌నకు ట్రేడింగ్ అవకాశం అంటూ మెసేజ్ వచ్చింది. అయితే పేరున్న గ్రో ప్లాట్ ఫామ్ పేరు వాడడంతో నిజమని నమ్మాడు. దీంతో సైబర్‌నేరగాళ్లు చెప్పినట్లు ట్రేడింగ్ ఫ్లాట్ పామ్‌కు సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. మొదట్లో తక్కువ మొత్తంలో స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టడంతో వాటికి లాభాలొచ్చాయి. నమ్మకం కుదరడంతో దఫ దఫాలుగా రూ. 7.8 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. స్క్రీన్‌పై లాభాలు కన్పించినా వాటిని విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా పోయింది. ట్యాక్స్‌లు చెల్లిస్తేనే డ్రా చేసుకోవడానికి వీలు కల్పిస్తామంటూ ఒత్తిడి తెచ్చారు. దీంతో ఇదంతా మోసమని బాధితుడు గుర్తించి మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా రూ. 7.8 లక్షలు పెట్టుబడి పెట్టడంతో అందులో రూ. లక్ష రూపాయల వరకు తిరిగి వచ్చాయని, రూ. 6.79 లక్షలు మోసపోయానంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.






# హ్యాపీ బర్త్‌డే కేటీఆర్ సర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, అభిమానులు తెలంగాణ భవన్ వద్ద ఆయన ఫొటోతో కూడిన భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆయా ఫ్లెక్సీల్లో.. "సకలగుణాభిరాముడు, ప్రజలు మెచ్చిన నాయకుడు, తండ్రికి తగ్గ తనయుడు" తదితర స్లొగన్స్ ఆకట్టుకుంటున్నాయి. - సిటీబ్యూరో



# వంతెనలు, ఫ్లైఓవర్ల భద్రతకు హైటెక్ నిఘా



సమావేశంలో సెంటినెల్ ఐక్యూ, ఐఐఐటీ ప్రతినిధులు, సీఎంసీ కమిషనర్ సృజన తదితరులు

మణికొండ, జూలై 23: నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, మౌలిక సదుపాయాల విస్తరణ నేపథ్యంలో వంతెనలు, ఫ్లై ఓవర్ల నిర్మాణ భద్రతపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దృష్టి సారించింది. నిర్మాణాల భద్రతను ఎప్పటికప్పుడు శాస్త్రీయంగా పర్యవేక్షించేందుకు కంటిన్యూస్ స్ట్రక్చర్ హెల్త్ మానిటరింగ్(సిఎస్‌హెచ్‌ఎం) వ్యవస్థ అమలుపై సెంటినెల్ ఐక్యూ, ఐఐఐటీ హైదరాబాద్ ప్రతినిధులతో సీఎంసీ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధునాతన సెన్సార్ ఆధారిత సాంకేతిక, డేటా అనలిటిక్స్ వినియోగంతో వంతెనలు, ఫ్లైఓవర్ల నిర్మాణ స్థితిని 24 గంటలూ పర్యవేక్షించే విధానంపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎంసీ కమిషనర్ సృజన మాట్లాడుతూ నగరాభివృద్ధికి అనుగుణంగా మౌలిక సదుపాయాల నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగం అవసరమని అన్నా రు. వంతెనలు, ఫ్లై ఓవర్ల భద్రత, మన్నిక, దీర్ఘకాలిక నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు కంటిన్యూ స్ స్ట్రక్చర్ హెల్త్ మానిటరింగ్ వంటి వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.



373వ రోజు నిరసన దీక్షల్లో పాల్గొన్న భాగ్యనగర్ మ్యుచువల్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఉద్యోగులు

## కొనసాగుతున్న బీటీఎన్‌జీవోల భూపోరాటం

శేరిలింగంపల్లి, జూలై 23: గోపన్‌పల్లిలో భాగ్యనగర్ మ్యుచువల్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ (బీటీఎన్‌జీవోస్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూపోరాటం గురువారంతో 373వ రోజుకు చేరుకుంది. బీటీఎన్‌జీవోలకు చెందిన భూములను ప్రభుత్వం తిరిగి అప్పగించాలని, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోంచి తమ భూములను కాపాడి తమకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పలువురు బీటీఎన్‌జీవో ఉద్యోగులు, పెన్షనర్లు, మహిళా ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ప్రెసిడెంట్ ముత్యాల సత్యనారాయణ గౌడ్, సెక్రెటరీ మల్లారెడ్డి, డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, కెశియానాయక్, రషీదాబేగం, ఉద్యోగులు, పెన్షనర్లు, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేంద్రం అరాచకాలకు కోర్టులు సమాధానం చెప్పాలి



ర్యాలీలో పాల్గొన్న సాంబశివరావు, పల్లావెంకట్‌రెడ్డి తదితరులు

కవాడిగూడ, జూలై 23ః ఢిల్లీలో జరుగుతున్న కేంద్ర అరాచకాలపై సుప్రీంకోర్టు, హైకోర్టులు ఖచ్చితంగా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని ఖండిస్తూ సీపీఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో లిబర్టీ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని , సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఈ.టి. నర్సింహ, శ్రీనివాసరావు, కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్, హేమంత్‌రావు, వి.ఎస్.బోస్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బొమ్మగాని ప్రభాకర్, పాలమాకుల జంగయ్య, అందోజు రవీంద్రాచారి, జ్యోతి, ఎస్.బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఢిల్లీ ఘటనపై విచారణ చేయాలని ఒకరు ఢిల్లీ హైకోర్టుకి వెళ్తే విచారణ చేయకుండా ఆ ఘటనలతో తమకు సంబంధంలేదని తమను భాగస్వాములను చేయొద్దని చెప్పడం, మరొకరు సుప్రీంకోర్టుకి వెళ్తే ఇటువంటి వాటితో తమ సమయాన్ని వృధా చేయొద్దని, మీ సమయం వృధా చేసుకోవద్దని, ఇది మాకు సంబంధంలేని అంశం అని చెప్పడం విచారకరమన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగాన్ని గుప్పిట్లో పెట్టుకోవడానికే కేంద్రం నీట్ పరీక్షలను నిర్వహిస్తోందన్నారు.

## నేడు తెలంగాణ బంద్‌ను విజయవంతం చేస్తాం

ఎల్బీనగర్, జూలై 23 : తెలంగాణ వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయడంతో పాటుగా చలో గాంధీ భవన్‌కు పిలుపునిస్తున్నామని తెలంగాణ నిరుద్యోగుల జేఏసీ అధ్యక్షుడు ఇంద్రానాయక్ అన్నారు. గురువారం రాత్రి దిల్‌సుఖ్ నగర్‌లో నిరుద్యోగ జేఏసీ నాయకులతో కలిసి తెలంగాణ బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంద్రానాయక్ మాట్లాడుతూ.. తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలు, ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగుల పక్షాన శుక్రవారం తెలంగాణ వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చామని, ఈ కోవలోనే మా డిమాండ్లను వినిపించేందుకు చలో గాంధీ భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ యువతకు న్యాయం, ఖాళీ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయ డం వంటి అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతున్నామన్నారు. మా ఉద్యమం, మా నిరసన శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా కొనసాగుతుందని, రాష్ట్ర ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రజా సంఘాలు మా న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలిపి.. మా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు ఆకాశ్, నవీన్, శంకర్, శిం బు, కుమార్, సోమేశ్, గణేశ్, వినయ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

## పటాకుల పరిశ్రమ శతాబ్ది ఉత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు వేణుగోపాల్, మాణిక్ రావు తదితరులు

మారేడ్‌పల్లి, జూన్ 23: భారత బాణాసంచా పరిశ్రమ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ఫైర్ వర్క్స్ డీలర్స్ అసోసియేషన్ ( టెప్డా) ఆధ్వర్యంలో 'శతాబ్ది ఉత్సవ్' పేరుతో ప్రత్యేక వేడుకలను ఈ నెల 25, 26వ తేదీల్లో నెక్లెస్ రోడ్డు లోని పీపుల్స్ ప్లాజా లో ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షులు కె. వేణుగోపాల్, కన్వీనర్ మాణిక్ రావు లు తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ...దేశంలో వందేళ్లుగా కొనసాగుతున్న బాణాసంచా పరిశ్రమ లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు భారతీయ పండుగల సంస్కృతిలో విడదీయారాని బంధంగా నిలిచిందని అన్నారు. ఉత్సవాల్లో భాగంగా ట్యాంక్‌బండ్ చుట్టూ ఫైర్ షో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శతాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సిహెచ్. మధుసూదన్, జనరల్ సెక్రెటరీ ప్రతాప్ కుమార్, జాయింట్ సెక్రటరీ బి. జీవన్, ట్రెజరర్ బి. పూర్ణచందర్ పాల్గొన్నారు.

## నకిలీ చెక్కు కలకలం

**రూ.55 కోట్లు డ్రా చేసేందుకు యత్నం**

**బ్యాంకు అప్రమత్తతో విఫలమైన యత్నం**

ఖైరతాబాద్, జూలై 23 : ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థ బ్యాంకు ఖాతా నుంచి ఏకంగా రూ.55 కోట్లను నకిలీ చెక్కు ద్వారా కాజేసేందుకు జరిగిన భారీ కుట్రను బ్యాంకు అప్రమత్తతో ఆ ప్రయత్నం విఫలమైంది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... బెంగళూరు కేంద్రంగా పనిచేసే మైక్రో ల్యాబ్స్ కంపెనీకి ఎంజీ రోడ్డులోని కెనరా బ్యాంకు ప్రైమ్ కార్పొరేట్ బ్రాంచ్‌లో కరెంట్ ఖాతా ఉంది. ఈ ఏడాది మే 6న సోమాజిగూడలోని కెనరా బ్యాంకు బ్రాంచ్‌లో రూ. 55 కోట్ల విలువైన ఒక చెక్కు క్లియరెన్స్ కోసం డిపాజిట్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురి బ్రాంచ్‌లో ఉన్న జగత్‌సింగ్ గ్లోబల్ అకాడమీ అనే ఖాతాలోకి ఈ సొమ్మును జమ చేసేలా ఆ చెక్కును సమర్పించారు. సోమాజిగూడ బ్రాంచ్‌లో ప్రాసెస్ చేసే క్రమంలో బ్యాంకు అధికారులకు కొన్ని అంశాలు అనుమానాస్పదంగా అనిపించాయి. చెక్కుపై ఉన్న సంతకం కంపెనీ అధికారిక సంతకంతో సరిపోవడం లేదు. కంపెనీ నిబంధనల ప్రకారం అంత పెద్ద మొత్తానికి ఇద్దరు అధికారుల సంతకాలు తప్పనిసరి, కాని చెక్కుపై ఒకే సంతకం ఉండడం, బదిలీ చేయాలనుకున్న సొమ్ము రూ.55కోట్లు కావడంతో అధికారుల్లో అనుమానం బలపడింది. వెంటనే స్పందించిన బ్యాంకు అధికారులు చెక్కు కాపిని , పే ఇన్ స్లిప్‌ను జత చేస్తూ మే 6న మైక్రో ల్యాబ్స్ కంపెనీకి ఈ మెయిల్ పంపి, ఆ చెక్కు నిజమైనదా అని ధృవీకరించుకోవాలని కోరారు. కంపెనీ అధికారులు తమ రికార్డులను పరిశీలించగా, షాకింగ్ నిజం బయటపడింది. జగత్ సింగ్ గ్లోబల్ అకాడమికి తాము ఎలాంటి చెక్కు జారీ చేయలేదని తేలింది. అంతేకాకుండా ఆ చెక్కు నంబరు కంపెనీ గతంలోనే రద్దు చేసుకొని కొత్త చెక్ బుక్ ప్రింటింగ్ కోసం బ్యాంకుకే స్పెసిమెన్‌గా అప్పగించినట్లు రికార్డులో స్పష్టమైంది. రద్దు చేసిన చెక్కు కేటుగాళ్ల చేతికి ఏ విధంగా వచ్చిందనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉమెన్స్ అండ్ ట్రాన్స్‌జెండర్స్ , జేఏసీ నాయకులు, విద్యార్థులు

కవాడిగూడ, జూలై 23ః నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం దుర్మార్గమని పలువురు వక్తలు అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, పేపర్ లీకేజీకి బాధ్యులైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని,విద్యార్థుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉమెన్స్ అండ్ ట్రాన్స్‌జెండర్స్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రమా మెల్కోటే, అరుణోదయ విమలక్క, పీఓడబ్ల్యూ సంధ్య, సామాజికవేత్త సజయ, ఝాన్సీ, కొండవీటి సత్యవతి, అనురాధ, వసుదనాగరాజు, స్వరూపారావు, హ్యూమన్‌రైట్స్ ఫోరం అధ్యక్షుడు జీవన్‌కుమార్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కన్వీనర్ పి.శంకర్, ట్రాన్స్‌జెండర్స్ ఆక్టివిస్ట్ ఖాళి, బిలాల్ తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్ లీకేజీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని , పేపర్ లీకేజీ కారణంగా అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం న్యాయం కోసం పోరాడే విద్యార్థులపై లాఠీలు ఝలిపించి అక్రమ కేసులు బనాయించడం అత్యంత దారుణమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు

## బీఆర్ఎస్ నిరసనకు తరలిరండి

**గుర్రం పవన్ కుమార్ గౌడ్**

బేగంపేట్ జూలై 23: నీట్ పరీక్ష పత్రం లీక్‌పై ఢిల్లీలో విద్యార్థులు చేస్తున్న నిరసన కార్యక్రమంపై పోలీసుల జులుం నశించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక్క రోజు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ పద్మారావునగర్ డివిజన్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పేపర్ లీకేజీపై నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయకుండా విద్యార్థులపై పోలీస్ లాఠీఛార్జి వంటి కార్యక్రమాలు చేపట్టడం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు తగదని పవన్‌కుమార్ అన్నారు. ఇందిరా పార్కు వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## జోయాలుక్కాస్‌లో సేల్ ఓల్డ్ గోల్డ్

**సెక్యూర్ యువర్ ఫ్యూచర్**

Joyalukkas
World's favourite jeweller

సిటీ బ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ): తాకట్టులో ఉన్న బంగారు ఆభరణాలను సరసమైన విలువకు కొనుగోలు చేసేందుకు ప్రము ఖ్య జ్యువెల్లరీ షోరూం జోయాలుక్కాస్ సేల్ ఓల్డ్ గోల్డ్.. సెక్యూర్ యువర్ ఫ్యూచర్ ను ప్రారంభించిందని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ తెలిపారు. ఎక్కడ కొన్న బంగారాన్నైనా కేవలం 15 నిమిషాల్లో పారదర్శక, విశ్వసనీయమైన మూల్యాంకన ప్రక్రియ ద్వారా సరసమైన విలువ చెల్లిస్తుందని ఆయన వెల్లడించారు. ఈ సదుపాయం జోయాలుక్కాస్ అన్ని షోరూమ్‌లలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.